


నెపోలియన్
రూ॥ 180/-
పేజీలు: 190
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★



నవభారత నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్
భవిష్యత్తరాల కోసం కలత చెందిన దార్శనికులు
ఢాకాలో ఇజ్రాయెల్ వ్యతిరేక భారీ ప్రదర్శన
లోపలి పేజీల్లో



సంపుటి 08, సంచిక: 133 | ఆదివారం | 13-04-2025 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## దేశంలో ఉగ్రదాడులు!

నిఘా వర్గాల హెచ్చరిక

**న్యూఢిల్లీ :** భారత్‌లో ఉగ్రదాడులు జరగవచ్చని నిఘా సంస్థలు హెచ్చరికలు చేశాయి. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు దాడులకు దిగవచ్చని హెచ్చరించాయి. ఇప్పటికే రైల్వేశాఖను అప్రమత్తం చేశాయి. డ్రోన్, ఐఇడితో ఉగ్రవాదులు దాడులు చేసే అవకాశం ఉందని వెల్లడించాయి. నదీమార్గాల ద్వారా తీవ్రవాదులు చొరబడవచ్చని చెప్పాయి. 26/11 ముంబయి దాడుల్లో కీలక కుట్రదారు అయిన తహవ్వుర్ రాణాను అమెరికా నుంచి భారత్‌కు తీసుకువచ్చి విచారిస్తోన్న తరుణంలో ఈ అలర్ట్ రావడం గమనార్హం. 2008

తరువాయి 2లో

## బిసి కోటాకు చట్టబద్ధత బాధ్యత
# కేంద్ర ప్రభుత్వానిదే




మావోయిస్టులు శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేనట్లుగా వ్యవహరిస్తోంది. రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలకు మనుషులను చంపే అధికారం లేదు. ఎవరు తప్పు చేసినా చట్ట ప్రకారం మాత్రమే శిక్షించాలి. కేంద్ర బలగాల ద్వారా మావోయిస్టులను వేటాడి, వెంటాడి చంపడం సరైందికాది. మావోస్టులతో చర్చలకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే తగిన వాతావరణం కల్పించాలి.
– కూనంనేని సాంబశివరావు

- రాజ్యాంగ సవరణ చేసి ప్రత్యేక చట్టం తీసుకురావలసిందే
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్
- అధికారాన్ని అడ్డంపెట్టుకుని వక్ఫ్ చట్టాన్ని సవరించడం సరైంది కాదని వ్యాఖ్య
- వక్ఫ్ బోర్డులో, భూములలో అక్రమాలు జరిగితే ప్రస్తుత చట్టం ప్రకారమే సరిదిద్దవచ్చు

ప్రజాపక్షం/హైదరాబాద్

బిసి రిజర్వేషన్ల పెంపుకు చట్టబద్ధత కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. రిజర్వేషన్ల పెంపునకు సంబంధించి సుప్రీంకోర్టు అభ్యంతరాలు ఉన్న నేపథ్యంలో బిసి రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించేందుకు రాజ్యాంగ సవరణ చేసి ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. తద్వారా తరతరాలుగా వెనకబాటుకు గురైన బిసి, అణగారిన వర్గాలకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శాసనసభలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లును తీసుకురావడం జరిగిందని, దీనికి చట్ట బద్ధత కల్పించాల్సింది కేంద్రమేనని అన్నారు. హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఐ జాతీయ కార్య వర్గ సభ్యురాలు పశ్య పద్మ, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యంతో కలిసి ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పరిపాలనను గాలికి వదిలివేసి మత ప్రాదిపదికన విభజన రాజకీయాలతో పాటు రాష్ట్రాల మధ్య వైషమ్యాలకు పాల్పడుతోందని . దేశానికే బిజెపి ప్రమాదకరంగా మారిందని, ప్రజలంతా ఏకమై రాజకీయంగా ఆ పార్టీకి బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. దేశంలో వేల సంవత్సరాలుగా చరిత్రలో విభిన్నమైన సంప్రదాయాలు, సంస్కృతులు ఉన్నాయని వీటి మధ్య చిచ్చులు పెడుతూ బిజెపి మతాన్ని రెచ్చగొట్టి ఓట్ల ద్వారా గద్దెనెక్కుతోందన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని వక్ఫ్ బోర్డు చట్టాన్ని సవరించడం సరైంది కాదన్నారు. మతాల ఆధారంగా ఎవరి ధార్మిక సంస్థలు వారికి ఉన్నాయని, వాటిలో ప్రభుత్వం కలుగజేసుకోవడం ఎంత మాత్రం సరికాదన్నారు. ఒకవేళ వక్ఫ్ బోర్డులో, భూములలో అక్రమాలు చోటుచేసుకుంటే వాటిని ప్రస్తుతం ఉన్న చట్టం ప్రకారమే సరిదిద్దవచ్చన్నారు. చట్ట సవరణ పేరుతో వక్ఫ్ బోర్డులో ఇతర సామాజికవర్గాల వారిని సభ్యులు చేర్చడం వెనక ఏదో కుట్ర దాగుందని అనుమానం వ్యక్తం అవుతోందన్నారు.

**దక్షిణాది రాష్ట్రాలు భారత్‌లో భాగం కాదా?**

పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనలో చేయాల్సివస్తే అన్ని రాష్ట్రాలకు సమ న్యాయం చేయాల్సిందేనని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. అప్పటి కేంద్ర ప్రభుత్వం పిలుపు మేరకు దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రించడంలో

తరువాయి 2లో



# మూడు నెలలే

- గవర్నరు పంపిన బిల్లులపై రాష్ట్రపతి తుది నిర్ణయానికి గడువు
- మంత్రివర్గ సలహాలకు గవర్నర్లు కట్టుబడి పనిచేయాలి
- ఎన్నికైన ప్రజాప్రభుత్వ పనితీరుకు ఆటంకాలు సృష్టించకూడదు
- గవర్నర్ల క్రియారాహిత్యం కోర్టు పరిధిలోకి వస్తుంది
- 415 పేజీల కీలకతీర్పులో సుప్రీంకోర్టు స్పష్టీకరణ

**న్యూఢిల్లీ :** అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను రాష్ట్ర గవర్నర్ పంపితే మూడు నెలల్లో రాష్ట్రపతి తుది నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు మొట్టమొదటిసారి గడువు ప్రకటించింది. గవర్నర్ వద్దకు బిల్లులు వచ్చిన తేదీ నుండి మూడు నెలలలోపు వీటిని పరిష్కరించాలనీ, రాష్ట్రపతి పరిశీలనకు పంపకపోతే గవర్నరు నెలరోజుల్లోపు రాజ్యాంగబద్ధంగా బిలుల్లను రాష్ట్ర ప్రభుత్వానికి తిప్పి పంపాలని సుప్రీంకోర్టు శనివారంనాడు స్పష్టం చేసింది. ప్రజలు ఎన్నుకున్న ప్రజాస్వామ్యం యంత్రాంగానికి ఆటంకాలు సృష్టించకూడదని పేర్కొంది. గవర్నర్ మంత్రి వర్గం సలహాల మేరకు నడచుకోవాలని పేర్కొంది. అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులను తనవద్ద ఉంచుకోవాలంటే అన్ని రాష్ట్రాల గవర్నర్లూ పాటించాల్సిన విధివిధానాలు, వారికి ఉన్న కాల పరిమితులూ

తరువాయి 2లో

## చరిత్రలో తొలిసారి...

చట్టాలుగా గవర్నర్ వద్ద పెండింగ్ బిల్లులు

**చెన్నై:** పెండింగ్ బిల్లుల విషయంలో సుప్రీంకోర్టు సంచలన తీర్పు ఇచ్చిన వేళ... తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాజ్యాంగ చరిత్రలో తొలిసారి రాష్ట్రపతి, గవర్నర్ ఆమోదం లేకుండానే రాష్ట్ర ప్రభుత్వం 10 చట్టాలను నోటిఫై చేసింది. ఈ మేరకు శనివారం గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చింది. శాసన సభ ఆమోదించిన బిల్లులను గవర్నర్ ఆర్‌ఎన్ రవికి పంపగా... ఆయన ఎలాంటి సమాధానం ఇవ్వకుండా వాటిని తనవద్దే ఉంచేసుకుంటున్నారని తమిళనాడు ప్రభుత్వం ఆరోపించిన సంగతి

తరువాయి 2లో



## మరోసారి తుపాకుల గర్జన

ఛత్తీస్‌గడ్‌లో ఎదురుకాల్పులు
ముగ్గురు మావోయిస్టులు హతం
నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో ఘటన

ప్రజాపక్షం/భద్రాచలం

సరిహద్దున గల ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బిజాపూర్ జిల్లాలో చోటు చేసుకున్న ఎదురు కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఘటనను జిల్లా ఎస్‌పి జితేంద్ర కుమార్ యాదవ్ ధృవీకరించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం, బీజాపూర్ జిల్లా ఇంద్రావతి నదీ తీర సమీపంలోని నేషల్‌పార్క్ అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కదలికలు ఉన్నాయనే పక్కా సమాచారం

తరువాయి 2లో

## రాష్ట్ర ప్రయోజనాలు
# బిఆర్‌ఎస్‌కు పట్టవా?




- అభివృద్ధిపై ఎందుకు విషం కక్కుతున్నారు
- 400 ఎకరాల భూమికి సంబంధించి బ్యాంకు రుణం తీసుకోలేదు
- డిబెంచర్ బాండ్ల ద్వారానే రూ.10వేల కోట్లు సేకరణ
- వాటిని సంక్షేమ పథకాలకు ఖర్చుచేశాం
- మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టీకరణ

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో మూసీ నది ప్రక్షాళన చెంది స్వచ్ఛమైన పర్యావరణం ఉండొద్దా, రాష్ట్ర అభివృద్ధికి పెట్టుబడులు రావొద్దా, పరిశ్రమలు వచ్చి ఉద్యోగాలు సృష్టించబడొద్దా? అని బిఆర్‌ఎస్ నేత కెటిఆర్‌ను పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రశ్నించారు. బిఆర్‌ఎస్‌కు రాష్ట్ర ప్రయోజనాలు అవసరమా లేదా? అభివృద్ధికి సంబంధించి ఎందుకు విషం కక్కుతున్నారని నిలదీశారు. టిజిఐఐసి ద్వారా 400 ఎకరాల భూమికి సంబంధించి ఐసిఐసిఐ బ్యాంక్ ప్రభుత్వం రుణం తీసుకోలేదని, డిబెంచర్ బాండ్ల ద్వారానే రూ.10వేల కోట్లు

తరువాయి 2లో

" టిజిఐఐసి ద్వారా 400 ఎకరాల భూమిపై బాండ్ల ద్వారా ఇప్పటి వరకు రూ.8,557 కోట్లు సమీకరించాం. వాటిని రైతు రుణమాఫీకి రూ.2.146 కోట్లు, రైతు భరోసాకు రూ.5,466 కోట్లు, సన్నబియ్యానికి రూ.945 కోట్లు ఖర్చు చేశాం."

"కాంగ్రెస్‌లో అందరూ సమర్థవంతులే, వారి నుంచి సమర్థులైన రేవంత్‌రెడ్డిని ఎఐసిసి ముఖ్యమంత్రిగా నియమించింది. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ఒక్క అవినీతి లేకుండా సిఎం పరిపాలన అందిస్తున్నారు. రేవంత్ రెడ్డి సిఎంగా ఉండి తీరుతారు."

## వక్ఫ్ చట్టసవరణతో
# రాజ్యాంగానికి తూట్లు

- మతాలు, కులాల పేరిట దేశాన్ని విభజించడమే...
- మతోన్మాద బిజెపికి ఇప్పుడు ముస్లింల మీద ఎనలేని ప్రేమ ఎందుకో?
- వక్ఫ్ సవరణకు కోటి వినతులు స్వీకరించినట్లు కేంద్రం చెప్పడం హాస్యాస్పదమే
- చట్టాన్ని నిరసిస్తూ రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు ఉద్ఘాటన




ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం వక్ఫ్‌బోర్డు చట్ట సవరణ చేయడం ద్వారా కేవలం ముస్లింల హక్కులను మాత్రమే కాలరాయలేదని, మైనార్టీ వర్గాలతో పాటు ఎస్‌సి,ఎస్‌టి, బిసి, అణగారిన వర్గాలకు రక్షణ కవచంగా ఉన్న రాజ్యాంగానికి తూట్లు పొడించిందని పలువురు వక్తలు అగ్రహాం వ్యక్తంచేశారు. వక్ఫ్ బోర్డు సవరణ చట్టం2024ను నిరసిస్తూ అమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అఖిలపక్షం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధరక్ భవన్‌లో శనివారం ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్.డి.సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ రౌండ్ టేండ్ సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్‌పాషా, టిపిసిసి ఉపాధ్యక్షులు

తరువాయి 2లో




నేషనల్ హెరాల్డ్ కేసులో
## ఆస్తుల స్వాధీనం

సోనియా, రాహుల్‌కు ఇడి షాక్

**న్యూఢిల్లీ :** నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు దర్యాప్తు క్రమంలో జప్తు చేసిన రూ.661 కోట్ల విలువైన స్థిరాస్తులను స్వాధీనం చేసుకునేందుకు తాజాగా నోటీసులు జారీ చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ప్రకటించింది. ఢిల్లీ, ముంబయి, లక్నోల్లోని ఆస్తులపై ఈ మేరకు నోటీసులను అతికించినట్లు ఓ ప్రకటనలో తెలిపింది. సంబంధిత ఆస్తులను ఖాళీ చేయాలని, లేదా

తరువాయి 2లో

తాకట్టుపై టిజిఐఐసికి
## ఏ రుణమూ ఇవ్వలేదు

ఐసిఐసిఐ బ్యాంకు స్పష్టీకరణ

**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర పరిశ్రమలు, మౌలికవసతుల కార్పొరేటషన్ (టిజిఐఐసి)కి తాము తాకట్టుపై ఎలాంటి రుణం ఇవ్వలేదని ఐసిఐసిఐ బ్యాంకు స్పష్టం చేసింది. తమకు టిజిఐఐసి ఏ భూమిని తాకట్టుపెట్టలేదని తెలిపింది. కంచ గచ్చిబౌలి భూములకు సంబంధించి ఐసిఐసిఐ రుణం ఎలా ఇస్తుందని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించింది. తాము టిజిఐఐసికి వచ్చిన బాండ్ల జారీని నగదు చేసుకునేందుకు అకౌంట్ బ్యాంక్‌గా వ్యవహరించామని ఐసిఐసిఐ బ్యాంకు ఒక ప్రకటనలో వివరణ ఇచ్చింది.

## రష్యాపై అమెరికా
# ఆంక్షల ఎత్తివేత?



అమెరికా అధ్యక్ష ప్రతినిధి స్టీవ్ విట్‌కాఫ్, రష్యా అధ్యక్షుడు పుతిన్ చర్చల్లో పురోగతి

ఉక్రేన్‌లో కాల్పుల విరమణ దిశగా ఆచరణాత్మక చర్యలకు ముందుకు కదలాలని విట్‌కాఫ్ విజ్ఞప్తి

**మాస్కో :** అమెరికా అధ్యక్ష ప్రతినిధి, ప్రత్యేక దూత స్టీవ్ విట్‌కాఫ్ శనివారంనాడు రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్‌తో సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో దాదాపు నాలుగు గంటలుపైగా చర్చలు జరిపారు. రష్యాపై ఉన్న ఆంక్షల ఎత్తివేత దిశగా చర్చల్లో పురోగతి సాధించినట్లు అమెరికా ఆర్థిక వ్యవస్థ నిపుణులు జెఫ్రీ సాచ్ శనివారంనాడు టాస్ వార్తాసంస్థకు చెప్పారు. ఈ చర్చలు చాలా మంది పురోగత సాధించాయి, మేం చాలా ఆశాభావంతో ఉన్నాం అని సాచ్ అన్నారు. నా అంచనా ప్రకారం, రష్యాపై అమెరికా విధించిన ఆంక్షల ఎత్తివేత దిశగా చర్చలు ఎతో సానుకూల ఫలితాలను ఇచ్చాయన్నారు. అదేవిధంగా ఉక్రేన్‌లో కాల్పుల విరమణ దిశగా ఆచరణాత్మక చర్యలకు ముందుకు కదలాలని కూడా విట్‌కాప్ పుతిన్‌ను ఈ చర్చల్లో కోరారు. న్యూయార్క్‌లోని కొలంబియా విశ్వవిద్యాలయంలోని 'స్థిరమైన అభివృద్ధి'

తరువాయి 12లో

పద్మశ్రీ అవార్డు గ్రహీత
## వనజీవి రామయ్య కన్నుమూత

సిఎం రేవంత్‌రెడ్డితో సహా పలువురు నివాళి

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్



పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య(87) శనివారం మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ... తెల్లవారుజామున ఖమ్మం జిల్లా రూరల్ మండలంలోని ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలో గల రెడ్డిపల్లి గ్రామంలో ఉన్న ఆయన నివాసంలో తుదిశ్వాస విడిచారు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి చికిత్స కోసం తీసుకుని వెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు. కాగా రామయ్య కేంద్ర ప్రభుత్వం నుంచి 2017లో పద్మశ్రీ అవార్డును అందుకున్నారు. సామాజిక సేవను గుర్తించి మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు ఆయన జీవిత చరిత్రను పాఠ్యాంశాలలో పొందుపరిచారు. అందుకు తగ్గట్టుగానే ఆయన సైతం తనకు ఎంతో ఇష్టమైన మొక్కల పేర్లను వనజీవిగా మార్చుకున్నారు. అలాగే తన నలుగురు మనుమళ్లు, మనుమరాళ్లకు చందనపుష్ప, హరిత లావణ్య, కబంధపుష్ప, వనశ్రీ అని చెట్ల పేర్లను పెట్టుకున్నారు. తన తుది శ్వాస విడిచేంత వరకు మొక్కలు నాటడం, విత్తనాలను సేకరించడంలో నిమగ్నమయ్యారు. కోటికి పైగా మొక్కలు నాటిన రామయ్య మృతి చెందడం పట్ల ప్రధానీ మోడీ, రెండు తెలుగు రాష్ట్రాల సీఎంలు ఎనుముల రేవంత్ రెడ్డి, నార చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎంలు మల్లు భట్టి విక్రమార్క,

తరువాయి 12లో

## పైలట్ ప్రాజెక్టుగా
# భూభారతి పోర్టల్

ఎంపిక చేసిన మూడు మండలాల్లో నిర్వహించాలి
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం

ప్రజాపక్షం/ హైదరాబాద్

రాష్ట్రంలోని ఎంపిక చేసిన మూడు మండలాల్లో భూ భారతి పోర్టల్ పైలట్ ప్రాజెక్టు నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి రెవెన్యూ శాఖను ఆదేశించారు. పైలట్ ప్రాజెక్టులో ప్రజల నుంచి వచ్చే సలహాలు, సూచనలను స్వీకరించి పోర్టల్‌ను మరింత బలోపేతం చేయాలని అధికారులకు సూచించారు. భూ భారతిపై అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం సమీక్షించారు. సమావేశంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ నెల 14 న భూ భారతి పోర్టల్ ప్రారంభోత్సవం చేసిన అనంతరం భూ భారతి పోర్టల్‌పై ప్రతీ మండలంలో అవగాహన సదస్సులు నిర్వహించాలని సిఎం సూచించారు. ఈ సందర్భఃగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో అవగాహన కలిగించేలా అన్ని మండలాల్లో అవగాహన సదస్సులు నిర్వహించే బాధ్యత కలెక్టర్లకు అప్పగించాలని సిఎం అధికారులను ఆదేశించారు. ప్రజలకు సౌకర్యంగా ఉండే విధంగా భూ భారతి పోర్టల్ ఉండాలన్నారు.




## రోడ్లపై నిర్లక్ష్యం వహిస్తే
# బ్లాక్‌లిస్ట్‌లోకే...

కాంట్రాక్టర్లను హెచ్చరించిన మంత్రి సీతక్క
ఉమ్మడి వరంగల్ జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషి చేద్దాం
పనులు నాణ్యతగా ఉంటేనే బిల్లులు చెల్లిస్తామని వ్యాఖ్య
సమన్వయంతో ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి కృషిచేయాలని సూచన

ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి

ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో ఉమ్మడి వరంగల్ జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ సీతక్క అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో ఉమ్మడి వరంగల్ జిల్లా పంచాయతీరాజ్ మిషన్ భగీరథ, మహిళా, శిశు సంక్షేమ శాఖలపై మంత్రి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, రోడ్డు అభివృద్ధి పనులను చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సంబంధిత టెండర్ దారులను బ్లాక్ లిస్టు లో పెట్టాలన్నారు. రోడ్ల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఎలాంటి బేషజాలు లేకుండా ఉమ్మడి వరంగల్ జిల్లాను సమగ్రంగా అభివృద్ధి చేసుకుందామని అన్నారు. హైదరాబాద్ తర్వాత రెండో పెద్ద జిల్లా అయిన వరంగల్ ను అభివృద్ధి చేసుకోవడానికి

తరువాయి 12లో

# ప్రపంచం
WORLD NEWS

## గబాన్‌లో అధ్యక్ష ఎన్నికలు

**లిబ్రెవిల్లే :** పశ్చిమ ఆఫ్రికా దేశం గబాన్‌లో అధ్యక్ష పదవికి శనివారంనాడు పోలింగ్ ప్రక్రియ పూర్తయింది. 2023లో ఆ దేశంలో సైనిక కుట్ర జరిగిన తర్వాత మొదటిసారి అధ్యక్ష పదవికి ఎన్నికలు జరుగుతున్నాయి. 9.20 లక్షలమంది అర్హులైన ఓటర్లు దేశంలో ఉన్నారు. వీరిలో 28వేలమంది విదేశాలలో ఉంటున్న గబాన్ జాతీయులు. వీరికోసం 3000 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అపారమైన చమురు నిక్షేపాల సంపద గబాన్‌లో ఉన్నప్పటికీ 23 లక్షలమంది ప్రజలు దేశంలో పేదరికంలో బతుకుతున్నారు. 2023లో అలీబాంగో మూడోసారి అధ్యక్ష పదవికి ఎన్నిక కాగానే సైనికులు కుట్రచేసి అధికారం స్వాధీనం చేసుకున్నారు. పార్లమెంటును, న్యాయవ్యవస్థను, ఇతర వ్యవస్థలను రద్దుచేసి తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు చేశారు. పశ్చిమ దేశాలకు మిత్రుడుగా ఉంటానని జుంటా నాయకుడడు బ్రైస్ ఒలిగుయ్ న్గుమా అమెరికా,ఫ్రాన్స్‌దేశాలకు వాగ్దానం చేశారు. సైనిక కుట్ర తర్వాత దేశంలో అధ్యక్ష పదవికి ఎన్నికలు జరగడం ఇదే. ఈ అధ్యక్ష ఎన్నికల్లో సైనిక కుట్ర చేసిన తాత్కాలిక నాయకుడు బ్రైస్ ఒలిగుయ్ న్గుమా గెలుస్తారని అందరూ అంచనావేస్తున్నారు. అధ్యక్ష పదవికి ఎనిమిదిమంది పోటీ పడుతున్నారు.

# ఢాకాలో ఇజ్రాయెల్ వ్యతిరేక భారీ ప్రదర్శన





**ఢాకా :** పాలస్తీనియన్లపై దారుణహింసాకాండ తక్షణం నిలిపివేయాలని కోరుతూ బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో శనివారంనాడు వేలాది మంది నిరసన ప్రదర్శన జరిపారు. ఢాకాలో మునుపు ఎన్నడూ ఇంత భారీస్థాయిలో నిరసన ప్రదర్శన జరగలేదని పరిశీలకులు చెప్పారు. పలు రాజకీయపార్టీలు, సంఘాలు, మత సంస్థలు ఈ ప్రదర్శనలో పాలుపంచుకున్నాయి. దేశంలోని వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన ప్రజలు ఢాకా సుహ్రావర్ది ఉద్యాన్ ప్రాంతంలో ఏకమై అక్కడి నుండి భారీ ప్రదర్శన నిర్వహించారు. మధ్యాహ్నం మూడు గంటలకు ప్రదర్శన ప్రారంభమైనప్పటికీ ఢాకాకు దేశంలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రదర్శకులు ఉదయమే సుహ్రావర్ది ఉద్యాన్‌కు చేరుకున్నారు. మాగ్రిభ్ ప్రార్థన జరిగేవరకూ ఈ ప్రదర్శన కొనసాగుతుంది. ఢాకాలోని షాభాగ్, డోయల్ ఛత్తార్, నీల్‌ఖేత్ తదితర ప్రాంతాల నుండి ప్రజలు పెద్దసంఖ్యలో ఉద్యాన్‌కు తరలివచ్చారు. బంగ్లాదేశ్, పాలస్తినా జాతీయ పతాకాలను చేతబట్టిన ప్రదర్శకులు ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు.

**మూడు వారాల్లో 221 దాడులు**

**1,540 మంది పాలస్తీనియన్లు మృతి**

పాలస్తినాపై గడచిన మూడు వారాలుగా ఇజ్రాయెల్ 221 దాడులు చేసింది. ఈ దాడుల్లో 1,540 మంది పాలస్తినా ప్రజలు మరణించారు. పాలస్తినాలో భయానక పరిస్థితులు నెలకున్నాయనీ, గాజా చివరకు ఒక మృత్యుకేంద్రంగా మారిందని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్ వ్యాఖ్యానించారు. గడచిన 24 గంటల్లో 36 నివాసిత ప్రాంతాలపై ఇజ్రాయెల్ సైన్యం గగనతల దాడులు చేసింది. ఐదుగురు మరణించారు. కాగా రఫా ప్రాంతాన్ని చుట్టుముట్టే కార్యక్రమం పూర్తయిందని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిన ఇజ్రాయెల్ బందీలను బేషరతుగా అప్పటించాలని కోరుతూ మార్చి 18 నుండి ఇప్పటివరకూ జరిపిన దాడుల్లో ఎక్కువమంది మహిళలు, పిల్లలే మరణించారనీ, వీరితోపాటు జర్నలిస్టులపై కూడా ప్రత్యేకంగా గురిపెట్టి సైన్యం చంపిందని పాలస్తినా ఆరోగ్యమంత్రిత్వశాఖ ప్రకటించింది. తాజాగా గాజాలో నీటి సంక్షోభం ఏర్పడింది. ప్రధాన పైపులైను ధ్వంసమైంది. మార్చి రెండో తేదీ నుండి గాజాలోకి ఆహారం, ఇతర సహాయం రాకుండా ఇజ్రాయెల్ సైన్యం అడ్డుకోవడంతో గాజాలో దాదాపు కరువు పరిస్థితులు నెలకున్నాయి.

**కైరోలో మధ్యవర్తులతో హమాస్ చర్చలు**

గాజా హింసాకాండ పరిస్థితిపై హమాస్ ప్రతినిధిబృందం శనివారం నాడు కైరోలో మధ్యవర్తులతో చర్చించింది. చర్చల్లో నిజమైన పురోగతి సాధించినప్పుడే చర్చలకు ఒక అర్థం ఉంటుందని, సమస్య పరిష్కార మార్గాలు ఏర్పడతాయని హమాస్ ఉద్ఘాటించింది. ఈజిప్టు మధ్యవర్తులతో హమాస్ అధికార ప్రతినిధులు ఈ చర్చల్లో పాల్గొన్నారు. గాజాలోని అనేక ప్రాంతాలలో భూతలదాడులు, గగనతల దాడులు ఇజ్రాయెల్ సైన్యం కొనసాగిస్తున్నది. ఇజ్రాయెల్ బందీలను విడుదల చేసేందుకు వీలుగా ఒక ఒప్పందం చేసుకోవాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సలహా ఇచ్చిన చాలా రోజుల తర్వాత ఈజిప్టు ప్రతినిధులతో కైరోలో ఈ చర్చలు జరిగాయి. హమాస్ ఉగ్రవాదులవద్ద ఇంకా 59 మంది బందీలను ఉన్నారని ఇజ్రాయెల్ చెబుతున్నది.

# ట్రంప్ హత్యాయత్నం కేసులో నిందితుడు అరెస్టు



**బట్లర్ :** అమెరికా అధ్యక్షుడు డోనాల్‌ట్రంప్‌పై గత ఏడాది హత్యాప్రయత్నం చేసి తప్పించుకున్న వ్యక్తిని అరెస్టు చేశారు. హత్య, అక్రమ వలస, కస్టమ్స్ చట్టాల కింద అతడిపై ఫెడరల్ అధికారులు కేసులు నమోదు చేశారు. 14వ తేదీ సోమవారంనాడు అతడిపై సమగ్ర విచారణ జరుగుతుంది. సతాన్ పేరుతో చలామణీ అవుతున్న 32 ఏళ్ళ వయసుగల వ్యక్తి షాన్ మోన్‌పెర్ పెన్సిల్వేనియా రాష్ట్రం బట్లర్‌కు చెందినవాడు. 2024 జులైలో ట్రంప్ ఉద్ధృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో ఆయనపై తుపాకీ కాల్పులు జరిపాడు మోన్‌పెర్. ట్రంప్ చెవి మీద నుండి బుల్లెట్ దూసుకుపోవడంతో ఆయన తృటిలో ప్రాణాపాయం నుండి తప్పించుకున్నారు. ఏదో గొప్ప కార్యం సాధించడానికే దేవుడు తనను పంపాడనీ, ందుకే తనను దేవుడు బ్రతికించాడనీ ఆనాడు ట్రంప్ వ్యాఖ్యానించారు. గత ఏడాది జులై 13న బట్లర్ పట్టణంలో ప్రచారంలో పాల్గొన్న సందర్భంగా ట్రంప్‌పై ఈ కాల్పుల దాడి జరిగింది. ట్రంప్‌ను చంపుతానని తన ఇంటి నుండి అతగాడు యూట్యూబ్ ద్వారా బెదిరింపుల వీడియోలు చేస్తూ ఉండటంతో ఎఫ్‌బిఐ అధికారులు అతడిజాడ కనుగొని అరెస్టు చేశారు.

## తుపాకుల గర్జన (మొదటి పేజీ తరువాయి)

మేరకు బీజాపూర్, దంతెవాడ జిలాల్లకు చెందిన డిఆర్‌జి, ఎస్‌టిఎఫ్, కోబ్రా 210,202 బెయాలియన్‌లకు చెందిన బలగాలు శుక్రవారం సాయంత్రం నుండి సంయుక్త ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం ఉదయం వరకు నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో బలగాలు తారసపడ్డాయి. ఈ క్రమంలో పోలీసుల రాకను పసిగట్టిన మావోయిస్టులు ఒక్కసారిగా కాల్పులకు దిగాయి. ఆత్మరక్షణ కోసం బలగాలు సైతం కాల్పులు జరపడంతో ఇరు వర్గాల మధ్య సుమారు గంటపాటు హోరాహోరీ ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. కాల్పుల అనంతరం సంఘటనా స్థలాన్ని పరిశీలించిన భద్రతా బలగాలకు ముగ్గురు మావోయిస్టు మృత దేహాలతోపాటు కిట్‌బ్యాగ్‌లు, ట్వెల్‌బోర్ తుపాకులు, ఒక సింగల్ షాట్ రైఫల్ లభ్యమయ్యాయి. మృతులను బీజాపూర్ ఆస్పత్రికి తరలించగా, వారిలో ఒకరు మట్వాడా లోకల్ ఆర్గనైజేషన్ స్కాడ్ కమాండర్‌గా గుర్తించారు. గుర్తించారు. 2025 జనవరి 6 జిజాపూర్ జిల్లా బెద్రికుట్రు మార్గంలో అంబేలి సమీపంలో 50 కిలోల శక్తివంతమైన మందుపాతరను ఏర్పాటు చేసి కూంబింగ్ ఆపరేషన్‌కు వెళ్లి తిరుగుప్రయాణంలో ఉన్న వాహనాన్ని పేల్చి 8 మంది జవాన్లతోపాటు ఒక డ్రైవర్ హతమార్చిన ఘటనలో ప్రధాన సూత్రధారిగా ఉన్న అనీల్ పూనెంగా గుర్తించారు. మిగిలిన ఇద్దరిని గుర్తించాల్సి ఉంది. నేషనల్ పార్క్ ఏరియాలో తప్పించుకున్న మావోయిస్టుల కోసం కూంబింగ్ కొనసాగుతోందని జిల్లా ఎస్‌పి తెలిపారు.

## ఆస్తుల స్వాధీనం (మొదటి పేజీ తరువాయి)

వాటికి వచ్చే అద్దెలను బదిలీ చేయాలని అందులో పేర్కొంది. పిఎంఎల్‌ఎ చట్టం కింద ఈమేరకు చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది. నేషనల్ హెరాల్డ్ పత్రికకు అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఎజెఎల్) ప్రచురణకర్తగా ఉంది. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్ సహా కొందరు పార్టీ నేతలు ప్రమోటర్లుగా ఉన్న యంగ్ ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్ దానికి యాజమాన్య సంస్థ. కాంగ్రెస్‌కు ఎజెఎల్ బకాయి పడ్డ రూ.90 కోట్లను వసూలు చేసుకునే విషయంలో యంగ్ ఇండియన్‌లో ఆర్థిక అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ఇడి దర్యాప్తు చేస్తోంది. ఇందులో భాగంగా 2023 నవంబరులో సంబంధిత స్థిరాస్తులతోపాటు ఎజెఎల్‌లో ఈక్విటీ షేర్ల రూపంలో ఉన్న యంగ్ ఇండియన్‌కు చెందిన రూ.90.21 కోట్లు జప్తు చేసింది. ఈ కేసులో సోనియా, రాహుల్ గాంధీలతోపాటు ప్రస్తుత కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీనియర్ నేత పవన్ కుమార్ బన్సల్‌లను ఇడి ఇప్పటికే విచారించింది. వారి స్టేట్‌మెంట్లనూ రికార్డు చేసింది. తాజాగా సంబంధిత స్థిరాస్తుల స్వాధీనానికి నోటీసులు జారీ చేసింది.

## చరిత్రలో తొలిసారి..(మొదటి పేజీ తరువాయి)

తెలిసిందే. దీనిపై 2023లో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. బిల్లులకు సమ్మతి తెలపకపోవడం, పునఃపరిశీలించాలని సూచిస్తూ వెనక్కి కూడా పంపడం లేదని తెలిపింది. రెండోసారి ఆమోదించిన బిల్లుల విషయంలోను ఆయన తీరు మారలేదని పిటిషన్‌లో పేర్కొంది. ఈ వ్యవహారంపై ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. తమిళనాడు శాసనసభ ఆమోదించిన పది బిల్లులను గవర్నర్ ఆర్.ఎన్.రవి తొక్కిపెట్టడం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. ఏదైనా బిల్లును మంత్రిమండలి సలహా మేరకు రాష్ట్రపతి ఆమోదం కోసం నిలిపి ఉంచాల్సివస్తే అందుకు గవర్నర్ తీసుకోదగిన అత్యధిక గడువు ఒక నెల మాత్రమేనని సంచలనాత్మక తీర్పు వెలువరించింది. శాసనసభ ఆమోదించిన బిల్లులపై గవర్నర్ నిర్దిష్ట గడువులోగా చర్యలు తీసుకోవాలని పేర్కొంది. పెండింగులో పెట్టిన పది బిల్లులు గవర్నర్ ఆమోదం పొందినట్టే భావించాలని స్పష్టంచేసింది.

## రాష్ట్రంలో రాగల మూడు రోజులు వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రాగల మూడు రోజులు కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఇదే సమయంలో గంటకు 30 నుంచి 40కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయన్నారు. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలోని అల్పపీడనానికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని అధికారులు తెలిపారు. సగటున సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించిందని పేర్కొన్నారు. ఈ ప్రభావం కారణంగా రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో తుఫానుతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అంచనా వేస్తోంది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణలోని నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

## కేంద్ర ప్రభుత్వానిదే (మొదటి పేజీ తరువాయి)

అగ్ర భాగంలో ఉన్న నేపథ్యంలో జనాభా ప్రతిపాదినక పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయన్నారు. కేంద్ర ప్రభుత్వం త్రిభాషా సిద్ధాంతంతో ఘర్షణలు సృష్టించి రెచ్చగొడుతూ ఎప్పటికీ తామే అధికారంలో ఉండేలా కుట్ర పన్నుతోందని విమర్శించారు. దక్షిణాది రాష్ట్రాలు భారతదేశంలో భాగం కాదా అని సాంబశివరావు ప్రశ్నించారు. బిజెపి వారికి హిందీ భాషపై ప్రేమలేదని, కేవలం అధికారం కోసం ఇలాంటి చర్యలకు పాల్పడుతూ రాష్ట్రాల మధ్య వైషమ్యాలకు పాల్పడుతోందని మండిపడ్డారు.

**కేంద్రం తక్షణం తెలంగాణాకు నిధులు విడుదల చేయాలి**

తెలంగాణ రాష్ట్రం పూర్తిగా అప్పుల ఊబిలో కూరుకుపోయి కోలుకోలేని పరిస్థితి ఉన్న నేపథ్యంలో రాష్ట్రానికి రావాల్సిన నిధులను ఇచ్చి ఆదుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం తెలంగాణాపై కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతోందని కూనంనేని సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ కు ఒక న్యాయం, తెలంగాణకు మరో న్యాయం అన్నట్లుగా వ్యవహరిస్తోందని, ఇది సరైంది కాదన్నారు. చట్టబద్ధంగా రాష్ట్రానికి రావాల్సిన నిధులను తక్షణమే విడుదల చేయాలని, ఇందుకు బిజెపి రాష్ట్ర నేతలు కూడా సహకరించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభానికి గత బిఆర్‌ఎస్ సర్కారే కారణమని, బిఆర్‌ఎస్ తప్పుడు విధానాల వల్లే రాష్ట్రానికి ఈ గతి పట్టిందని కూనంనేని సాంబశివరావు విమర్శించారు.

**బిఆర్‌ఎస్‌తో కలిసి పనిచేసే అలోచన లేదు**

బిఆర్‌ఎస్‌తో కలిసి పనిచేసే అలోచన సిపిఐకి లేదని కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. బిసి రిజర్వేషన్లపై కవిత బిజెపిపై యుద్ధం చేయాలని ఆయన సూచించారు. కాంగ్రెస్ సర్కార్ ప్రభుత్వ భూములు అమ్మడం సరైంది కాదన్నారు. సెంట్రల్ యూనివర్శిటీ భూములపై ప్రభుత్వం చర్చలు జరపడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. సెంట్రల్ యూనివర్శిటీ భూముల విక్రయం వ్యవహారంలో బిజెపి ఎంపి ఎవరు ఉన్నారో మాజీ మంత్రి కె.తారకరామారావు బయట పెట్టాలని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. గత సిఎం కె.చంద్రశేఖరరావు హాయంలో ఆర్‌టిసి, సింగరేణి లాంటి సంస్థల్లో యూనియన్లు లేకుండా చేయాలని ప్రయత్నం చేశారన్నారు. ఆర్‌టిసి, సింగరేణి, జెన్‌కో లాంటి సంస్థల్లో కార్మికులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, వారంతా సమ్మెలు చేయకుండా ప్రభుత్వం కార్మికులతో చర్చలు జరపాలని, ఆ సంస్థలను కాపాడుకోవాలన్నారు. ఉస్మానియా యూనివర్శిటీలో నిషేధ ఆజ్ఞలను ఎత్తివేయాలని కోరారు. కాంగ్రెస్‌తో స్నేహ బంధం కొనసాగిస్తూనే ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామని కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం చివరకు రైతుల పంటలను కూడా అదాని, అంబానీలకు అప్పగించేందుకు జాతీయ మార్కెట్ విధానాన్ని తీసుకువస్తోందని, ఇది రైతులను విచ్ఛిన్నం చేసే కుట్ర అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వంట గ్యాస్ సీలిండర్‌కు రూ.50లు పెంచడం దుర్మార్గమైన చర్య అని, తక్షణమే గ్యాస్ సిలిండర్‌పై పెంచిన రూ.50లను ధరలను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేబర్ కోడ్‌ల పేరుతో కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని, కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20వ తేదీన కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు తలపెట్టిన జాతీయ సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

## రాజ్యాంగానికి తూట్లు

(మొదటి పేజీ తరువాయి)

ఎం.ఆర్.జి. వినోద్‌రెడ్డి, మాజీ ఎంపి వి.హనుమంతరావు, సిపిఐ(ఎం) నాయకులు అబ్బాస్, ఎంఐఎం నాయకులు, మాజీ ఎంఎల్‌సి జాఫ్రీ, టిజెఎసి నగర ఉపాధ్యక్షులు అఫ్జల్, ఆప్ నేతలు సుధారాణి, విజయ్ మల్లంగి, జావిద్ షరీఫ్, షహబాస్, నాగరాజు,అజీమ్ బేగ్, అజ్మత్, ఖాన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సయ్యద్ అజీజ్ పాషా మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు సవరణ చట్టం రాజ్యాంగానికీ పూర్తిగా విరుద్ధమన్నారు. ఇది భారత లౌకిక వ్యవస్థను దెబ్బతీయడమే కాకుండా మతాలు, కులాల పేరిట దేశాన్ని విభజించడమేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.మతోన్మాద బిజెపి పార్టీకి ఒక్కసారిగా ముస్లింల మీద ఎనలేని ప్రేమ పుట్టుకువచ్చిందో అర్థం కావడం లేదన్నారు. కనీసం పార్లమెంట్‌లో ఆ పార్టీకి చెందిన ఒక్క ముస్లింకు చెందిన సభ్యులైన ఉన్నారని అన్ని ప్రశ్నించారు. భారత దేశం విభిన్న మతాలు, జాతుల సమూహామని, ఇక్కడ మతాలకు అతీతంగా హిందు ముస్లింలు పూజలు చేస్తుంటారని, అలాంటి వారి మధ్య బిజెపి మతం పేరుతో చిచ్చు పెట్టి విభజించాలని చూస్తోందని అగ్రహం వ్యక్తం చేశారు. వక్ఫ్‌బోర్డు సవరణకకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కోటి వినతులను స్వీకరించినట్లు చెప్పడం హాస్యస్పదమని, అసలైన భాగస్వాములతో కనీసం చర్చించకుండనే ఏకపక్షంగా వక్ఫ్‌బోర్డు చట్ట సవరణను తీసుకువచ్చిందన్నారు. దీనిని సవాల్ చేస్తూ సుప్రీం కోర్డులో ఫిల్ దాఖలు చేయడం జరిగిందని, న్యాయం జరుగుతుందని పూర్తి విశ్వాసం ఉందని ఆయన పేర్కొన్నారు. వినోద్‌రెడ్డి మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని కాంగ్రెస్ పూర్తిగా వ్యతిరేకిస్తోందని చెప్పారు. బిజెపి చట్ట సవరణ చేసిందని తాము గుడ్డిగా వ్యతిరేకించడం లేదని, సవరణ చట్టం ద్వారా దేశ సమగ్రతకు భంగం వాట్లిలే విధంగా ఉండడంతో దీనిని వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. వి. హనుమంతరావు మాట్లాడుతూ ముస్లింలకు సంబంధించిన వక్ఫ్‌బోర్డు చట్ట సవరణ పేరుతో అందులో కేంద్ర తల దూర్చడం సరైంది కాదన్నారు. రేపు ఇతర మత సంస్థలకు సంబంధించి అంశాల్లో కూడ కల్గజేసుకునే ప్రమాదం ఉందని, దీనిని అడ్డుకోవాల్సిన అవసరముందని ఆయన పేర్కొన్నారు. అబ్బాస్ మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని సిపిఐ(ఎం)పూర్తిగా వ్యతిరేకిస్తోందని చెప్పారు. ఈ చట్టసవరణతో వక్ఫ్‌కు ఎవరైనా భూములు దానం చేయాలంటే మతం మారితే తప్ప సాధ్యం కాదని, అదే వక్ఫ్‌బోర్డులో మాత్రం ఇతర మతస్తులు ఉండే చట్టసవరణ చేయడం ఎంత దుర్మార్గమే ప్రజలంతా అలోచించాలని సూచించారు. జాఫ్రీ మాట్లాడుతూ కేంద్ర తీసుకువచ్చిన వక్ఫ్ చట్టం ద్వారా పట్టణ ప్రాంతాల్లో విలువైన భూములను కొట్టేసేందుకు కుట్రలు జరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. బిజెపి రహిత రాష్ట్ర ప్రభుత్వాలు ఈ వక్ఫ్‌సవరణ చట్టాన్ని అమలు చేయరాదని కోరారు.

## ఉగ్రదాడులు!

(మొదటి పేజీ తరువాయి)

నవంబర్ 26న 10 మంది పాకిస్థానీ ఉగ్రవాదులు సముద్ర మార్గం ద్వారా ముంబయికి చేరుకొని మారణహోమం సృష్టించారు. సిఎస్‌ఎంటి, ఒబెరాయ్ ట్రైడెంట్, తాజ్ హోటల్ తదితర ప్రాంతాల్లో గన్స్‌తో, బాంబులతో దాడులకు పాల్పడ్డారు. నవంబర్ 29 వరకు ఈ మారణహోమం కొనసాగింది. ఈ ఉగ్రదాడుల్లో 18 మంది భద్రతా సిబ్బంది సహా 166 మంది ప్రాణాలు కోల్పోగా, అనేక మంది తీవ్రంగా గాయపడ్డారు. ఉగ్రవాదులతో పోరాడుతూ అప్పటి యాంటీ టెర్రరిజం స్క్వాడ (ఏటీఎస్) చీఫ్ హేమంత్ కర్కరే, ఆర్మీ మేజర్ సందీప్ ఉన్నికృష్ణన్, ముంబయి అదనపు పోలీస్ కమిషనర్ అశోక్ కామ్టే, సీనియర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ విజయ్ సలాస్కర్‌లు అమరులయ్యారు. కాగా రాణా పాకిస్థాన్ మూలాలున్న కెనడా జాతీయుడు. డేవిడ్ హెడ్లీతోపాటు 26/11 ముంబయి దాడుల్లో కీలక సూత్రధారిగా ఉన్నాడు. జమ్ములోని అఖ్నూర్ సెక్టార్‌లోని నియంత్రణ రేఖ (ఎల్‌ఓసి) వద్ద, భారత్‌లోకి చొరబడే ప్రయత్నం చేసిన ఉగ్రవాదులను భద్రత దళాలు సమర్థవంతంగా అడ్డుకున్నాయి. అయితే ఉగ్రవాదులను నిరోధించే క్రమంలో ఇండియన్ ఆర్మీకి చెందిన జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్ (జెసిఒ) సుబేదార్ కుల్దీప్ సింగ్ అమరుడైనట్లు అధికారులు తెలిపారు. దేశంలోకి చొరబడాలనే ఉగ్రవాదుల ప్రయత్నాన్ని సుబేదార్ కుల్దీప్ సింగ్, అతని బృందం భగ్నం చేసింది. ఈ ప్రయత్నంలో కుల్దీప్ సింగ్ అమరులయ్యారు. ఈ దుఃఖ సమయంలో మేము వారి కుటుంబానికి సంఘీభావం తెలియజేస్తున్నాం' అని జమ్మూకు చెందిన వైట్ నైట్ కార్ప్స్, 16 కార్ప్స్ చేసింది.

**అన్ని రాష్ట్రాలకు కేంద్రం అలర్ట్**

దేశవ్యాప్తంగా ఉగ్రదాడులు జరగవచ్చనే నిఘా సంస్థల హెచ్చరికల నేపథ్యంతో కేంద్ర హోం శాఖ అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. సముద్ర తీర ప్రాంత పట్టణాలు మరింత అప్రమత్తంగా ఉండాలని, గస్తీ పెంచుకోవాలని సూచించింది. సముద్ర మార్గం గుండా వచ్చిన ఉగ్రవాదులు 2008 ముంబై 26/11 మారహోమానికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ కేసులో కీలక సూత్రధారి, లష్కరే ఉగ్రవాది తహవ్వుర్ రాణా విచారణ కొనసాగుతున్న వేళ ఉగ్రముప్పు హెచ్చరికలు వచ్చాయి. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు దాడులకు దిగవచ్చని నిఘా సంస్థలు కేంద్ర హోం శాఖకు నివేదిక సమర్పించాయి. దీంతో హోంశాఖ అన్ని రాష్ట్రాలకు హెచ్చరికలు పంపింది. ఉగ్రవాదులు డ్రోన్లు, ఐఈడీలతో దాడులు చేసే అవకాశం ఉందని, ప్రత్యేకించి సముద్ర తీర ప్రాంతాలపై ఎక్కువ నిఘా ఉంచాలని సూచించింది.

## బిఆర్‌ఎస్‌కు పట్టవా?

(మొదటి పేజీ తరువాయి)

సేకరించినట్లు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు తెలిపారు. ఆ బాండ్లను 37 సంస్థలు టిజిఐఐసి నుంచి బాండ్లు కొనుగోలు చేశాయని, అందులో అంతర్జాతీయ సంస్థలు కూడా ఉన్నాయని, బాండ్‌లకు మంచి ఆదరణ కూడా లభిస్తున్నదన్నారు. బాండ్ల అమ్మకం ద్వారా డబ్బులు బ్యాంకర్‌గా ఐసిఐసిఐ బ్యాంక్‌లో పడ్డాయని, ఆ డబ్బులలో ప్రతి రూపాయి రైతు సంక్షేమం, ప్రజా సంక్షేమం కోసంమే ఖర్చు చేశామని, ఒక్క పైసా అవినీతి జరగలేదని శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు.గాంధీభవన్‌లో ఎంఎల్‌సిలు అమేర్ అలీ ఖాన్, బల్మూరి వెంకట్, కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాతతో కలిసి శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు. ఆర్‌బిఐ, సెబి తదితర సంబంధిత అధీకృత సంస్థల నిబంధనలకు అనుగుణంగా నే బాండ్స్ ద్వారా రూ.10వేల కోట్లు సేకరించామని తెలిపారు.ఐసిఐసిఐ బ్యాంక్ నుంచి మేం లోన్ తీసుకోలేదు.. అది కేవలం మర్చంట్ బ్యాంక్‌గా మాత్రమే వ్యవహరించిందన్నారు. రూ.10 వేల కోట్ల కుంభకోణం జరిగిందంటూ ఆరోపణలు చేస్తున్న మంత్రి కెటిఆర్ ఎందుకు ఆధారాలు చూపించడం లేదని ప్రశ్నించారు. బాండ్స్ ద్వారా సేకరించిన మొత్తం నుంచే రూ.2100 కోట్లు రుణ మాఫీ కోసం కేటాయించామని, రైతుల సంక్షేమం కోసం రుణమాఫీ చేయడం తప్పా..??? రైతులకు మంచి చేస్తే కూడా ఓర్వలేరా..? అని ఆగ్రహం వ్యక్త పరిచారు.

**నాటి కంటే తక్కువ వడ్డీకే బాండ్లు**

తమ ప్రభుత్వం వడ్డీ 9.3 శాతానికి తీసుకుంటే.. బిఆర్‌ఎస్ ప్రభుత్వం 10.9 శాతం ఇంట్రస్ట్‌కి అప్పులు తీసుకుని రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దివాళా తీయించారని శ్రీధర్‌బాబు విమర్శించారు. బిఆర్‌ఎస్ హయాంలో ఇష్టారీతిగా ప్రభుత్వ భూములను 150 నుంచి 200 ఎకరాలు పప్పు బెల్లాళ్ళ నచ్చిన వారికి అప్పనంగా కట్టబెటారని, పదేళ్ళలో రూ.31వేల కోట్లు భూముల వేలం ద్వారా సమీకరించారని తెలిపారు. . కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాలు ప్రభుత్వ భూములని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు. సిటీ మధ్యలో ఎక్కడైనా ఏనుగులు ఉంటాయా...? కృత్రిమ మేధ సాయంతో అక్కడ నెమళ్లు, జంతువులు ఉన్నట్లు బిఆర్‌ఎస్ అందర్నీ తప్పుదోవ పట్టించిందని, వైజాగ్ లో ఒకరి ఇంటి ముందు వచ్చిన జింకను ఇక్కడ హెచ్ సియు నుంచి వచ్చినట్టు చూపించారని ఇంతకంటే దౌర్భాగ్యం ఇంకేమైనా ఉంటుందా..? అని మంత్రి ప్రశ్నించారు. 9 ఏళ్ల క్రితం రాజస్థాన్‌లో చనిపోయిన జింకను చూపించి హెచ్‌సియులో చనిపోయిందని రాజకీయం చేయడం కెటిఆర్‌కు సిగ్గనిపించడంలేదా అని ప్రశ్నించారు. తెలంగాణకు పరిశ్రమలు రావొద్దని,మన యువతకు ఉద్యోగాలు రావొద్దనే దురుద్దేశంతోనే బిఆర్‌ఎస్, బిజెపి నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.ఈ విధంగా ప్రభుత్వాన్ని బద్నాం చేయడం మంచి పద్ధతి కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో హైదరాబాద్ తో పాటు రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని, అభివృద్ధిని అడ్డుకోవాలనే దురుద్దేశంతోనే మాపై దుష్ప్రచారం చేస్తున్నారని, బట్ట కాల్చి మాపై వేస్తున్నారని ఆగ్రహం వ్యక్త పర్చారు. భావి తరాల కోసం నగర ప్రజల కోసమే మూసీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టామన్నారు. రూ.5200 కోట్ల భూమిని రూ.30,000కోట్ల భూమిగా చూపించారంటూ కెటిఆర్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఒక పదేళ్లు మంత్రిగా పని చేసిన వ్యక్తి వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. హరిత హారం పేరిట బిఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.10,000 కోట్లు ఖర్చు పెట్టిందని, మరి రాష్ట్రంలో పచ్చదనం ఎందుకు పెరగలేదని ప్రశ్నించారు. బిఆర్‌ఎస్ హయాంలో 11,427 హెక్టార్ల భూమి అటవీ ఏతర భూమిగా మారిపోయిందని, 12.12 లక్షల చెట్లను 2016–19లో అటవీ సంరక్షణ చట్టానికి విరుద్ధంగా కొట్టేరని తెలిపారు. అంతే కాకుండా తెలంగాణ ఏర్పడినప్పుడు 21,591 చదరపు కిలోమీటర్ల అడవి ఉంటే, 2021 నాటికి 21,213 చదరపు కిలోమీటర్ల అడవి మాత్రమే ఉందని, మరి హరిత హారం కింద రూ.10వేల కోట్లు ఖర్చు చేసినా ఒక్క చెట్టు అదనంగా పెరగలేదా అని ప్రశ్నించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు 800 ఎకరాల్లో నాలెడ్జ్ పార్కు, ఫైనాన్షియల్ పార్కు ఏర్పాటు చేయడం ద్వారా రూ. లక్ష కోట్ల రూపాయలు పెట్టుబడులు వచ్చాయని.. లక్షలాది మందికి ఉద్యోగాలు వచ్చాయని మంత్రి తెలిపారు.సెక్రటేరియట్ కట్టినప్పుడు 207 పెద్ద చెట్లు తొలగించారు. ఒక్క చెట్టును తిరిగి వేరే దగ్గర నాటే ప్రయత్నం ఎందుకు చేయలేదని ఆరోపించారు. కాళేశ్వరం కోసం 8వేల ఎకరాల అడవులను తొలగించడం వాస్తవం కాదా..??? మరి అప్పుడు పర్యావరణ పరిరక్షణ గుర్తు రాలేదా...? అని ప్రశ్నించారు.

## మూడు నెలలే

(మొదటి పేజీ తరువాయి)

ఏమిటో కూడా సుప్రీంకోర్టు తన 415 పేజీల తీర్పులో స్పష్టం చేసింది. గవర్నర్లు సహకరించకుండా క్రియారాహిత్యంగా వ్యవహరిస్తే అది కోర్టు సమీక్ష పరిధిలోకి వస్తుందని కూడా తెలియజేసింది. ఈ తీర్పును సుప్రీంకోర్టు వెబ్‌సైటులో శుక్రవారం రాత్రి 10.54 నిమిషాలకు అప్‌లోడ్ చేశారు.ఒకవేళ గవర్నర్ గనుక సమ్మతి తెలియజేయకుండా నెలరోజుల్లో బిల్లును పద్ధతి ప్రకారం వెనక్కు పంపితే, అసెంబ్లీ గనుక రెండోసారి అదే బిల్లును ఆమోదించి పంపినప్పుడు ఇక గవర్నర్‌కు ఆ బిల్లుపై సంతకంచేసి చట్టబద్ధం చేయడంతప్ప తిరస్కరించే అధికారం, రాష్ట్రపతి పరిశీలనకు పంపే ఎలాంటి చట్టబద్ధ అధికారం ఉండబోదని తెలియజేసింది. ఈ తీర్పు ప్రతులను అన్ని హైకోర్టులకు పంపించాలని సుప్రీంకోర్టు రిజిష్ట్రరీకి ఆదేశించింది. ఏవైనా బిల్లులను రాష్ట్రపతి పరిశీలనకు పంపాలని గవర్నర్ భావిస్తే, బిల్లులు తనవద్దకు వచ్చిన తేదీ నుండి మూడునెలలలోపు సమాచారాన్ని రాష్ట్రపతి నుండి రప్పించుకోవాలని పేర్కొంది. హోంమంత్రిత్వశాఖ, రాష్ట్రపతి ఈ బిలుల్లపై మూడు నెలల్లోపు నిర్ణయం తీసుకోవాలని పేర్కొంది. ఒకవేళ అంతకంటే ఎక్కువ జాప్యం జరిగితే సంబంధిత రాష్ట్ర ప్రభుత్వానికి, అసెంబ్లీకి తగిన కారణం, వివరణ ఇవ్వాల్సి ఉంటుందని సుప్రీంకోర్టు తీర్పు పేర్కొంది. గవర్నర్ పంపిన బిల్లులపై మూడునెలలలోపు రాష్ట్రపతి నిర్ణయం తీసుకోవాలని పేర్కొంది. ఈ విషయంలో రాష్ట్రాలు కేంద్రానికి సహకారాన్ని ఇవ్వాలని, విస్తృత సహకార దృక్పథంతో వ్యవహరించాలని పేర్కొంది. రాష్ట్రపతి అడిగిన ప్రశ్నలకు త్వరత్వరగా సమాధానాలు పంపాల్సి ఉంటుందని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం చేసిన సూచనలు, లేవనెత్తిన ప్రశ్నలపై సత్వరం స్పందించాల్సి ఉంటుందని తీర్పు పేర్కొంది. ఈనెల ఎనిమిదో తేదీన జస్టిస్ జె.బి.పార్థీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఒక తీర్పు చెబుతూ, రాష్ట్రపతి పరిశీలనకు పంపాలనే పేరుతో తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి పది బిల్లులను తొక్కిపెట్టి ఉంచడం చట్టవిరుద్ధమని ప్రకటించింది. అసెంబ్లీ రెండోసారి కూడా అవే బిల్లులను సభలో మెజారిటీ సభ్యుల ఓటింగ్ ద్వారా తీర్మానం చేస్తే వాటిని తిరస్కరించేందుకు, తొక్కిపట్టి ఉంచేందుకు గవర్నర్‌కు ఎలాంటి అధికారాలు ఉండవని సుప్రీంకోర్టు నాలుగురోజులక్రితమే చెప్పింది. రాజ్యాంగంలోని 200వ అధికరణ ప్రకారం గవర్నర్ విధి నిర్వ హణకు ఒక కాల స్పష్టత లేనప్పటికీ, రాష్ట్రపతి నియమించిన పర్యవేక్షకుడైన గవర్నర్, ప్రజలు ఎన్నుకున్న రాష్ట్ర ప్రభుత్వం—అసెంబ్లీ పరిధికి కట్టుబడి పనిచేయవలసి ఉంటుందని, ఈ నిబంధనల ప్రకారం అసెంబ్లీ ఆమోదించిన బిల్లులకు తన సమ్మతిని తెలియజేయడం తప్ప మరో అధికారం గవర్నర్‌కు లేదని, రాజ్యాంగ అధికరణ నిబంధలను గవర్నర్ ఉల్లంఘించలేరని స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని 200 అధికరణ ప్రకారం గవర్నర్ పనితీరుకు సంబంధించి నిర్ణయాలలో ఒక కాలపరిమితి లేకపోయినప్పటికీ కూడా దానిని యథాతథంగా అదేవిధంగా అర్థం చేసుకోకూడదనీ, జాప్యం చేయడం ద్వారా ఎన్నికైన ప్రజాప్రభుత్వం పనివిధానంలో, చట్టాలు చేసే ప్రజాప్రతినిధుల యంత్రాంగానికి అటంకాలు సృష్టించకూడదనీ సుప్రీంకోర్టు తీర్పు పేర్కొంది. ''ఒకవేళ ఏదైనా బిల్లును గవర్నర్ ఆపాలనుకుంటే, పరిశీలన నిమిత్తం రాష్ట్రపతికి పంపాలనుకుంటే మంత్రివర్గం సలహాతో చెయ్యాలి. అందుకు గవర్నర్‌కు గరిష్ఠస్థాయిలో ఒకనెలమాత్రమే బిల్లును స్తంభింపజేసే అధికారం ఉంటుంది, మంత్రివర్గం సలహాలేకుండా బిల్లును గనుక గవర్నర్ తొక్కిపడితే ఆ సందేశాన్ని తెలియజేస్తూ బిల్లును తిప్పి పంపడానికి గరిష్ఠంగా మూడునెలల సమయం తీసుకోవచ్చు. మంత్రివర్గం సలహాను ఉల్లంఘించి, అందుకు విరుద్ధంగా బిల్లును రాష్ట్రపతి పరిశీలనకు పంపితే అందుకు కూడా గరిష్ఠస్థాయిలో మూడునెలలు మాత్రమే గడువు ఉంటుంది'' అని ధర్మాసనం తెలియజేసింది. పునఃపరిశీలన తర్వాత మళ్ళీ బిల్లు గవర్నర్ దగ్గరకు వస్తే అప్పటినుండి నెలరోజులలోపు గవర్నర్ బిల్లుపై సంతకం చేసి పంపాలని, బిల్లులను తనదగ్గరే పెట్టుకుని కూర్చోకూడదనీ, పూర్తివీటో అధికారంగానీ, జాప్యంద్వారా బిల్లును ఉనికిలో లేకుండా చేసే (పాకెట్‌వీటో) అధికారం గానీ గవర్నర్‌కు ఉండబోవని సుప్రీంకోర్టు తెలియజేసింది. రాజ్యాంగంలోని 201వ అధికరణ ప్రకారం రాష్ట్రపతికి కూడా ఈ విధంగా పూర్తిగా బిల్లును తిరస్కరించే అధికారం గానీ, తనవద్దనే అట్టేపెట్టుకుని జాప్యందారీవిధానం ద్వారా బిల్లును ఉనికిలో లేకుండా చేసే అధికారంగానీ లేదని పేర్కొంది. సమ్మతి ఇవ్వకపోతే బిల్లును గడువులోపు వివరణలు కోరుతూ తిప్పిపంపాలని పేర్కొంది. రాజ్యాంగంలో ఎక్కడా ఏకపక్ష గుత్తాధికారాలు లేవని పేర్కొంది. రాజ్యాంగంలోని 142వ అధికరణ ప్రకారం తమిళనాడు గవర్నర్‌కు బిల్లును అసెంబ్లీ తిరిగి ఆమోదించి పంపిస్తే అది గవర్నర్ ఆమోదం పొందడంతో సమానంగా పరిగణించబడుతుందని పేర్కొంది. అప్పుడు గవర్నర్ సంతకం లాంఛనమే అవుతుంది. తమిళనాడు గవర్నర్‌కు, ప్రభుత్వానికి మధ్య బిల్లుల తీవ్రజాప్యంపై వివాదం వచ్చినప్పుడు తొలుత సుప్రీంకోర్టు వారికి ప్రశ్నలు ఇచ్చి సమాధానాలు, వివరణలు చెప్పమని అడిగింది. గవర్నర్ జాప్యందారీవిధానంవల్ల తమిళనాడు ప్రభుత్వం 2023లో 12 బిల్లుల పై సుప్రీంకోర్టును ఆశ్రయించింది. వీటిల్లో ఒకబిల్లు 2020 నుండి నుండి పెండింగ్‌లో ఉంది. 2023 నవంబరు 13న గవర్నర్ 10 బిల్లులపై సంతకం చేయడంలేదని ప్రకటించారు. ఆ తర్వాత ఐదు రోజులకు తమిళనాడు అ సెంబ్లీ ప్రత్యేకసమావేశం జరిపి అవే బిల్లులను తిరిగి సభలో ఆమోదించింది.



# జనరల్
STATE & REGIONAL NEWS

## స్మార్ట్‌ఫోన్స్, ల్యాప్‌టాప్‌లకు సుంకాల నుంచి మినహాయింపు..!

**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. పలు ఎలక్ట్రానిక్స్ వస్తువులను సుంకం నుంచి మినహాయించనున్నట్లు ట్రంప్ పరిపాలన ప్రకటించింది. స్మార్ట్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్, చిప్స్‌కు మినహాయింపు ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయం సాధారణ వినియోగదారులకు సైతం ఉపశమనం కలిగించే అవకాశం ఉన్నది. ట్రంప్ పరిపాలన సుంకాలను యథావిధిగా అమలు చేస్తే ఆయా వస్తువల ధరలను పెరిగే అవకాశం ఉండేది. ప్రస్తుతం అవే ధరలు కొనసాగే అవకాశం ఉన్నది. యుఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ డిపార్ట్‌మెంట్ ప్రకారం.. అనేక వస్తువలకు సుంకాల నుంచి మినహాయింపు ఇచ్చింది. ఇందులో ప్రధానంగా స్మార్ట్‌ఫోన్స్, ల్యాప్‌టాప్స్, సెమీ కండక్టర్ మాన్యుఫ్యాక్చరింగ్ మిషన్స్, ఫ్లాట్ ప్యానెల్ మానిటర్స్‌తో పాటు పలు వస్తువులకు మినహాయింపు ఇచ్చింది.

# మౌలిక వసతుల కల్పనకు కృషి

### కోల్డ్ స్టోరేజీ, నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** దొరన్న కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శనివారం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డితో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నగరంలో పర్యటించారు. ముందుగా ప్రకాష్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కోల్డ్ స్టోరేజీని ప్రారంభించి 58వ డివిజన్ దొరన్న కాలనీలో టియుఎఫ్ఐడిసి నిధులతో కోటి రూపాయలతో చేపట్టిన సిసి రోడ్లు, స్మార్ట్ వాటర్, డ్రైన్ నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొరన్న కాలనీలో కావాల్సిన మేరకు పెండింగ్ పనులు పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. మొదటి విడతలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం నిరంతరాయంగా కొనసాగుతుందని పేదలకు దశలవారీగా ఇండ్లు పంపిణీ చేస్తామన్నారు. పేదల కోసం ప్రతిపాదించిన ప్రతి పనిని పూర్తయ్యేందుకు స్థానిక ఎంపితో కలిసి కృషి చేస్తానన్నారు. పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి మాట్లాడుతూ గత 16 నెలలుగా ఖమ్మం నగరం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం పేదలకు రేషన్ ద్వారా సన్నబియ్యం పంపిణీ, రైతు రుణమాఫీ, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకులాల నిర్మాణం, రూ. 500 గ్యాస్ సరఫరా, మహాలక్ష్మి వంటి పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, నగర మేయర్ పునుకొల్లు నీరజ, మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, 58వ డివిజన్ కార్పొరేటర్ దోరేపల్లి శ్వేత, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, నగర పాలక సంస్థ సహాయ కమిషనర్ షఫీవుల్లా, అర్బన్ తహసీల్దార్ రవి కుమార్, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కేంద్రాల్లోనూ వ్యవసాయ పనిముట్ల ప్రదర్శనలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వ్యవసాయరంగంలో వచ్చిన నూతన ఆవిష్కరణలతో పాటు వ్యవసాయ రంగ అనుబంధ ఉత్పత్తులకు సంబంధించి గ్రామీణ ప్రాంతాల్లో అతి తక్కువ ఖర్చుతో తయారు చేసిన యంత్రాలు, పనిముట్లను తెలంగాణ రైతు మహోత్సవంలో ప్రదర్శించడం అభినందనీయమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో అగ్రిహార్టికల్చర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 4 రోజుల తెలంగాణ రైతు మహోత్సవంలో శనివారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి అక్కడ ఏర్పాటు చేసిన ప్రదర్శన శాలలను తిలకించి, రైతులతో ముచ్చటించారు. రైతుల ప్రయోజనార్థం మరిన్ని నూతన ఆవిష్కరణలతో జిల్లా కేంద్రాలలోను ఇలాంటి ప్రదర్శనలు ఏర్పాటు చేయడానికి వ్యవసాయశాఖ కూడా నిశ్చయించిందని తెలిపారు. వాటిలో పాలుపంచుకోవాల్సిందిగా అగ్రిహార్టికల్చర్ సొసైటీ ప్రతినిధులను మంత్రి కోరారు. ఈ ప్రదర్శనశాలలో అమృతం మామిడిపండును ఐస్ క్రీంగా వాడటం, కుంకుడుకాయతో అన్ని రకాల ఉత్పత్తులు చేయడం, సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులు, తయారీవిధానం ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అగ్రిహార్టికల్చర్ సొసైటీ చైర్మన్ సుధాకర్‌రావు, కార్యదర్శి డాక్టర్ వి.రావు, కోశాధికారి శ్రీరంగారావు, సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## బసవ పున్నయ్యకు ఘన నివాళి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సిపిఐ(ఎం) నాయకులు దివంగత మాకినేని బసవపున్నయ్య గొప్ప సిద్ధాంతకర్త అని సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య కొనియాడారు. కమ్యూనిస్టు అగ్రనాయకులు మాకినేని బసవపున్నయ్య(ఎంబి) 33వ వర్ధంతి వేడుకలను శనివారం హైదరాబాద్‌లోని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యాలయం ఎంబి భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాకినేని బసవపున్నయ్య చిత్రపటానికి ఎస్.వీరయ్య, పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు టి.జ్యోతి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.నాగయ్య, టీ.సాగర్, బండారు రవికుమార్, సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు టి.స్కైలాబ్ బాబు, పి.ఆశయ్య, జె.బాబు రావు, బి ప్రసాద్, ఉడుత రవి తదితరులు పూల మాల వేసి నివాళులర్పించారు.

# ఆహారోత్పత్తుల రంగంలో రూ.16వేల కోట్ల పెట్టుబడులు

### మంత్రి శ్రీధర్‌బాబు ఫుడ్ ఎ'ఫెయిర్' 2వ ఎడిషన్ పోస్టర్ ఆవిష్కరణ
### హైదరాబాద్‌లో జూన్ 12 నుంచి 3 రోజుల సందడి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బ్లిట్జ్ ఎగ్జిబిషన్ ఆధ్వర్యంలో తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం, హైటెక్స్ ఎగ్జిబిషన్ సహకారంతో, తెలంగాణ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ప్రధాన భాగస్వామిగా ఫుడ్ ఎ ఫెయిర్ 2వ ఎడిషన్ నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్లో జూన్ 12 నుంచి 14 వరకు 3 రోజుల పాటు జరుగనున్న ఈ అతి పెద్ద, ఫుడ్ ఎఫెయిర్ (ట్రేడ్ ఫెయిర్) పోస్టర్‌ను రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు శనివారం బ్లిట్జ్ ఎగ్జిబిషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీకాంత్ పునాటి, తెలంగాణ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ (టిఎఫ్‌పిఎస్) డైరెక్టర్ అఖిల్, డెరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ డాక్టర్ జి.మల్సూర్, హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ సిఓఓ శ్రీకాంత్, మిల్లెట్ బ్యాంక్ సిఇఒ విశాల రెడ్డి తదితరులతో కలసి హైటెక్స్ హాల్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ తెలంగాణ ఆహార, వ్యవసాయ ప్రాసెసింగ్ రంగం వృద్ధి పథంలో వేగంగా అడుగులు వేస్తోందని ఈ ఆహారోత్పత్తుల రంగంలో రూ.15,919 కోట్లు పెట్టుబడులు ప్రస్తుతం వివిధ దశల్లో అమలులో ఉన్నాయన్నారు. అలాగే 7, 150 ఎకరాల విస్తీర్ణంలో 14 ప్రత్యేక ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌లను తమ ప్రభుత్వం ఏర్పాటు చేసిందనీ, పారిశ్రామికవేత్తలకు అత్యుత్తమ సాంకేతికత, ప్రపంచ శిక్షణ, పరిజ్ఞానం, విస్తృత మార్కెటున్ పొందడంలో సహాయ సహకారాలు అందించడానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఆహార వ్యవసాయ ప్రాసెసింగ్ రంగంలో తెలంగాణను జాతీయ అగ్రగామిగా నిలబెట్టడానికి తమ ప్రభుత్వం అంకితభావంతో పనిచేస్తోందని ఉద్ఘాటించారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల సాధికారతకు "ప్లగ్ అండ్ ప్లే" తరహా మౌలిక సదుపాయాలు, ఆర్థిక ప్రోత్సాహకాలతో పాటు అనేక రకాలుగా చేయూతని అందిస్తోందన్నారు. తెలంగాణ వ్యాప్తంగా ఫుడ్ ప్రాసెసింగ్ పారిశ్రామికవేత్తల కోసం పటిష్టమైన అనుకూల వ్యవస్థను పెంపొందించడంలో ప్రభుత్వం తిరుగులేని నిబద్ధతను కనపరుస్తోందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు.

## విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు

### ముగ్గురు ఉద్యోగులను సస్పెండ్ చేసిన కలెక్టర్




**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** మెదక్ గోల్కొండ వీధిలో బస్తీ దవాఖాన ఆయుష్మాన్ భవ ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. కలెక్టర్ పరిశీలించినప్పుడు ఆసుపత్రికి తాళం వేసి ఉండటం, చుట్టుపక్కల ప్రజలను ఆస్పత్రి పనితీరుపై కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. విధుల్లో ఉండాల్సిన మెడికల్ ఆఫీసర్, స్టాఫ్‌నర్స్, సపోర్టింగ్ స్టాఫ్ విధులకు రాకుండా ఆసుపత్రికి తాళం వేసి ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి చరవాణి ద్వారా ఆదేశాలు జారీ చేశారు. విధులకు హాజరు కాని ఈ ముగ్గురు వైద్య, సిబ్బందిని సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ ప్రకటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉద్యోగులు తమ విధులను క్రమశిక్షణగా నిర్వహించాలని, అప్పుడే తమ వృత్తి ధర్మానికి న్యాయం చేసిన వారు అవుతామని ప్రజలు నమ్మకాన్ని చూరగొంటామన్నారు. క్షేత్రస్థాయి పర్యటన ద్వారా ఆసుపత్రులను ఆకస్మికంగా సందర్శించడం జరుగుతుందని వైద్య సిబ్బంది తమ విధి నిర్వహణను చిత్తశుద్ధితో నిర్వహించాలని ఆదేశించారు.

# 15 నుంచి ఎఐకెఎస్ ప్రచార జాతాలు

### తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తమిళనాడులోని నాగపట్టణంలో ఈ నెల 15 నుంచి 17వ తేదీవరకు మూడు రోజుల పాటు జరగనున్న ఎఐకెఎస్ 30వ జాతీయ మహాసభల ప్రచార జాతను జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఎఐకెఎస్) పిలుపునిచ్చింది. ఎఐకెఎస్ 29 వ జాతీయ మహాసభలు హైదరాబాద్‌లో జరిగిన నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో 30వ మహాసభల వేదికైన తమిళనాడులోని నాగపట్టణంకు ప్రత్యేకంగా ప్రచార జాత బయలు దేరి వెళ్లనున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతరావు, ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ తెలిపారు. ఈ జాతను ఆదివారం ఉదయం 10:30 గంటలకు హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర రైతు సం ఘం కార్యాలయం వద్ద చిన్న, సన్నకారులు రైతులు జెండా ఊపి ప్రారంభిస్తారని తెలిపారు. ప్రచార జాత 14వ తేదీన నాగపట్టణం చేరుకుని 15వ తేదీన ఎఐకెఎస్ జెండాను జాతీయ నాయకత్వానికి అందజేస్తుందని వారు వెల్లడించారు.

**1936 నుంచి నేటి వరకు ఎఐకెఎస్ అనేక పోరాటాలు :**
బ్రిటిష్ వలస వాదులకు వ్యతిరేకంగా దేశ స్వాతంత్రోద్యమ సమయంలో 1936 ఏప్రిల్ 11వ తేదీన స్థాపించిన అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) దేశ స్వాతంత్య ఉద్యమం మొదలు, భూమికోసం భుక్తి కోసం జీవనోపాధి కోసం మహత్తర రైతాంగ ఉద్యమాలు, రైతాంగ సాయుధ పోరాటాలకు నాయకత్వం వహించిందన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం, పశ్చిమబెంగాల్ లో తెభాగ రైతాంగ తిరుగుబాటు, కేరళలో పున్నప్ర రైతాంగ పోరాటం, మలబారు రైతాంగ పోరాటం, ఆయా రాష్ట్రాలలో రైతాంగ ఉద్యమాలు పోరాటాలలో అఖిల భారత కిసాన్ సభ అగ్రగామి పాత్ర నిర్వహించిందన్నారు. పంటలకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టం కోసం రుణమాఫీ చట్టం, జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానం ముసాయిదా ఉపసంహరించుకోవాలని, పంటల బీమా పథకాన్ని రైతులకు అనుకూలంగా సవరించి అమలు చేయాలని తదితర ప్రధానమైన డిమాండ్ల పై అఖిల భారత కిసాన్ సభ పోరాడుతోందన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా లో ప్రధాన భాగస్వామిగా కొనసాగుతూ ఐక్య ఉద్యమాలలో ప్రధానమైన భూమికను నిర్వహిస్తుందని తెలిపారు. మహత్తర పోరాట చరిత్ర కలిగిన అఖిల భారత కిసాన్ సభ 30 వ జాతీయ మహాసభలను విజయవంతాన్ని కాంక్షిస్తూ జాతను నిర్వహిస్తున్నామని బాగం హేమంతరావు, పశ్య పద్మ వెల్లడించారు.

| ప్రచార జాత వివరాలు : | | | |
|---|---|---|---|
| తేదీ | సమయం | చేరుకోనున్న ప్రాంతం | కిలో మీటర్లు |
| 13/05/25 | ఉదయం 10.30 గంటలు | హిమాయత్‌నగర్ | ప్రారంభం |
| 13/05/25 | మధ్యాహ్నం 12.15 గంటలు | చౌటుప్పల్ | 50 కి.మి. |
| 13/05/25 | సాయంత్రం 5 గంటలు | మిర్యాలగూడ | 92 కి.మి |
| 13/05/25 | రాత్రి 7.30గంటలు | సంతమంగులూరు | 110 కి.మి |
| 13/05/25 | రాత్రి 12 గంటలు | నెల్లూరు | 200 కి.మి. |
| 14/05/25 | ఉదయం 8 గంటలు | తడ (ఎపి సరిహద్దు) | 110.కి.మి. |
| 14/05/25 | ఉదయం 10 గంటలకు | కంజివరం | 105.కి.మి. |
| 14/05/25 | ఉదయం 11.30గంటలకు | కడలూరు | 140 కిమి. |
| 14/05/25 | మధ్యాహ్నం 1.30గంటలు | మైలదుతురై | 90.కిమి |
| 14/05/25 | మధ్యాహ్నం 3 గంటలు | చిందంబరం | 40 కిమి. |
| 14/05/25 | సాయంత్రం 4.30గంటలు | నాగపట్టణం | 86 కి.మి. |

## కంచ గచ్చిబౌలి కుంభకోణం దేశంలోనే అతిపెద్దది

### కాంగ్రెస్, బిజెపిపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ నిప్పులు



**ప్రజాపక్షం/కొత్తపల్లి :** తెలంగాణ రాష్ట్రంలోని బిజెపి పార్టీ ఢిల్లీలో కేంద్ర అధిష్టానానికి చెప్పులు మోసేదైతే.. కాంగ్రెస్ పార్టీ సంచులు మోసేదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఎద్దేవా చేశారు. ఈ రెండు పార్టీలు తెలంగాణకు ద్రోహం చేస్తూనే ఉన్నాయని మండిపడ్డారు. కరీంనగర్‌లోని కొత్తపల్లి మండలం చింతకుంట గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో రజతోత్సవ సభ సన్నాహక సమావేశానికి ముఖ్య అతిధిగా కెటిఆర్ హాజరై విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కేంద్రంతో సీఎం రేవంత్ రెడ్డి లోపాయికారీ ఒప్పందంతో తెలంగాణ రాష్ట్రాన్ని పాలిస్తున్నారని ఆరోపించారు. హెచ్‌సియు పరిధిలోని కంచె గచ్చిబౌలి భూములను సీఎం రేవంత్ రెడ్డి పీక్ అనే సంస్థకు తాకట్టు పెట్టి రూ.10 వేల కోట్లు అప్పు తెచ్చారని, అందుకోసం రూ.170 కోట్లు లంచం ఇచ్చారని ఆరోపించారు. ఈ తెరవెనుక తతంగం నడిపింది బిజెపి ఎంపీ అని పేర్కొన్నారు. ఈ భూములను ఎవరు కొనుగోలు చేసినా మూడేళ్ల తర్వాత తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సెంటు భూమిని సైతం వదలబోమన్నారు. నెల రోజుల క్రితమే బిఆర్ఎస్ రజతోత్సవ సభకు అనుమతి కోరితే ఇప్పటి వరకు ఇవ్వలేదని, హైకోర్టును సంప్రదిస్తే 21న గడువు ఇవ్వడం జరిగిందన్నారు. తాము రాష్ట్ర ప్రభుత్వంపై యుద్ధభేరి ప్రకటించడం లేదని, కేవలం 25 ఏళ్లు పూర్తయిన సంధర్భంగా రజతోత్సవ సభ నిర్వహిస్తున్నామన్నారు. ఆర్టీసీకి 300 బస్సులు కావాలని రూ.10 కోట్లు చెల్లించామన్నారు. బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత హెచ్‌సియులో గ్రీన్ జోన్ ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములు అమ్మేటప్పుడు హెచ్ఎండిఏ, టిఎస్ఐఐసి నుంచి అమ్మాలన్నారు. హెచ్‌సియు భూముల విషయంలో బిఆర్ఎస్ వెనక్కి తగ్గదన్నారు. తెలంగాణ ఇంటి పార్టీగా బిఆర్ఎస్ చెరగని ముద్ర వేసుకుందన్నారు. ఈ నెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించనున్న రజతోత్సవ సభకు లక్షలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కమలాకర్, కౌశిక్ రెడ్డి, సంజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు ఈశ్వర్, రవి శంకర్, రసమయి బాలకిషన్, సతీష్‌బాబు, మధు, ఎల్.రమణ, చందర్, విద్యాసాగర్, జిల్లా అధ్యక్షుడు జివి రామకృష్ణ, నగర అధ్యక్షుడు చల్లహరిశంకర్, వేములవాడ నియోజకవర్గ ఇంచార్జి చల్మెడ లక్ష్మి నర్సింహారావు తదితరులున్నారు.

### కెటిఆర్ ఇచ్చిన డెడ్‌లైన్ దాటింది..

# ఉల్లిగడ్డ బాంబు కూడా పేలలేదు



### మీడియా సమావేశంలో ఎంపి చామల కిరణ్ కుమార్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హెచ్‌సియు భూముల విషయంలో బిఆర్ఎస్ వర్కిం గ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ప్రభుత్వంపై కావాలని బురద చల్లుతున్నారని ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. గాంధీభవన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కెటిఆర్ ఇచ్చిన డెడ్‌లైన్ దాటిందని.. హైడ్రోజన్ బాంబు కాదు కనీసం ఉల్లిగడ్డ బాంబు కూడా పేలలేదని ఎద్దేవ చేశారు. కెటిఆర్ మాట్లాడే మాటలకు అర్థం పర్థం లేని, గ్రౌండ్ వర్క్ లేకుండా మాట్లాడుతున్నారన్నారు. ఐసిఐసిఐ రుణం ఇచ్చిందని కెటిఆర్ అన్నారు.. టిజిఐఐసి ఫేస్‌వాల్యూ చూసి 37 మంది బాండ్లు కొన్నారు. కొనుక్కున్న బాండ్ల పైసలు అన్ని ఐసిఐసిఐ బ్యాంక్‌లో పడతాయి, ఆ విధంగానే డబ్బులు ఐసిఐసిఐలో పడ్డాయని స్పష్టం చేశారు. కెటిఆర్ భూమి విలువ రూ.5200కోట్లు అని అంటారు.. కెటిఆర్ శిష్యుడు రూ.20,000 కోట్లు అంటారు.. ఎవరి మాట నమ్మాలి.. అని ప్రశ్నించారు. కెటిఆర్ బేస్‌లెస్ ప్రెస్‌మీట్ పెట్టారని కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అవి హెచ్‌సియు భూములు కావు, అటవీ భూములు కావని ఈ విషయం ద్వారా తేటతెల్లం అయ్యిందన్నారు. హెచ్‌సియు భూముల విషయంలో సామాన్య ప్రజలను తప్పుతోవ పట్టించాలని చెప్పిన మాటలే తప్ప అందులో ఏ మాత్రం నిజం లేదని అన్నారు. హైదరాబాద్‌లో జూ ఉంది అంటే నమ్ముతారు.. కానీ అడవి ఉంది అంటే ఎవరు నమ్ముతారు చెప్పండి అని ఎద్దేవ చేశారు. బిఆర్ఎస్ నాయకులు తెలంగాణను కుక్కలు చింపిన విస్తారాకు చేశారు. ఆ విస్తరాకును కుట్టి అందులో సన్న బియ్యం అన్నం పెడుతుంటే బిఆర్ఎస్ వాళ్ళు ఓర్చుకోలేక పోతున్నారు. బిఆర్ఎస్ వాళ్ళు పెట్టే ప్రెస్‌మీట్‌లను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ప్రారంభిస్తున్న పథకాల్లో పాల్గొని అక్కడ ఏమైనా తప్పులు జరిగితే మా దృష్టికి తీసుకురండి సమస్య పరిష్కారం చేస్తాం అని ప్రజలకు పిలుపునిచ్చారు.

# ఉర్దూ భాషను బతికించుకోవాలి




### ఉర్దూ అవార్డుల ప్రదానంలో పాల్గొన్న మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉర్దూ భాషను బతికించుకోవాలని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రాంతీయ భాషలను కాపాడుకోవాల్సిన బాధ్యత ఆయా ప్రాం తాల ప్రజలపైనే ఉందని అన్నారు. ప్రాంతీయ భాషలపై ఇంగ్లీష్ అధిపత్యం చేలాయిస్తుందన్నారు. సోషల్, డిజిటల్ మీడియా నియంత్రణపై త్వరలోనే జాతీయ స్థాయిలో సెమీనార్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. 'నసీమ్ ఆరిఫ్ ఉర్దూ మీడియా అవార్డ్స్– 2025' ప్రదానోత్సవ కార్యక్రమం శనివారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారకభవన్‌లో జరిగింది. అవార్డు విజేతలు డాక్టర్ రుష్దా షాహీన్ (న్యూఢిల్లీ), మహ్మద్ అర్షద్ (హైదరాబాద్), సయ్యద్ సజ్జదుల్ హుస్సేన్ (హైదరాబాద్), జకారియా(మధుబని, బీహార్) లను ఘనంగా సన్మానించి రూ.15 వేల నగదు అవార్డులను బహుకరించారు. లైఫ్ టైమ్ అచివ్‌మెంట్ అవార్డును ఖుర్బాన్ అలీ (న్యూ ఢిల్లీ)కి అందచేశారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంఎల్‌సి అమీనుల్ జాఫ్రీ, టియుడబ్ల్యూజె అధ్యక్షులు కె.విరాహాత్ అలీ, ప్రధాన కార్యదర్శి రామ్‌నారాయణ హాజరయ్యారు. అంతకు ముందు జరిగిన చర్చకు ప్రొఫెసర్ మీర్ ఆయూబ్ అలీఖాన్ అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి మోడరేటర్‌గా సీనియర్ జర్నలిస్ట్ సోమశేఖర్ వ్యవహరించారు. సభలో కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తాను 1970లో జర్నలిజంలోకి వచ్చినప్పటి నుంచి నసీమ్ ఆరిఫ్ మంచి మిత్రుడని తెలిపారు. అమెరికా అధిపత్యంతో ఇంగ్లీష్ భాష ప్రాంతీయ భాషలను మింగేస్తుందన్నారు. లాటిన్ అమెరికా దేశాలలో ఇది ఎక్కువగా ఉందన్నారు. ఇండియా, రష్యా, చైనా, వియత్నాం, జర్మనీ, ఫ్రెంచ్ ఇలా 47 దేశాలు తమ భాషలనే అమలు చేస్తున్నాయని తెలిపారు. తెలంగాణలో కూడా ఇటీవల ఇంటర్ బోర్డు బలవంతంగా సంస్కృత భాషను అమలు చేసేందుకు నోటిఫికేషన్ ఇచ్చిందని, దాదాపు 160 సంస్కృత భాషా పండిత్ పోస్టులను భర్తీ చేశారని, దీనిని అందరూ వ్యతిరేకిస్తున్నారని శ్రీనివాస్‌రెడ్డి వివరించారు. లోక్‌సభ స్థానాల డీలిమిటేషన్ అంశంపై ఇచ్చిన లేఖపై తమిళనాడు సభలో ప్రధాని మోదీ సిఎం స్టాలిన్‌ను విమర్శించారన్నారు. లేఖపై స్టాలిన్ తమిళంలో కాకుండా ఇంగ్లీష్‌లో ఎందుకు సంతకం పెట్టారని ప్రశ్నించారన్నారు. కంచ గచ్చిబౌలిలో నెమళ్లు, జింకలు, ఏనుగులు పరిగెత్తినట్లు ఎఐతో సోషల్ మీడియాలో పోస్టులు చేశారన్నారు. సోషల్ మీడియా, ఎఐపై జాతీయ స్థాయిలో సెమీనార్ నిర్వహించనున్నట్లు చెప్పారు. సోషల్ మీడియా, కానీ డిజిటల్ మీడియా సంస్థల రిజిస్ట్రేషన్ అంశం కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉంటుందన్నారు. తెలుగు పత్రికలలో ఈనాడు విప్లవాత్మక మార్పులు తీసుకువస్తే, ఉర్దూలో మున్సిఫ్ పత్రిక మార్పు తీసుకొచ్చిందని శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. అమీనుల్ జాఫ్రీ మాట్లాడుతూ సోషల్ మీడియా రాజకీయాలలో ఉన్న మలినాన్ని మొత్తం సమాజంపై రుద్దుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సోమశేఖర్ మాట్లాడుతూ ప్రస్తుతం మీడియా సంస్థలు పరోక్షంగానో, ప్రత్యక్షంగానో రాజకీయ పార్టీలు, కార్పొరేట్ సంస్థల ద్వారా నడుస్తున్నాయన్నారు. ఎన్‌డిటివిని అదానీ సంస్థ స్వాధీనం చేసుకుందన్నారు. అంతకు ముందు జరిగిన చర్చలో ఉర్దూ జర్నలిజం, ఉర్దూ భాషను రక్షించుకోవాల్సిన ఆవశ్యకతను వక్తలు నొక్కి చెప్పారు.

# ప్రశాంతంగా ముగిసిన హనుమాన్ శోభాయాత్ర



### యాత్రను కమాండ్ కంట్రోల్ నుంచి వీక్షించిన కమిషనర్ సివి ఆనంద్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** శ్రీ వీర హనుమాన్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన హనుమాన్ శోభాయాత్ర ప్రశాంతంగా ముగిసింది. గౌలిగూడ రామ మందిరం నుంచి ప్రారంభమైన ప్రధాన శోభా యాత్ర కోఠి, సుల్తాన్‌బజార్, నారాయణగూడ, ఆర్‌టిసి చౌరస్తా, అశోక్‌నగర్, కవాడిగూడ, బైబిల్‌హౌస్ మీదుగా తాడ్‌బండ్ హనుమాన్ టెంపుల్ వరకు దాదాపు 12.2 కిలోమీటర్ల మార్గాన్ని పూర్తి చేసింది. ఈ బందోబస్తులో సుమారు 17000 మంది పోలీసులు పాల్గొన్నారు. శ్రీ వీర హనుమాన్ విజయ యాత్రలను సిసిటీవిల ద్వారా, డ్రోన్ కెమెరాల ద్వారా జాయింట్ కమాండ్ కంట్రోల్‌లో హైదరాబాద్ పోలీసు కమిషనర్ సివి ఆనంద్ పర్యవేక్షించి సూచనలు, సలహాలు ఇచ్చారు. హైదరాబాద్ సిటీ కమిషనరేట్ పరిధిలో సుమారు 150 శ్రీ వీర హనుమాన్ విజయయాత్రలు, సైబరాబాద్, రాచకొండ పరిధిలో నుండి 40 విజయ యాత్రలు జరిగాయి. అనంతరం సివి ఆనంద్ మీడియాతో మాట్లాడుతూ.. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా విస్తృతంగా బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. మొన్న జరిగిన శ్రీరామ నవమి శోభాయాత్రకు హైదరాబాద్ సిటీ ప్రజలు, భక్తులు, నిర్వాహకులు అందరి సహాయంతో ప్రశాంతంగా ముగించామన్నారు. అలాగే హనుమాన్ శోభాయాత్ర కూడా ప్రశాంతంగా నిర్వహించినందుకు హైదరాబాదు సిటీ పోలీసు తరపున ఆయన అందరికి ధన్యవాదములు తెలిపారు. హైదరాబాద్ సిటీ పరిధిలోని కొన్ని సమస్యాత్మక, ఇతర మత ప్రార్థన స్థలాల వద్ద ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా చర్యగా విహెచ్‌పి, భజరంగ్ దల్, ఇతర మత పెద్దలతో మాట్లాడి స్థానిక డిసిపి అధికారుల నేతృత్వంలో ఊరేగింపు ప్రశాంతంగా జరిగే విధంగా ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు.




## కలిసొచ్చిన అదృష్టం



మేరీల్యాండ్‌లో నివసించే అన్నే అరండేల్‌కు లాటరీలంటే పడదు. ఎన్నడూ లాటరీ టికెట్ కొనలేదు. కానీ, ఆమెకు 30,000 డాలర్ల ప్రైజ్ మనీ లభించింది. తాను కొనని లాటరీకి ప్రైజ్ మనీ రావడాన్ని మొదట ఆమె నమ్మలేదు. కానీ, సమీప బంధువు బహుమతిగా ఇచ్చిన మూడు డాలర్ల బోనస్ క్రాస్‌వర్డ్ స్క్రాచ్–ఆఫ్ టికెట్‌పై ఈ బహుమతి లభించిందని తెలుసుకొని ఆశ్చర్యపోయింది. వివరాల్లోకి వెళితే, అనారోగ్యంతో బాధపడుతున్న బంధువు ఒకరిని పరామర్శించేందుకు అరండేల్ అతని ఇంటికి వెళ్లింది. కొద్దిసేపు మాట్లాడి, ఓదార్చి వెనుదిరిగినప్పుడు, ఆ వ్యక్తి ఆమెకు స్క్రాచ్ టికెట్ ఇచ్చాడు. లాటరీలపై ఎలాంటి ఆసక్తి లేనప్పటికీ, తన బంధువు ఇచ్చిన టికెట్‌ను బయటపారేయలేక ఇంటికి తెచ్చుకొని, షెల్ఫ్‌లో భద్రపరచింది. ఆ టికెట్‌కే లాటరీ తగలడంతో ఆశ్చర్యపోయిన అరండేల్, తక్షణమే లాటరీ ఏజెండ్ వద్దకు పరుగులు తీసింది. అనుకోకుండా అదృష్టం వరిస్తుందంటే ఇదే కాబోలు.

## సుదీర్ఘ ప్రయాణం..



ఒక చిన్న పక్షి సుదీర్ఘ ప్రయాణం చేస్తుందని ఎవరూ ఊహించలేరు. చెప్పినా నమ్మరు. కానీ, బార్న్‌స్వాలో పక్షుల ప్రయాణం గురించి తెలిస్తే మాత్రం అద్భుతం అనక మానరు. ఈ చిన్న పక్షులు తమ జాతిని పెంచుకోవడానికి ప్రతి సంవత్సరం ఫిబ్రవరి మాసంలో అర్జెంటీనా నుంచి బయలుదేరుతాయి. 8,300 కిలోమీటర్లు ప్రయాణించి, మార్చి నెల చివరిలో కాలిఫోర్నియా చేరుకుంటాయి. అక్కడ ఒక సురక్షితమైన ప్రదేశంలో నివాసం ఏర్పరుచుకుంటాయిది. తమ వంశాన్ని వృద్ధి చేసుకుని అక్టోబర్ మాసంతో తన పక్షి పిల్లలతో కలిసి తిరుగు ప్రయాణమవుతాయి. అంటే, మరో 8,300 కిలోమీట ర్లు ఎగురుకుంటూ, స్వస్థలానికి చేరుకుంటాయి. మొత్తం మీద 16,600 కిలోమీటర్లు ప్రయాణం చేసే ఈ పక్షులను సాహసానికి, పట్టుదలకు మారుపేరుగా కూడా చెప్పుకోవాలి. ఎందుకంటే, ఇది ప్రయాణించేది మొత్తం సముద్ర మార్గమే. అందుకే, ఈ పక్షులు చిన్న పుల్లను తమకు తోడు తెచ్చుకుంటాయి. అలసిపోయినప్పుడు ఆ పుల్లను నీటిపై వేసి కొద్ది సేపు విశ్రమిస్తాయి. తిరిగి ప్రయాణం మొదలుపెడతాయి. వేల కిలోమీటర్ల ప్రయాణం అనుకున్నంత సులభం కాదుగానీ, ఆ చిన్న పక్షుల దీక్ష ముందు అడ్డంకులు దూదిపింజల్లా చెల్లాచెదరవుతాయి.

## 'వెసెల్'కు సందర్శకుల తాకిడి



న్యూయార్క్ నగరంలో హడ్సన్ యార్డ్ రీడెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా సందర్శకులను ఆకట్టుకునేందుకు 'వెసెల్' నిర్మాణాన్ని చేపట్టారు. విస్తృతమైన తేనెగూడు లాంటి ఈ 16 అంతస్తుల నిర్మాణానికి బ్రిటిష్ డిజైనర్ థామస్ హీథర్‌విక్ దీనికి రూపకల్పన చేశాడు. 2,500 మెట్లు.. సందర్శకుల సౌకర్యార్థం 80 ల్యాండింగ్స్‌తో అద్భుత నిర్మాణానికి 200 మిలియన్లు ఖర్చు చేశారు. 2016, సెప్టెంబర్ 14న ప్రాజెక్టు వివరాలను హడ్సన్ యార్డ్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రకటించింది. 2017 ఏప్రిల్ మాసంలో దీని నిర్మాణం మొదలైంది. ఇటలీలో తయారైన ఇనుప దూలాలను అమెరికాకు తరలించారు. 2019 మార్చి 15న ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. అయితే, ఆరంభం నుంచి దీనికి మిశ్రమ స్పందన వచ్చింది. కొంతమంది దీనిని న్యూయార్క్ నగరానికి, ప్రత్యేకించి హడ్సన్ యార్డ్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని పేర్కొంటే, మరికొందరు ఇంతకంటే చెత్త నిర్మాణం మరొకటి లేదని విమర్శించారు. వెసెల్ వద్ద ఫొటోలు తీసుకోవాలన్నా.. కనీసం దాని ఫొటో తీయాలన్నా నిర్బంధ కాపీరైట్ సమస్యను ఎదుర్కోవాల్సి వచ్చేది. అంతేగాక, ఈ నిర్మాణం దివ్యాంగులకు అందుబాటులో లేదన్న విమర్శలు కూడా వినిపించాయి. నిర్వాహకులు ఈ రెండు సమస్యలను పరిష్కరించడంతో, సందర్శకుల తాకిడి పెరిగింది. కానీ, 2021 జనవరిలో ముగ్గురు వ్యక్తులు ఆత్మహత్య చేసుకోవడంతో, వెసెల్‌ను నిరవధికంగా మూసివేశారు. 2021 మే మాసంలో తిరిగి తెరచుకున్నప్పటికీ, రెండునెలల వ్యవధిలోనే మరొకరు ఆత్మహత్య చేసుకోవడంతో వెసెల్ మరోసారి మూతపడింది. ఎన్నో రకాల భద్రతా ఏర్పాట్ల నడుమ 2024 సెప్టెంబర్‌లో మళ్లీ తెరచుకున్న వెసెల్ ఇప్పుడు న్యూయార్క్ నగర శోభను పెంచుతున్నది.

## ప్రమాదానికి కారణం పెంగ్విన్!



పెంగ్విన్ పక్షులు ఎవరికీ ఎలాంటి హానీ చేయవు. కానీ, ఒక హెలికాప్టర్ ప్రమాదం పెంగ్విన్ వల్ల జరిగిందని దక్షిణాఫ్రికా పౌర విమానయాన అథారిటీ (ఎస్ఎసిసిఎ) వాపోతున్నది. హెలికాప్టర్ తక్కువ ఎత్తులో ఎగురుతున్న కారణంగా, ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు. ఎస్ఎసిసిఎ ప్రకారం, ఈస్ట్ కేప్‌లోని బర్డ్ ఐలాండ్‌లో పైలట్‌తోపాటు మరో ముగ్గురు ప్రయాణికులు దిగారు. అక్కడ ఒక ప్రయాణికుడు పెంగ్విన్‌ను చూసి, ముచ్చటపడి దానిని కార్డ్‌బోర్డులో ఉంచి తనతో తీసుకెళ్లే ప్రయత్నం చేశా డు. నిజానికి ఇలాంటి ప్రయత్నాలను పైలట్ అడ్డుకోవాలి. కానీ, అతను కూడా చూసీచూడనట్టు వ్యవహరించాడు. హెలికాప్టర్ ముందు సీటులో ప్రయాణిస్తున్న ప్రయాణికుడు పెంగ్విన్ ఉన్న పెట్టెను తన ఒడిలో పెట్టుకున్నాడు. కానీ టేకాఫ్ అయిన వెంటనే అతను తన పట్టును కోల్పోయాడు. పెంగ్విన్‌ను ఉంచిన పెట్టె పైలట్ సైక్లిక్ పిచ్ కంట్రోల్ లివర్‌లోకి జారిపోయింది. లివర్‌ను కుడివైపుకు నెట్టడం వల్ల హెలికాప్టర్ కూడా కుడివైపు తిరిగి దాని రోటర్‌లతో నేలను ఢీకొట్టింది. పెంగ్విన్‌ను ప్రమాదానికి కారణంగా పేర్కొంటూ ఎస్ఎసిసిఎ కేసును మూసివేసింది.

బిఎస్ఎస్ మైత్రేయి

# తమిళనాడులో 'మళ్లీ పెళ్లి'

తమిళనాడులో వచ్చే సంవత్సరం జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి పోటీ చేసేందుకై ఎఐఎడిఎంకె – బిజెపి మధ్య 'అలయెన్స్' ఖరారైంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సంధానకర్తగా వ్యవహరించారు. దీనివెనుక అనేక నెలల కృషి ఉంది. తమిళనాడులో సొంతంగా ఎదగటానికి బిజెపి ప్రయత్నాలు సత్ఫలితాలివ్వలేదు. రాష్ట్ర బిజెపి అధ్యక్షుడిగా నియమించబడిన కె.అన్నామలై ద్రవిడ ఉద్యమ నేతలను తెగనాడటం ద్వారా కమలం జండాను సెక్రటేరియట్‌పై ఎగరవేయాలనుకున్నాడు. జయలలిత మరణానంతరం అన్నాడిఎంకెలో ఆధిపత్యం కోసం నాయకుల మధ్య హోరాహోరీ సాగిన అంతర్గత పోరాటంలో మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి కె.పళనిస్వామి (ఇపిఎస్)పైచేయి సాధించారు. ఎన్‌డిఎలో భాగస్వామి అయినారు. శశికళ, దినకరన్, ఒ.పన్నీర్ సెల్వం(ఒపిఎస్–జయలలిత జైలుకెళ్లి నప్పుడల్లా ఆపద్ధర్మ ముఖ్యమంత్రి, పార్టీ నాయకత్వాన్ని ఆశించిన వారసుడు)బయటకు వెళ్లిపోయారు. అన్నా డిఎంకె బలహీనపడిన నేపథ్యంలో రాజకీయ క్షేత్రంలో జాగాకోసం ప్రయత్నించిన బిజెపికి అన్నామలై పార్టీని ఐక్యంగా ఉంచలేకపోయారు; నోటి దురుసుతో అన్నా డిఎంకెకి దూరమైనాడు.

2023 సెప్టెంబర్‌లో అన్నా డిఎంకె ఎన్‌డిఎ నుంచి వైదొలిగింది. డిఎంకె–ఎఐఎడిఎంకె మధ్య– రెండు ద్రవిడ పార్టీల మధ్య విభజించబడిన తమిళ రాజకీయక్షేత్రం కాంగ్రెస్, బిజెపిలకే కాదు, ఇతర కులప్రాతిపదిక తమిళపార్టీలకు స్థానమివ్వలేదు. కమ్యూనిస్టుపార్టీలు సహా జాతీయ, ప్రాంతీయ పార్టీలన్నీ ఏదోక ద్రవిడపార్టీ నాయకత్వంలోని కూటమిలో చేరవలసిందే. ఈ క్రమంలోనే కరుణానిధి మరణానంతరకాలంలో ఆయన కుమారుడు, డిఎంకె అధ్యక్షుడు ఎంకె.స్టాలిన్ నాయకత్వంలో యుపిఎ లేదా ఇండియా కూటమి వరుసగా రెండుసార్లు అత్యధిక మెజారిటీతో రాష్ట్రంలో అధికారం నిలుపుకుంది. లోక్‌సభ ఎన్నికల్లోనూ అద్భుత ఫలితాలు సాధించింది.

ప్రజాపక్షం
13-04-2025, ఆదివారం

ఇదిలాఉండగా, సూపర్ స్టార్ రజనీకాంత్ రాజకీయ అరంగేట్రానికి అన్ని ఏర్పాట్లు చేసుకుని, చివరికి ఆరోగ్య కారణాలతో ఆ ప్రయత్నం విరమించుకున్నారు. ఆయనపై బిజెపి పెట్టుకున్న ఆశలు అడియాసలైనాయి. అంతకుముందే మరో సూపర్ హీరో కమల హాసన్ రాజకీయ పార్టీ ఏర్పాటు చేసి ఒకసారి ఎన్నికల క్షేత్రంలో బలపరీక్షలో విఫలమై క్రియాశీల రాజకీయాలనుంచి తప్పుకుని డిఎంకె కూటమికి సన్నిహితమైనారు. మరో యువ హీరో విజయ్ గత సంవత్సరం ఫిబ్రవరిలో రాజకీయ పార్టీని ప్రకటించారు. కులం, సినిమా గ్లామర్‌పై ఆధారపడిన ఆయన మూడవశక్తిగా ముఖ్యమంత్రి పీఠానికి గురిపెట్టారు. కాబట్టి బిజెపి వ్యూహానికి చేరువలో లేరు. ఈ నేపథ్యంలో, దక్షిణాదిరాష్ట్రాల్లో పాదముద్రలకోసం తపిస్తున్న బిజెపి మళ్లీ అన్నాడిఎంకెతో తెరచాటుమంతనాలు ఆరంభించి సఫలమైంది.అన్నా డిఎంకె కోరినట్లు అన్నామలైని రాష్ట్ర బిజెపి అధ్యక్ష పదవినుంచి తొలగించింది. కేంద్రంలో మంత్రిపదవి ఇస్తారట. 2017లో ఎఐఎడిఎంకె నుండి బిజెపిలో చేరిన మాజీమంత్రి నైనార్ నాగేంద్రన్‌ను కొత్త అధ్యక్షునిగా నియమించింది. వచ్చే ఎన్నికల్లో గెలిచి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని ఆత్మసంతృప్తి ప్రకటన చేసిన అమిత్ షా ఆ ప్రభుత్వ ముఖ్యమంత్రి ఇ.పళనిస్వామి అని ప్రకటించారు. ప్రభుత్వంలో బిజెపి చేరుతుందా అని ప్రశ్నించగా ఎన్నికల అనంతరం ఆలోచిస్తామన్నారు. ఢిల్లీలో నరేంద్రమోదీ, తమిళనాడులో ఎడప్పాడి నాయకత్వంలో ఎన్‌డిఎ పనిచేస్తుందన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో కలిసివచ్చిన అదృష్టం తమిళనాడు రాజకీయ వ్యూహాలకు బిజెపి అధిష్టానాన్ని తొందరపెట్టినట్లుంది. ఎపిలో ఎన్నికలకు కొద్దిరోజులముందు కూటమి ఫైనలైజ్ అయినా అక్కడ కూటమి గెలిచిన ఎంపి స్థానాలు ఢిల్లీలో బిజెపి ప్రభుత్వానికి ఆక్సిజన్ అందించాయి. అయితే తమిళనాడు కార్యక్షేత్రం పూర్తిగా భిన్నమైంది గనుక అసెంబ్లీ ఎన్నికలకు సంవత్సరం ముందే అన్నా డిఎంకెతో పొత్తు ఖరారు చేసుకున్నారు. ఎఐఎడిఎంకెతో ఉన్న పార్టీలన్నీ ఎన్‌డిఎ కూటమిలోకి వస్తాయి. సినీమా హీరో విజయ్ వైఖరి తమిళ రాజకీయాలను ప్రభావితం చేస్తుంది. అయినా డిఎంకె కూటమి ఇప్పటికి తిరుగులేనిశక్తిగా ఉంది.

# నవ భారత నిర్మాత డా॥ బి.ఆర్.అంబేద్కర్



వెంకటరమణ గిలకత్తుల
9866878769

'మీ హక్కుల కోసం పోరాడండి. ఎందుకంటే హక్కులు ఎవరూ ఇవ్వరు. మీరే సాధించుకోవాలి'.

*భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్*

బాబా సాహెబ్‌గా గౌరవంగా పిలువబడే డాక్టర్ భీమ్ రావు రాంజీ అంబేద్కర్ భారత రాజ్యాంగ పితామహుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి, సామాజిక సంస్కర్త, ఆర్థికవేత్త, న్యాయవేత్త, రాజనీతిజ్ఞుడు, అణగారిన వర్గాల కోసం జీవితాన్నే అంకితం చేసిన మహనీయుడు.

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ జిల్లాలోని మోవ్ అనే గ్రామంలో 1891 ఏప్రిల్ 14న జన్మించారు. తల్లి బీమా బాయి, తండ్రి రాంజీ మలోజీ సక్పాల్. తల్లిదండ్రులకు 14వ సంతానం. బాల్యంలో సామాజిక, ఆర్థిక అవమానాలకు, కుల వివక్షతకు గురయ్యాడు.నిమ్న కులాలకు పాఠశాలలో నీరు త్రాగడానికి కూడా అనుమతి లేకపోవడం ఆనాటి సామాజిక దురాచారాలకు దర్పణం. నో ప్యూన్ నో వాటర్ అనే దుస్థితి. ఈ రకమైన అణిచివేత విధానాలే కులవివక్షతకు వ్యతిరేకంగా, సామాజిక న్యాయపోరాటానికి ప్రేరణ అయినాయి.

1907లో తన మెట్రిక్యులేషన్ పరీక్ష ఉత్తీర్ణత తర్వాత సంవత్సరం బొంబాయి విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న ఎల్ఫిన్ స్టోన్ కళాశాలలో చేరాడు. 1912లో ఆర్థిక రాజనీతి శాస్త్రంలో డిగ్రీ పొందాడు. 1913లో 22 సంవత్సరాల వయసులో అంబేద్కర్‌కు న్యూయార్క్ నగరంలోని కొలంబియా విశ్వవిద్యాలయంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యకు అవకాశాలను అందించడానికి రూపొందించిన సాయాజీరావు గైక్వాడ ఏర్పాటు చేసిన పథకం కింద మూడు సంవత్సరాల పాటు బరోడా స్టేట్ స్కాలర్షిప్ లభించింది. 1915 వ సంవత్సరంలో కొలంబియా విశ్వవిద్యాలయం ఎం ఏ డిగ్రీని ప్రదానం చేసింది. 1927లో కొలంబియా విశ్వవిద్యాలయం నుండి ఎకనామిక్స్‌లో పిహెచ్‌డి పూర్తిచేశాడు. 1923 వ సంవత్సరంలో గ్రేస్ ఇన్ లండన్ లా కాలేజ్ నుండి బారిష్టర్ ఎట్ లా పట్టా పొందాడు. 1925 వ సంవత్సరంలో లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుండి పిహెచ్‌డి పూర్తి చేశాడు. ప్రపంచవ్యాప్తంగా యువ న్యాయవాదులందరికీ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గొప్ప ప్రేరణా శక్తి.

**సామాజిక సంస్కరణ ఉద్యమాలు**

1920 జనవరి 31న మూక్ నాయక్ పక్షపత్రిక (స్వరం లేని వారికోసం నాయకుడు) అని అర్థం వచ్చే మరాఠీ పత్రికను ప్రారంభించాడు. అణగారిన వర్గాల ఆందోళనలు వినిపించడానికి ఈ పత్రిక ప్రారంభించాడు. సామాజిక ఉద్యమంలో ఇది కీలక మాధ్యమంగా నిలిచింది. 1924లో బొంబాయిలో బహిష్కృత హితకారిణి సభను స్థాపించారు. అణగారిన వర్గాలలో విద్య, ఆర్థిక స్థితిని మెరుగుపరచడం, వారిలో సామాజిక, రాజకీయ అవగాహన కలిపించడం దీని ప్రధాన లక్ష్యం. 1927 ఏప్రిల్ 3న బహిష్కృత భారత్ అనే వార్తాపత్రిక ప్రారంభించబడింది. ఇది అణిచివేత కు గురైన వర్గాలు, నిమ్న కులాలు, దళితుల సంక్షేమం కోసం ప్రారంభించబడినది. 1927 మార్చి 20 న చావదర్ ట్యాంకు వద్దకు చేసిన మహద్ మార్చ్ కు నాయకత్వం వహించారు. సత్యాగ్రహ దళిత ఉద్యమంలో ఇది ఒక కీలక సంఘటన. ప్రజా చెరువు నుండి నీరు త్రాగే హక్కు కోసం ఉద్యమించి విజయం సాధించారు.భవిష్యత్ ఉద్యమాలకు ఇది కేంద్ర బిందువై మరిన్ని సామాజిక సంస్కరణలకు మార్గం సుగమం చేసింది. 1930లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నేతృత్వంలో జరిపిన కాలారాం ఆలయ ప్రవేశ సత్యాగ్రహ ఉద్యమం దళితులకు పూజలు చేసే హక్కులను మరియు సమానత్వం సాధించడానికి నిర్ధారించింది. భారతీయ సమాజంలో సమానత్వ హక్కుల సాధన, చర్చను రూపొందించడంలో ఈ ఉద్యమం కీలకపాత్ర పోషించింది. మానవ హక్కులు, సామాజిక న్యాయం పోరాటంలో ఇది మైలురాయిగా నిలిచింది. 1928లో రాజ్యాంగ సంస్కరణలపై, దళిత, అణగారిన వర్గాల డిమాండ్ల సాధన కోసం సైమన్ కమిషన్ ముందు తన వాదనలు వినిపించారు. లండన్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశాల్లో పాల్గొన్నారు. 24 సెప్టెంబర్ 1932 లో జరిగిన పూణే ఒప్పందం ద్వారా డిప్రెస్డ్ క్లాసెస్ కోసం స్థానిక ఎన్నికల్లో రిజర్వ్ స్థానాలు కల్పించడం, వారి రాజకీయ ప్రాతినిధ్యం పెంచడం జరిగింది. అణగారిన వర్గాలకు రాష్ట్ర, కేంద్ర శాసనసభల్లో ప్రవేశించే అవకాశం లభించింది. భవిష్యత్ రాజకీయ సంస్కరణలు, సామాజిక క్రియాశీలతకు పునాదివేసింది.



**రాజకీయ క్రియాశీలత**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 1926లో బొంబాయి లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యునిగా బ్రిటిష్ ప్రభుత్వం ద్వారా నామినేట్ అయ్యారు. దళితుల హక్కులకోసం శక్తిమంతంగా మాట్లాడారు. 1936లో ఇండిపెండెంట్ లేబర్ పార్టీని స్థాపించారు. కార్మికులు,దళితుల హక్కుల కోసం పోరాడారు. జాగిర్దారీ వ్యవస్థను రద్దు చేయాలని గట్టిగా వాదించారు. 1937లో లేబర్ పార్టీ తరపున పోటీ చేసి 15 స్థానాలు గెలుచుకున్నారు. ఇది తొలి రాజకీయ విజయం. 1942లో షెడ్యూల్డ్ క్యాస్ట్ ఫెడరేషన్ స్థాపించారు. ప్రత్యేకంగా దళితుల రాజకీయ ప్రాతినిధ్యం కోసం ప్రారంభించిన రాజకీయ సంస్థ ఇది. 1942లో భారత గవర్నర్ జనరల్ మండలికి కార్మిక సభ్యునిగా(1942–46) నియమితులయ్యారు. 1946లో బాంబే ప్రెసిడెన్సీ కాన్స్టిట్యూషన్ అసెంబ్లీ సభ్యుడు అయ్యాడు. రాజ్యాంగ రూపకల్పనలో కీలకపాత్ర వహించాడు. స్వతంత్ర భారతదేశపు మొదటి మంత్రివర్గంలో(1947–51) న్యాయశాఖ మంత్రిగా నియమితులయ్యారు మహిళల హక్కుల కోసం హిందూ కోడ్ బిల్లును ప్రవేశపెట్టారు. భారత రాజ్యాంగాన్ని రూపొందించే డ్రాఫ్టింగ్ కమిటీకి చైర్మన్‌గా (1947–50) వ్యవహరించారు. 1952లో బొంబాయి రాష్ట్రం నుండి రాజ్యసభకు నామినేట్ చేయబడ్డారు. జీవితాంతం(1956) వరకు ఈ పదవిలో కొనసాగారు. 1956లో బౌద్ధ మతాన్ని స్వీకరించి నవయాన బౌద్ధ ఉద్యమాన్ని ప్రారంభించారు. బహుభాషా కోవిదుడు, సుమారు 50కి పైగా రచనలు చేసి సామాజిక స్పృహ రగిలించిన పోరాట వీరుడు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుండి 'డాక్టర్ ఆల్ సైన్స్' అనే డిగ్రీని పొందిన ఏకైక వ్యక్తి.

**ఆర్థిక సంస్కరణలు**

హిల్టన్ అండ్ యంగ్ కమిషన్ కు తన సిఫారసులు సమర్పించడం ద్వారా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏర్పాటును గణనీయంగా ప్రభావితం చేశారు. అంబేద్కర్ భూమిని సామాజిక ఆస్తిగా పరిగణించారు. భూ సంస్కరణలు ముఖ్యమని వాదించారు. నిరుద్యోగ నిర్మూలనకు పారిశ్రామికీకరణ వేగవంతం చేయాలని సూచించారు.

**రాజ్యాంగ రచన**

రాజ్యాంగ ముసాయిదా కమిటీ చైర్మన్‌గా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని రూపొందించడంలో కీలక పాత్ర పోషించారు. సమానత్వం, సామాజిక న్యాయం, అణగారిన వర్గాల రక్షణ కోసం నిబంధనలు నిర్ధారించడంలో కీలకపాత్ర పోషించారు. వ్యక్తిగత హక్కుల సూత్రాలను ప్రతిష్టించారు.

**బౌద్ధమత ఆలింగనం**

ఏప్రిల్ 14,
అంబేద్కర్ 135వ
జయంతి

1956 అక్టోబర్ 14న నాగపూర్ లో జరిగిన చారిత్రాత్మక వేడుకల్లో బౌద్ధ మతాన్ని స్వీకరించి ఇదే సమయంలో 'బుద్ధుడు మరియు అతని ధర్మం' గ్రంథాన్ని పూర్తి చేశాడు. ఖాట్మండులో జరిగిన జగతిక్ బౌద్ధ మతమండలిలో డాక్టర్ అంబేద్కర్‌కు 'బోధి సత్వ' అత్యున్నత గౌరవ బిరుదును ప్రదానం చేశారు. ప్రముఖ బౌద్ధ సన్యాసి మహంతి వీర్ చంద్రమణి డాక్టర్ అంబేద్కర్‌ను నేటి కాలపు 'ఆధునిక బుద్ధుడు' అని అభివర్ణించారు.

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రపంచంలోని అణగారిన ప్రజలందరికీ వెలుగునిచ్చిన సూర్యుడు. వారు ఇచ్చిన వెలుగు మనలను పురోగతి వైపు, విజయాల మార్గంవైపు నడిపిస్తుంది. కోట్లాది స్వరంలేని మూగ ప్రజలకు గొంతుకై నిలిచాడు. దేశ సామాజిక, ఆర్థిక, రాజకీయ పరివర్తనలో ముఖ్యపాత్ర పోషించారు. రాజకీయ, సామాజిక ప్రజాస్వామ్యం కలగలిసి జాతీయ ఐక్యతకు తోడ్పడతాయని అభిప్రాయపడ్డాడు. అంబేద్కర్ వారసత్వం సామాజిక న్యాయ ఉద్యమాలకు నిత్య ప్రేరణ స్ఫూర్తినిస్తుంది. 1956 డిసెంబర్ 6న అంబేద్కర్ ఢిల్లీలో మహాపరి నిర్వాణం పొందారు. బిఆర్ అంబేద్కర్ జన్మ శతాబ్ది సంవత్సరం అయిన 1990–1991 సంవత్సరాన్ని సామాజిక న్యాయ సంవత్సరంగా భారత ప్రభుత్వం ప్రకటించుకొని ఆయనను గౌరవంగా సత్కరించుకుంది. ఏప్రిల్ 14, 1990న దేశ అత్యున్నత గౌరవ పురస్కారం భారతరత్నను ప్రదానం చేశారు. భారతదేశ చరిత్రలో అంబేద్కర్‌ది శిఖర సమాన వ్యక్తిత్వం. వెలకట్టలేని ప్రపంచరత్నం. వారు చేసిన సేవలు సువర్ణాక్షరాలతో లిఖించదగినవి. సమాజ మార్పుకోసం వారు చేసిన కృషి భారత ప్రజాస్వామ్యానికి బలమైన పునాది. వారి ఆశయాలను ముందుతరాలకు తీసుకువెళ్లటమే వారికి మనం అర్పించే ఘననివాళి.

# భవిష్యత్తరాల కోసం కలత చెందిన దార్శనికులు



డాక్టర్ దేవరాజు మహారాజు
సుప్రసిద్ధ సాహితీవేత్త,జీవశాస్త్రవేత్త

భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌గా ప్రసిద్ధుడయిన భీం రావ్ రాంజీ అంబేద్కర్, మన భారత రాజ్యాంగ రూపశిల్పి, తొలి కేంద్ర న్యాయ శాఖా మంత్రి, ఆర్థిక వేత్త, సంఘ సంస్కర్త. ముఖ్యంగా అంటరానితనం, కుల నిర్మూలన కోసం సంఘర్షించిన రాజకీయవేత్త, దేశంలో నవయాన బౌద్ధానికి దారులు వేసిన ఆధునిక నవబౌద్ధుడు. కాలం గడుస్తున్న కొద్దీ ప్రజలు అంబేద్కర్‌ను బాగా అర్థం చేసుకుంటున్నారు. దళితులు బహుజనులు మాత్రమే కాదు, అన్ని వర్గాల వారు, అన్ని మతాల వారూ అంబేద్కర్ చూపిన మార్గాన్ని ఎంచుకుంటున్నారు. అయితే 1956 మార్చి 18న ఆగ్రా నగరంలో ఒక సంఘటన జరిగింది. అక్కడ ఆ రోజు డా.బి.ఆర్. అంబేద్కర్ (1891 ఏప్రిల్ 14 –1956 డిసెంబర్ 6) తన అనుచరులతో మాట్లాడుతూ భావోద్వేగానికి గురై, ఉన్న ఫళాన కంట తడిపెట్టారు. 'ఏమిటీ? ఏమైంది?' – అని అనుచరులు కంగారు పడి అడిగినప్పుడు – ఆయన కొన్ని విషయాలు చెప్పారు. అవి ఇలా ఉన్నాయిః తన జాతివాసుల్ని తను ఎలా చూడాలనుకున్నారు? వాళ్ళు ఎలా తయారయ్యారు?–అన్న విషయం బేరీజు వేసి చూపారు. తన వాళ్ళను ఉద్దేశించి ఇలా అన్నారు–

నేనేమో మిమ్మల్ని రాజులను చేయాలనుకున్నాను. మీరేమో లాభసాటి నౌకర్లలా మిగిలిపోవాలని అనుకుంటున్నారు.

నేనేమో మిమ్మల్ని రత్నాలుగా చూడాలనుకున్నాను. మీరేమో మట్టి పెళ్ళలుగా మిగిలిపోవాలని అనుకుంటున్నారు.

నేనేమో మీరు సంఘటిత శక్తిగా ఎదగాలనుకున్నాను. మీరేమో ఎవరికి వారు వ్యక్తులుగా ఎదగాలని అనుకుంటున్నారు.

నేనేమో రాజ్యాంగమనే ఆయుధంతో గౌతమ బుద్ధుడు, జ్యోతీరావు ఫూలే మొదలు పెట్టిన యుద్ధం గెలవాలని అనుకున్నాను. మీరేమో రిజర్వేషన్ ఫలాలు అనుభవిస్తూ నిద్రపోవాలని అనుకుంటున్నారు.

నేనేమో పూర్వీకుల చరిత్ర చదివి, ఆచరించి, పీడిత తాడిత మూల వాసుల తరపున మీరంతా నిలబడాలని అనుకున్నాను. మీరేమో మన పూర్వీకుల చరిత్రే చదవకూడదని అనుకుంటున్నారు.

నేనేమో వచ్చిన స్వాతంత్ర్యం నుంచి వేరే ఇంకో స్వతంత్రం కోరుకోవడం లేదు – వెట్టి చాకిరి, బానిసత్వం, కులం, మతం, దోపిడి, దౌర్జన్యం– సంకెళ్ళ నుంచి మిమ్మల్ని విముక్తుల్ని చేయాలని అనుకున్నాను. మీరేమో ముందు చూపు లేకుండా, రాబోయే పెను ముప్పును చూసుకోకుండా కళ్ళు మూసుకుని కాలక్షేపం చేయాలని అనుకుంటున్నారు.

స్పృహలేని ఉద్యోగాల కోసం, స్ఫూర్తి లేని రాజకీయ నాయకుల కోసం, సంఘటితం కాని సంస్కర్తల కోసమేనా నా ఈ కన్నీళ్ళు?

"మీరంతా నా అనుచరులు గనుక, నా జాతి వాసులకోసం, నా దేశ ప్రజల కోసం నేను పడుతున్న ఆవేదనను మీరు సరిగా అర్థం చేసుకుంటారని భావిస్తాను. నా కన్నీళ్ళు వృథా పోవనీ, వాటి విలువను మీరు వారికి తెలియజెప్తూ ఉంటారని ఆశిస్తాను"! అని అన్నారు అంబేద్కర్. భవిష్యత్తరాల అభ్యున్నతికోసం డా.బి.ఆర్.అంబేద్కర్ పడిన ఆవేదన వృథా కాకూడదు. మనం మన ముందు తరాల్ని చైతన్యవంతులుగా తీర్చిదిద్దడం – ఒక బాధ్యతగా స్వీకరించాలి!

నేటి బాలబాలికలే రేపటి పౌరులు గనక, వారి విద్యాభ్యాసం ఎలా జరగాలి? వారు ఉన్నతమైన ఆశయాలతో ఎలా పెరగాలీ? – అన్న విషయం అబ్రహాం లింకన్ (12 ఫిబ్రవరి 1809 – 15 ఏప్రిల్ 1865) ఒక ఉత్తరంలో నమోదు చేశారు. అమెరికాకు పదహారవ అధ్యక్షుడయిన లింకన్, తన చిన్న కుమారుడైన ట్యాడ్ లింకన్‌కు పాఠాలు చెప్పే ఉపాధ్యాయుడికి ఒక లేఖ రాశారు. అందులో అనేక విషయాలున్నాయి. ఇది కేవలం తన కుమారుడికోసం రాసిందే అయినా, ఆయన దృష్టిలో ప్రపంచ యువత ఎలా ఎదగాలి – అన్న విషయం చర్చించారు. ఆ ఉత్తరం ఇలా సాగుతుంది – ప్రతి ఉపాధ్యాయుడూ ఈ ఉత్తరం తనకు వచ్చినట్టుగానే భావించుకోవాలి!

గౌరవనీయ ఉపాధ్యాయుడా!

ఈ భూమి మీది మనుషులందరూ న్యాయమైన వాళ్ళుకాదు, నిజమైన వాళ్ళూ కాదు. ఈ విషయాలు మా అబ్బాయి కచ్చితంగా తెలుసుకోవాలి! మీరు మా వాడికి ఇవి నేర్పించాలి!

ప్రతి ఉత్తముడికి ఒక నీచుడున్నాడు. ప్రతి స్వార్థ రాజకీయ నాయకుడికీ అంకితభావంతో పనిచేసే ఒక నాయకుడున్నాడు. ప్రతి శత్రువుకీ మనకు ఒక మిత్రుడున్నాడు. లేనిదాని గురించి దిగులుపడే గుణాన్ని మా వాడిలోంచి పారద్రోలండి. వీలయితే నిశ్శబ్దంగా నవ్వుకోగల రహస్యాన్ని వాడి గుప్పిట్లో పెట్టండి.

తనకు కొన్ని విషయాలు చిన్నతనంలోనే తెలియాలి. అల్లరి చిల్లర కబుర్లు ఆసక్తి కలిగిస్తాయి కానీ, వాడికి పుస్తకాల మత్తు, మహత్తూ ఏమిటన్నది అర్థం చేయించండి! అలాగే ఆకాశంలోని పక్షులు, తేనెటీగలు, పచ్చటి కొండల అనంత రహస్యాలను అన్వేషించడానికి వీలయినంత ఎక్కువ సమయం కేటాయించాలని చెప్పండి.

మోసం చేయడంకంటే, ఫెయిల్ కావడమే గౌరవప్రదమైన అంశమని, పాఠశాలలో పిల్లలకు మీరు తప్పక బోధించాలి. ఇతరులు తప్పు పడుతున్నారని కాకుండా – తన ఆలోచనలపై తనకు ధృఢమైన విశ్వాసం ఉంచుకోవడం మంచిదని చెప్పండి. మర్యాదస్తులతో మర్యాదగా, మొండివాళ్ళతో మొండిగా మసలుకోవాలన్నది నేర్పించండి!

వీలయితే మా అబ్బాయికి ఈ జ్ఞానాన్ని పంచండి – అందరూ వెళుతున్నారు కాబట్టి, మనమూ ఆ దారిలోనే పరిగెత్తుదామన్న గొర్రె దాటు పద్ధతిని అనుసరించకుండా – నిగ్రహించుకునేట్లు చేయండి! ఎవరేది చెప్పినా, వినగలిగే ఓపికను మా కుర్రవాడిలో పెంపొందించండి.

అయితే, సత్యాసత్యాల నిగ్గు తేల్చుకుని, అసలైన దాన్ని మాత్రమే స్వీకరించాలన్నది నేర్పించండి!

మీకు సాధ్యమైతే ఈ కింది మెళకువలు కూడా నేర్పించండి – దుఃఖంలో నవ్వాలని, కన్నీళ్ళు వస్తే సిగ్గు పడాల్సింది ఏమీ లేదని, ప్రతి దానికి రంధ్రాన్వేషణ చేసే వాడిని పరిహసించాలని – అలాగే ప్రతి చిన్న పనినీ పొగిడే వాడి గూర్చి – జాగ్రత్తగా మసలుకోవాలన్నది బోధించండి!

తన కండను, మెదడును అత్యంత ఎక్కువ ధర చెల్లించేవాడికి అవసరమైతే అమ్ముకోవచ్చు – కానీ, తన మనసుకు, అంతరాత్మకూ ఎప్పుడూ ఎక్కడా, ఎన్నడూ వెల నిర్ణయించకూడదనీ, ఆ పరిస్థితి అసలు తెచ్చుకొనే తెచ్చుకోగూడదనీ బాగా అర్థమయేట్టు చెప్పండి!

పనికిమాలిన అరుపులకు చెవి ఒగ్గగూడదని, తమ సత్యమని బలీయంగా నమ్మిన దానికోసం ఎదురొడ్డి పోరాడాలనీ చెప్పండి.

మా అబ్బాయితో కాస్త సున్నితంగానే వ్యవహరించండి. కానీ, మరీ ముద్దు చేయకండి. ఎందుకంటే ఉక్కు ధృఢత్వం తెలిసేది అగ్నిపరీక్షకు గురైనప్పుడే కదా ?

ధైర్యంగా ఉండగలిగే సహనం తనకు కావాలి! అయితే, అవసరమైనప్పుడు తన అసహనాన్ని ప్రదర్శించే ధైర్యం కూడా తనకు ఉండాలి!

ఎల్లవేళలా తనమీద తనకు అంచంచలమైన విశ్వాసం ఉండేలా తీర్చిదిద్దండి. అప్పుడే ఆ వయసు పిల్లలకు మానవ జాతి మీద ఎనలేని విశ్వాసం ఏర్పడుతుంది.

ఇవన్న చిన్న కోరికలేమీ కావు – చాలా పెద్ద కోరికలే. కానీ, ప్రయత్నించి చూడండి . ముద్దులొలికే నా బంగారు తండ్రి కోసం – ఇందులో మీరు ఏమేమి చేయగలరో ప్రయత్నించి చూడండి. మీ ప్రయత్నం సఫలమైతే. ఆ ఫలితం నా కుమారుడొక్కడికే కాదు – మొత్తం కొన్ని తరాలకు అందించినవారవుతారు. దయచేసి ఆలోచించండి.

– అబ్రహం లింకన్, ఫాదర్ ఆఫ్ ట్యాడ్ లింకన్ (పేరెంట్)

19 అక్టోబర్ 1 952 షిల్లాంగ్ – మేఘాలయలో జరిగిన పెద్ద బహిరంగ సభలో భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ఉపన్యాసం ఈ విధంగా సాగింది. దేశమంటే ఏమిటీ? అంకిత భావంతో పనిచేసే దేశ నాయకులు చేయాల్సింది ఏమిటి? అన్నది ఆయన చెప్పకనే చెప్పారు.

"దేశమంటే కొన్ని పర్వతాలు, కొన్ని నదులు, మైదానాలు, పొలాలూ మాత్రమే కాదు. పెద్దవీ చిన్నవీ అయిన నగరాలు, పట్టణాలు, గ్రామాలు మాత్రమే కాదు. దేశమంటే ఇవన్నీ ఉంటాయి కానీ, దేశ మంటే ఇవి మాత్రమే కాదు దేశమంటే. దేశంలో నివసిస్తున్న ప్రజలు. అందువల్ల, నా భారతదేశంలో ఉన్న ప్రజలను నేను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాను. గతంలో ఉన్న ప్రజలను, ప్రస్తుతం ఉన్న ప్రజలను వారి జీవితాలను చాలా లోతుగా అధ్యయనం చేస్తూ వచ్చాను. దేశమంతా విస్తృతంగా పర్యటిస్తూ వచ్చాను.

ఉత్తరాన హిమాలయాల నుండి దక్షిణపు అంచు కన్యాకుమారి దాకా – అలాగే పశ్చిమాన ఉన్న మన సరిహద్దుల నుండి ఇటు తూర్పున ఉన్న సముద్రతీరం దాకా లక్షలాది ప్రజలను కలిశాను. వారి కళ్ళలోకి సూటిగా చూస్తూ వారి మనోభావాల్ని పసిగట్టాను. వారి ఆశలేమిటి? ఆకాంక్షలేమిటి? తెలుసుకున్నా ను. వారు చెప్పేదేమిటో విన్నాను. వారు చెప్పలేకపోయిందేమిటో కూడా అంచనా వేసుకున్నాను. మొత్తానికి మొత్తంగా, నా దేశ ప్రజల్ని కొంతలో కొంత అర్థం చేసుకోవడం ప్రారంభించాను. ఇది నాకు సంతోషాన్ని, సంతృప్తిని ఇచ్చే విషయం!"

ఆనాటి పండిట్ నెహ్రూ ఉపన్యాసం పూర్తి పాఠం – జవహర్‌లాల్ నెహ్రూ – సెలెక్టెడ్ వర్క్స్ – సెకెండ్ సీరీస్ – వాల్యూమ్ – 20; పేజి నెం: 3లో ఉంది.

"జవహర్ లాల్ నెహ్రూ పట్ల పార్టీలో ఆరాధనా భావం పెరిగిపోతూ ఉంది. దీన్ని అరికట్టకపోతే ఆయన మరో సీజర్‌లా తయారయ్యే అవకాశం ఉంది – ఇది పార్టీ మనుగడకు ఎంత మాత్రం సరైంది కాదు"– చాణక్య.

నెహ్రూ అంటే గిట్టని వారెవరో ఇలా రాస్తున్నారని అందరూ అనుకునేవారు. ఇంతకూ ఎవరా చాణక్య – అని కొందరు ఆరాతీసేవారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే చాణక్య ఎవరో కాదు. పండిట్ నెహ్రూయే! అది ఆయన కలం పేరు. ఆ రోజుల్లో కలకత్తా నుండి వెలువడే ఒక పత్రికలో పండిట్ నెహ్రూయే స్వయంగా 'చాణక్య' అనే పేరుతో విరివిగా రాస్తుండేవారు. ఈ కాలంలో అలాంటి నిజాయితీపరుల్ని చూడగలమా? ఆయన దార్శనికతను అర్థం చేసుకోలేని వారు మాత్రమే, ఆయనను తక్కువ చేసి మాట్లాడగలరు. వివేకవంతుడికి, మూర్ఖుడితో పోలికలు ఉండవు కదా !

# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## విమాన రాకపోకలకు అంతరాయం



**న్యూఢిల్లీ:** ప్రతికూల వాతావరణం కారణంగా ఢిల్లీ విమానాశ్రయంలో విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దుమ్ము తుపానుతో 205 విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. 50 విమానాలను దారిమళ్లించారు. దీంతో అక్కడ ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. పలువురు విమాన ప్రయాణికులు ఎక్స్ వేదికగా తమ ఆవేదనను వ్యక్తంచేశారు. దేశ రాజధానిలోని కొన్ని ప్రాంతాల్లో దుమ్ము తుపానుతో పాటు మోస్తారు వర్షం కురిసింది. శుక్రవారం సాయంత్రం బలమైన ఈదురుగాలులు వీచాయి. దీని కారణంగా కొన్నిచోట్ల చెట్టు కొమ్మలు విరిగిపడ్డాయి. బలమైన ఈదురుగాలులు వీయడంతో దాదాపు 50 విమానాలను దారి మళ్లించినట్లు విమానాశ్రయ అధికారులు తెలిపారు. 'ముంబై వెళ్లేందుకు ఢిల్లీ విమానాశ్రయానికి వచ్చాం. ఉదయం 12 గంటలకు బుక్ చేసుకున్న విమానం కాకుండా మరొకటి ఎక్కాలని అధికారులు సూచించారు. అది ఎక్కాక అందులోనే 4 గంటల పాటు కూర్చోబెట్టి తర్వాత దింపేశారు' అని ఒక ప్రయాణికుడు తెలిపారు.

# వక్ఫ్ చట్టాన్ని అమలు చేయం

### హింసాత్మక ఘటనల నేపథ్యంలో
### పశ్చిమ బెంగాల్ సిఎం మమతా బెనర్జీ ప్రకటన

**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్‌లో ముఖ్యంగా ముస్లింలు అధికంగా నివసించే ముర్షిదాబాద్ జిల్లాలో హింసాత్మక నిరసనలు చెలరేగాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వక్ఫ్ (సవరణ) చట్టాన్ని అమలు చేయబోమని మరోసారి స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లాలో చెలరేగిన హింసకు సంబంధించి ఇప్పటివరకు 118 మందిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. వక్ఫచట్టంపై చాలా మంది ఆందోళన చెందుతున్నారని, అయితే తాము ఈ చట్టాన్ని రూపొందించలేదనని మమత అన్నారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టాన్ని తయారు చేసిందని, అందువల్ల కేంద్రాన్ని సమాధానం కోరాలని ఆమె ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఈ విషయమై తాము స్పష్టమైన వైఖరితో ఉన్నామని, ఎట్టి పరిస్థితుల్లోనూ బెంగాల్‌లో వక్ఫ్ సవరణ చట్టాన్ని అమలు చేయబోమని తేల్చి చెప్పారు. ఇంత చెప్పినా అల్లర్లు దేని గురించి చేస్తున్నారని ప్రశ్నించారు. ముర్షిదాబాద్ సంసెర్‌గంజ్‌లోని ధులియన్‌లో తాజాగా హింసాత్మక సంఘటనలు జరిగినట్లు వార్తలు రావడంతో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటనల్లో ఓ వ్యక్తికి బుల్లెట్ గాయం అయినట్లు సమాచారం. కాగా, కోల్‌కతాలో విలేకరుల సమావేశంలో ప్రసంగించిన ఎడిజి (శాంతిభద్రతలు) జావేద్ షమీమ్ ఘటన వివరాలు ఇంకా అందలేదన్నారు. కాల్పుల ఘటనలో స్థానిక పోలీసుల ప్రమేయం ఉండకపోవచ్చని, బహుశా బిఎస్ఎఫ్ కాల్పులు జరిపి ఉండవచ్చన్నారు. అయితే
గాయపడిన వ్యక్తిని ఆసుపత్రిలో చేర్పించారని, అతను ప్రమాదం నుండి బయటపడ్డాడని ఆయన అన్నారు. శుక్రవారం జిల్లాలో హింసను నియంత్రించడానికి పోలీసులు నాలుగు రౌండ్లు కాల్పులు జరిపారని షమీమ్ అన్నారు. ఆ కాల్పుల్లో గాయపడిన ఇద్దరు వ్యక్తులు చికిత్స పొందుతున్నారన్నారు. యువకులు 'అబద్ధాలకు' బలైపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం కొత్త చట్టానికి వ్యతిరేకంగా జరిగిన నిరసనల సందర్భంగా మాల్డా, ముర్షిదాబాద్, సౌత్ 24 పరగణాలు, హుగ్లీ జిల్లాల్లో హింస చెలరేగడంతో పోలీసు వ్యాన్లతో సహా అనేక వాహనాలకు నిప్పు పెట్టారు. భద్రతా దళాలపై రాళ్ళు విసిరారు. రోడ్లు దిగ్బంధించారు. హింసకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అమాయక పౌరుల ప్రాణాలను, ఆస్తులను రక్షించడానికి యూనిఫాంలో ఉన్న



వ్యక్తులు తమ శక్తి మేరకు ప్రతిదీ చేస్తారని పోలీసు డైరెక్టర్ జనరల్ (డిజిపి) రాజీవ్ కుమార్ అన్నారు. అయితే శనివారం ఉదయం జరిగిన దురదృష్టకర ఘటన వివిధ వర్గాల నుండి వ్యాపించిన నిరాధారమైన పుకార్ల వల్ల జరిగి ఉండవచ్చని, ఇటువంటి రెచ్చగొట్టే చర్యలను ప్రజలు పట్టించుకోవద్దని విజ్ఞప్తి చేశారు. ఇవి స్పష్టంగా దుర్మార్గుల పనే అని ఆయన అన్నారు. ప్రజలు ప్రశాంతంగా ఉండాలని, రెచ్చగొట్టే చర్యలకు పాల్పడవద్దని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కోరారు. మతం పేరుతో ఎటువంటి మత విరుద్ధమైన ప్రవర్తనలో పాల్గొనవద్దని, ప్రతి మానవ జీవితం విలువైనదన్నారు. రాజకీయాల కోసం అల్లర్లను ప్రేరేపించవద్దని, అలాంటి వారు సమాజానికి హాని హాని చేస్తారని పేర్కొన్నారు. ఇందిలా ఉండగా, ప్రతిపక్ష నాయకుడు సువేందు అధికారి ముర్షిదాబాద్ జిల్లాలో రైల్వే ఆస్తుల విధ్వంసంపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) దర్యాప్తు చేయాలని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు లేఖ రాశారు. 'ఇది నిరసన చర్య కాదని, ముందస్తుగా హింసాత్మక చర్య అని, ప్రజాస్వామ్యం, పాలనపై జిహాదిస్ట్ శక్తులు తమ ఆధిపత్యాన్ని చాటుకోవడానికి, సమాజంలోని ఇతర వర్గాలలో భయాన్ని నాటడానికి, గందరగోళాన్ని వ్యాప్తి చేయడానికి ప్రయత్నించిన దాడి అని ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. 26,000 మంది పాఠశాల ఉపాధ్యాయుల ఉద్యోగాలను సుప్రీం కోర్టు రద్దు చేయడంపై ఆకస్మిక నిరసనల నుండి దృష్టిని మళ్లించడానికి హింసకు కుట్ర చేసి ఉండవచ్చు అని కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి మజుందార్ పేర్కొన్నారు.

## విష వలయాన్ని ఛేదించడమే
# మా పోరాటం

### టెక్స్‌టైల్ కళాకారుడి వర్క్‌షాప్‌పై రాహుల్‌గాంధీ పోస్ట్

**న్యూఢిల్లీ :** టెక్స్‌టైల్ రంగంలో వెనుకబడిన తరగతులకు చెందిన అనేక మంది నైపుణ్యం కలిగిన చేతివృత్తులవారు పెద్ద ఎత్తున రాణించలేకపోతున్నారని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ 'నిర్లక్ష్యం, అన్యాయం, దుర్మార్గపు వలయం'ను బద్దలు కొట్టడానికి తాను పోరాడుతున్నానని పేర్కొన్నారు. ఫ్యాషన్ డిజైన్ రంగంలో తన స్థానాన్ని సంపాదించుకోవడానికి ప్రయత్నిస్తున్న టెక్స్‌టైల్ కళాకారుడి వర్క్‌షాప్‌ను సందర్శించిన వీడియోను రాహుల్ ఎక్స్‌లో షేర్ చేశారు. ఈ సందర్శనలో రాహుల్‌గాంధీ వర్క్‌షాప్‌లోని చేతివృత్తులవారిని కలుసుకుని, ఈ వ్యాపారంలో చేతులు కలిపేందుకు ప్రయత్నించాడు. టెక్స్‌టైల్ డిజైన్ పరిశ్రమలో అగ్రస్థానంలో ఉన్న ఒబిసినితాను ఎప్పుడూ కలవలేదన్నారు. 'తన ఫ్యాక్టరీలోని చేతివృత్తులవారు రోజుకు 12 గంటలు కష్టపడి పనిచేస్తారు. సూది, దారంతో మాయాజాలం నేస్తారు. కానీ పరిస్థితి అలాగే ఉంది, నైపుణ్యానికి ప్రశంసలు లేవు' అని రాహుల్ తన పోస్ట్‌లో అన్నారు. ఇతర పరిశ్రమల మాదిరిగానే, బహుజనులకు టెక్స్‌టైల్, ఫ్యాషన్ రంగంలో ప్రాతినిధ్యం లేదని, విద్యకు ప్రాప్యత లేదా నెట్‌వర్క్‌లో స్థానం లేదని ఆయన అన్నారు. తాను విక్కీ



లాంటి ప్రతిభావంతులైన వ్యక్తులను కలిసినప్పుడు, వారి పనిని నేర్చుకోవడానికి ప్రయత్నిస్తానన్నారు. తద్వారా ప్రపంచం భారతీయ యువత నిజమైన ప్రతిభను చూడగలదని చెప్పారు. సమర్థులు, కష్టపడి పనిచేసేవారు అయినప్పటికీ, ఈ యువకులు నిర్లక్ష్యం, అన్యాయం విష వలయంలో చిక్కుకున్న అభిమన్యు (మహాభారతం) లాంటి వారని తెలుసుకోవాలని సూచించారు. తమ పోరాటం ఈ విష వలయాన్ని ఛేదించడమేనని, తద్వారా ప్రతి నైపుణ్యం కలిగిన వ్యక్తి వ్యవస్థలోకి ప్రవేశించడానికి ఒక మార్గాన్ని కనుగొనగలదని గాంధీ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

## రాహుల్ పార్లమెంట్‌లో మౌనమెందుకు: మాయావతి



**లక్నో:** వివాదాస్పద వక్ఫ్ బిల్లుపై పార్లమెంటులో సుదీర్ఘ చర్చలు జరిగినప్పుడు లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఎందకు మాట్లాడలేదంటూ బీఎస్పీ అధినేత్రి మాయావతి ప్రశ్నించారు. ఈ అంశంపై ఇండియా ఐక్య సంఘటన భాగస్వాములు అసహనానికి గురి కావడం... ముస్లింలకు కోపం రావడం సహజమేనన్నారు. వక్ఫ్ (సవరణ) బిల్లును ప్రతిపక్షాలు వ్యతిరేకించినప్పటికీ దీనిపై చర్చలప్పుడు మాట్లాడరాదన్న ప్రతిపక్ష నాయకుడి నిర్ణయం సరైనదేనా? అని ఆమె 'ఎక్స్'లో ప్రశ్నించారు. కొత్త వక్ఫ్ చట్టాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేయాలని, అందులోని నిబంధనలను పున:పరిశీలించాలని మోదీ ప్రభుత్వానికి మాయావతి సూచించారు. సంక్షేమం, ప్రభుత్వ ఉద్యోగాలు, విద్య వంటివి మిగతా వర్గాలతో సమానంగా దళితులకు అందించడంలో కాంగ్రెస్, బీజేపీ విఫలమయ్యాయని విమర్శించారు. రిజర్వేషన్ హక్కులను కాలరాస్తున్నారని దుయ్యబట్టారు. ఈ పార్టీల మోసాలను గ్రహించాలని మతపరమైన మైనారిటీలకు పిలుపునిచ్చారు. విద్యుత్ తదితర రంగాల ప్రైవేటీకరణ, ప్రజల సంక్షేమానికి నిజాయితీగా, బాధ్యతగా ప్రభుత్వం వ్యవహరించకపోవడం ఆందోళన కలిగించే అంశాలన్నారు. వక్ఫ్ బోర్డుల్లో ముస్లింయేతరులకు స్థానం కల్పించడం మంచిది కాదని హితవు పలికారు. వక్ఫ్ చట్టాన్ని పున:పరిశీలించాలని కేంద్ర ప్రభుత్వాన్ని మాయావతి కోరారు.

## బిజెపి తమిళనాడు అధ్యక్షుడు నాగేంద్రన్



**చెన్నై:** బిజెపి తమిళనాడు అధ్యక్షుడిగా పార్టీ నేత, తిరునల్వేలి ఎమ్మెల్యే నైనార్ నాగేంద్రన్ ఎన్నికయ్యారు. చెన్నైలో నిర్వహించిన పార్టీ సమావేశంలో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ ఛుగ్ ఈమేరకు శనివారం ప్రకటన చేశారు. నాగేంద్రన్ ఒక్కరి నుంచే నామినేషన్ రావడంతో ఆయనకే ఈ పదవి ఖరారైంది. ఈ ఎన్నిక వెనక కేంద్ర మంత్రి అమిత్ షా నిర్ణయాలు కీలకంగా పనిచేసినట్లు సమాచారం. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బిజెపి, అన్నాడీఎంకే జట్టుకట్టిన వేళ ఈ పరిణామం చోటు చేసుకుంది. కన్యాకుమారి జిల్లా నాగర్‌కోయిల్ సమీపంలోని వడివీశ్వరంలో 1960లో నాగేంద్రన్ జన్మించారు. ముందు అన్నాడీఎంకేలో ఉన్న ఆయన... అనంతరం బిజెపిలో చేరారు. 2020 జులై నుంచి బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. జయలలిత, పన్నీరుసెల్వం ప్రభుత్వాల్లో పలు శాఖలకు మంత్రిగా పని చేసిన అనుభవం ఉంది. ప్రభుత్వ పాలన, ప్రజలతో మమేకం, రాజకీయాల్లో వ్యూహాలపై పట్టు ఉండటంతో అధిష్ఠానం ఆయన వైపు మొగ్గుచూపినట్లు తెలుస్తోంది. అన్నాడీఎంకే, బిజెపిని సమన్వయం చేసుకోవడంలో కీలకంగా వ్యవహరిస్తారని భావిస్తున్నారు.

## 21న భారత్‌కు వాన్స్, వాల్ట్జ్



**న్యూఢిల్లీ:** అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, జాతీయ భద్రతా సలహాదారు మైఖెల్ వాల్ట్జ్ ఈనెల 21న భారత్‌లో పర్యటిస్తారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలతో విరుచుకుపడుతుండటంతో ప్రపంచ దేశాలతో అగ్రరాజ్యం సంబంధాలు ప్రభావితం అవుతున్నాయి. ఇలాంటి సమయంలో వాన్స్, వాల్ట్జ్ భారత్ పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది. భారత్‌తో సంబంధాలపై అమెరికా దృష్టి పెట్టడాన్ని ఇది ప్రతిబింబిస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. వాన్స్, వాల్ట్జ్ వేర్వేరుగా భారత్‌కు రానున్నట్లు తెలుస్తోంది. వీరు 22వ తేదీ నుంచి రెండు రోజులు సౌదీ అరేబియాలో పర్యటిస్తారు. సౌదీ వెళ్లే ముందు భారత ప్రధాని మోదీని ఈ ఇద్దరు కలుస్తారని సమాచారం.





## కథక్ నృత్యకారిణి కుముదిని మృతి

**అహ్మదాబాద్:** ప్రముఖ కథక్ నత్యకారిణి కుముదిని లఖియా(95) కన్నుమూశారు. అహ్మదాబాద్‌లో శనివారం ఉదయం ఆమె మతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కుముదిని గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో 1930లో జన్మించారు. ఈ నత్య కళారూపాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు 1967లో అహ్మదాబాద్‌లో కదంబ సెంటర్ ఫర్ డ్యాన్స్ సంస్థను స్థాపించారు. ఇందులో ఆమె చేసిన కషికిగాను 2025లో భారత ప్రభుత్వం పద్మవిభూషణ్ పురస్కారంతో సత్కరించింది. అంతకుముందే పద్మభూషణ్, పద్మశ్రీ అవార్డును ఆమె అందుకున్నారు. కుముదిని మృతికి రాష్ట్రపతి ద్రౌపది ముర్మ, ప్రధాని నరేంద్రమోదీ సంతాపం తెలిపారు.

## ఇవిఎంలు సురక్షితం: సిఇసి

**రాంఘర్:** ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఇవిఎం) భద్రతకు ఢోకా లేదని సిఇసి జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. ఇవిఎంల ట్యాంపరింగ్‌కు అవకాశం లేదన్నారు. కుమార్ శనివారం జార్ఖండ్, రాంఘర్ జిల్లాలో విలేకరులతో మాట్లాడుతూ ఇవిఎంలు అత్యంత సురక్షితమని చెప్పారు. భారత్‌లో వినియోగించే ఈవీఎంలను ఇంటర్నెట్‌తో, బ్లూటూత్ లేదా ఇన్ఫ్రారెడ్‌తో అనుసంధానం చేసేందుకు వీల్లేదు కాబట్టి వాటి ట్యాంపరింగ్ అసాధ్యమని తెలిపారు. ఈవీఎంలపై న్యాయ సమీక్ష జరిగిందని గుర్తుచేశారు. మూడు రోజుల జార్ఖండ్ పర్యటనకు వచ్చిన సీఈసీ... రాంఘర్‌లో 55 మంది వలంటీర్ల (లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో పాల్గొన్న)ను కలిశారు.

## కళాశాల బస్సు బోల్తా పడి
# ఇద్దరు విద్యార్థులు మృతి

**శ్రీనగర్ :** జమ్మూ కాశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో శనివారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు మృతి చెందగా, 21 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. హంద్వారాలోని వోడ్పోరా ప్రాంతం సమీపంలో పిక్నిక్ కోసం 27 మంది విద్యార్థులను తీసుకెళ్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల సోగం బస్సు అదుపు తప్పి బోల్తాపడిందని వారు తెలిపారు. క్షతగాత్రులను హంద్వారాలోని ఆసుపత్రికి తరలించగా, ఒక విద్యార్థిని మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. క్షతగాత్రులలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో ఆసుపత్రికి తరలించగా, వారిలో ఒకరు మృతి చెందారని అధికారులు తెలిపారు. హంద్వారా ఆసుపత్రిలో 20 మంది విద్యార్థులు చికిత్స పొందుతున్నారని వారు తెలిపారు. జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఈ దుర్ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా కూడా ప్రమాదంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

## ఎంయువి బోల్తా పడి నలుగురు మృతి

**ఝాబువ :** మధ్యప్రదేశ్‌లోని ఝాబువ జిల్లాలో మల్టీ యుటిలిటీ వాహనం (ఎంయువి) బోల్తా పడి నలుగురు మృతి చెందగా, ఐదుగురు గాయపడ్డారని శనివారం ఒక పోలీసు అధికారి తెలిపారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి 10 గంటలకు జిల్లా ప్రధాన కార్యాలయం నుండి 48 కిలోమీటర్ల దూరంలో ఉన్న బోలాసా గ్రామం సమీపంలో జరిగిందని రాయ్‌పురియా పోలీసు రాష్ట్ర ఎస్‌హెచ్‌ఓ జెఆర్ బార్డే పిటిఐకి తెలిపారు. ఒక మహిళతో సహా నలుగురు వ్యక్తులు మరణించగా, ఐదుగురు గాయపడ్డారని, వారిలో ఇద్దరు పరిస్థితి విషమంగా ఉందన్నారు. ముగ్గురు అక్కడికక్కడే మరణించగా, ఒకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. మృతులను నాన్ సింగ్ భాబోర్ (43), పర్ము హటిలా (30), రెమాబాయి హటిలా (40), దాతు హటిలా (25)గా గుర్తించారు. ధార్ నివాసి, పురుగుమందు తాగి సారంగిలోని ఆసుపత్రికి తరలిస్తున్నారు' అని అధికారి తెలిపారు.

## నమ్మకద్రోహ కూటమిని తమిళులు సహించరు

### ఎఐడిఎంకె బిజెపి పొత్తుపై స్టాలిన్ ఫైర్



**చెన్నై:** అన్నాడిఎంకె బిజెపి కూటమిని 'ఓటమి కూటమి'గా తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ అభివర్ణించారు. తమిళనాడుకు ద్రోహం చేసే 'నమ్మక ద్రోహ కూటమి'ని రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ సహించరని స్టాలిన్ అన్నారు. తమిళనాడులో బిజెపితో ఆల్ ఇండియా అన్నా ద్రవిడ మున్నేట్ర కజగం (ఎఐఎడిఎంకే) పార్టీలు కూటమిగా ఏర్పడిన నేపథ్యంలో స్టాలిన్ ఆ కూటమిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పొత్తు సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వ్యాఖ్యలపై శనివారం స్టాలిన్ స్పందించారు. 'ఏఐఏడీఎంకేబీజేపీ కూటమి... ఓటమి కూటమి. ఈ కూటమిని తమిళనాడు ప్రజలు పదేపదే భరించారు. అయినప్పటికీ అమిత్‌షా ఈ విఫలమైన కూటమిని పునరుద్ధరించడానికి ప్రయత్నించారు. నిన్న అమిత్‌షా చెన్నై పర్యటన సందర్భంగా మీడియాతో మాట్లాడిన తీరు ఆయన పదవికి తగినది కాదు. ఏఐఏడీఎంకేబీజేపీని ఓ కూటమిగా ఏర్పాటు చేయాలనేది ఆయన ఎంపిక అయినప్పటికీ... ఈ కూటమి ఎందుకు ఏర్పడిందో... ఏ సైద్ధాంతిక పునాదిపై ఏర్పడిందో ఆయన స్పష్టం చేయలేదు. రెండు పార్టీలు సాధారణ కార్యక్రమాలపై కలిసి పనిచేస్తామని మీడియా ముందు చెప్పడం... అస్పష్టంగా చెప్పినట్లు తెలుస్తోందని స్టాలిన్ అన్నారు. నీట్ పరీక్ష, త్రిభాషా విధానంతో హిందీని బలవంతంగా రుద్దడం, వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తున్నట్టు ఏఐఏడీఎంకే గతంలో ప్రకటించింది. కానీ అమిత్‌షాతో జరిగిన విలేకరుల సమావేశంలో ఏఐఏడీఎంకే వీటిపై నోరుమెదపలేదు. రాష్ట్రంలోని డీఎంకే ప్రభుత్వాన్ని విమర్శించడానికి మాత్రమే మీడియా సమావేశాన్ని ఉపయోగించుకున్నట్లు అర్థమవుతోంది' అని స్టాలిన్ అన్నారు.
అధికార దాహంతో ఉన్న ఏఐఏడీఎంకే బీజేపీ కూటమి రాష్ట్ర హక్కుల్ని కాపాడడంలోనూ, తమిళ సంస్కతిని పరిరక్షించడం వంటి ఆదర్శాలకు వ్యతిరేకం. ఈ కూటమిలోని పళనిస్వామి పదవుల కోరికతో తమిళనాడు ఆత్మగౌరవాన్ని, హక్కుల్ని ఢిల్లీకి తాకట్టు పెట్టి రాష్ట్రాన్ని నాశనం చేసేందుకు ప్రయత్నంచడం ఎవరూ మర్చిపోలేదని స్టాలిన్ అన్నారు. నిన్న జరిగిన మీడియా సమావేశంలో నీట్ అంశంపై జర్నలిస్టులు అమిత్‌షాని పదేపదే ప్రశ్నించారు. దీనికి ఆయన సమాధానం ఇవ్వలేకపోయారు. నీట్ వల్ల తమిళనాడులో 20 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. బీహార్‌లోనూ కొంతమంది విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. దీనిపై అమిత్‌షా ఏం సమాధానం చెబుతారు? ఐదు రాష్ట్రాల్లో నీట్ సంబంధిత కుంభకోణాలపై సీబీఐ దర్యాప్తు చేస్తోందని, ఈ కేసుల్లో విద్యార్థులు, తల్లిదండ్రులను అరెస్టు చేశారని అమిత్‌షాకు తెలుసా అని స్టాలిన్ ప్రశ్నించారు. సిబిఐ ఎవరి నియంత్రణలో ఉంది. ఆ సంస్థను దర్యాప్తు చేయనివ్వండి. అప్పుడే నీట్‌ను వ్యతిరేకించడం దష్టి మరల్చే చర్యనా లేక వైద్య విద్యను పరిరక్షించడానికి చట్టబద్ధమైన వైఖరిని తీసుకున్నామా అని షా నిర్ధారించగలరని స్టాలిన్ అన్నారు.

## ముగ్గురు ఉగ్రవాదుల హతం

**జమ్మూ:** కిష్త్వార్ జిల్లాలోని చత్రూ ప్రాంతం నైద్గామ్ వద్ద భారత భద్రతా దళాలు ఉగ్రవాద నిరోధక ఆపరేషన్‌ను నిర్వహించాయి. ఈ ఆపరేషన్‌లో భారత భద్రతా దళాలు ముగ్గురు ఉగ్రవాదులను మట్టుబెట్టారు. ఈ ఉగ్రవాదుల్లో జైష్‌ఎమొహమ్మద్ కమాండర్ సైఫుల్లా ఉన్నట్లు సమాచారం. చత్రూ ప్రాంతంలో ఉగ్రవాదుల గుంపు కనిపించిన తర్వాత... భారత సైన్యం, పోలీసు దళాలు, పారామిలిటరీ దళాలు సంయుక్తంగా సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించాయి. ఈ ఆపరేషన్‌లో ఉగ్రవాదుల నుంచి పెద్ద సంఖ్యలో ఆయుధాలు, మందుగుండు సామగ్రి, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. భద్రతా దళాలు ఉగ్రవాదుల ఇతర స్థావరాలను కూడా గుర్తించాయి. పాకిస్థాన్ సైన్యం అఖ్నూర్ సెక్టార్‌లోని కేరీ బట్టల్ ప్రాంతంలో కాల్పుల విరమణను ఉల్లంఘించి, భారత సైన్యాన్ని టార్గెట్ చేస్తోంది. దీంతో అప్రమత్తమైన భారత సైన్యం ప్రతీకారం తీర్చుకుంది. ఈ కాల్పుల్లో భారత సైనికుడు గాయపడినట్లు సమాచారం. ఉగ్రవాదుల చర్యలను ట్రాక్ చేయడానికి భద్రతా దళాలు, భదేర్వా ప్రాంతంలో నిఘాను మరింతగా పెంచాయి. ఇది సమర్థవంతంగా ఉగ్రవాదుల కదలికలను గుర్తించడానికి, ఆయా ప్రాంతాలపై కంట్రోల్ ఉంచడానికి ఉపయోగపడుతుంది.

## అకాలీ దళ్ అధ్యక్షుడిగా మళ్లీ బాదల్



**అమృత్‌సర్:** శిరోమణి అకాలీ దళ్ (ఎస్ఏడీ) అధ్యక్షుడిగా సుఖ్బీర్ సింగ్ బాదల్ తిరిగి ఎన్నికయ్యారు. పంజాబ్, అమృత్‌సర్‌లో శనివారం జరిగిన పార్టీ సర్వసభ్య సమావేశంలో భాగంగా ఆయన ఎన్నిక జరిగింది. బాదల్ పేరును పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు బల్బీర్ సింగ్ భూందర్ ప్రతిపాదించగా, మరొక నేత పరంజీత్ సింగ్ శర్ణ బలపరిచారు. శ్రీ దర్బార్ సాహిబ్ కాంప్లెక్స్‌లోని తేజా సింగ్ మసుందరీ హాల్‌లో అకాలీ దళ్ నూతన అధ్యక్షుడి ఎన్నిక కోసం సమావేశాన్ని నిర్వహించారు. బాదల్ భార్య, భటిండా ఎంపీ హర్‌సిమ్రత్ కౌర్, మాజీ మంత్రులు విక్రమ్ సింగ్ మజీథియా, దల్జీత్ సింగ్ చీమా, సీనియర్ నేత మహేశ్ ఇందర్ సింగ్ గ్రేవల్ హాజరయ్యారు. 2024 నవంబరు 16న పార్టీ అధ్యక్షుడిగా బాదల్ రాజీనామా చేశారు. దానిని జనవరిలో పార్టీ వర్కింగ్ కమిటీ ఆమోదించింది. కాగా, 2007 నుంచి 2017 వరకు అకాలీ దళ్, ఆ పార్టీ నేతృత్వ ప్రభుత్వం చేసిన తప్పిదాలకుగాను బాదల్‌ను 'తనఖైయా' (మతపరమైన దుష్ప్రవర్తన నిందితుడు)గా అకాలీ తక్త్ ప్రకటించింది. దీంతో పార్టీ అధ్యక్షుడి హోదాకు సుఖ్బీర్ సింగ్ బాదల్ రాజీనామా చేశారు.

## అరెస్టుకు కారణం చెప్పకపోతే
## బెయిల్ ఇవ్వొచ్చు: అలహాబాద్ హైకోర్టు

లక్నో: కారణం చెప్పకుండా అరెస్టు చేస్తేగనుక బెయిల్ ఇవ్వొచ్చని అలహాబాద్ హైకోర్టు స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 22(1) ప్రకారం అరెస్టు చేసేటప్పుడు కారణాలు తెలియజేయడం తప్పనిసరి అని వెల్లడించింది. అలా జరగని పక్షంలో చట్టపరంగా పరిమితులు ఉంటాయని, బెయిల్ వస్తుందని పేర్కొంది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన మంజీత్ సింగ్‌పై 2024 ఫిబ్రవరి 15న మోసం, బెదిరింపు, శాంతికి భంగం కలిగించడం వంటి సెక్షన్ల కింద కేసు నమోదైంది. అతడిని పోలీసులు వెంటనే అరెస్ట్ చేశారు. 2024 డిసెంబర్ 26న జ్యుడీషియల్ కస్టడీకి పంపారు. ఇందుకు రాంపూర్ కోర్టు ఆదేశాలు ఇచ్చింది.ఈ క్రమంలో మంజీత్ సింగ్ హైకోర్టును ఆశ్రయించారు. చట్టవిరుద్ధంగా అరెస్ట్ చేశారని, రిమాండ్ విచారణలో విధానపరమైన లోపాలు ఉన్నాయని సింగ్ తరపున న్యాయవాది వాదించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 22(1) ప్రకారం అరెస్టుకు కారణాలను అరెస్ట్ సమయంలో లిఖితపూర్వకంగా తెలియజేయలేదన్నారు. ఈ వాదనను హైకోర్టు సమర్థించింది. 'ఆర్టికల్ 22(1)ను ఉల్లంఘించినప్పుడు, నిందితులను వెంటనే విడుదల చేయాలని ఆదేశించడం న్యాయస్థానం విధి. చట్టబద్ధమైన ఆంక్షలు ఉన్నప్పటికీ బెయిల్ మంజూరీకి అది కారణం అవుతుంది' అని న్యాయమూర్తులు మహేశ్ చంద్ర త్రిపాఠి, ప్రశాంత్ కుమార్‌తో కూడిన డివిజన్ బెంచ్ పేర్కొంది. అరెస్టైన వ్యక్తికి అర్థమయ్యే భాషలో అరెస్టుకు గల కారణాలను తప్పనిసరిగా తెలియజేయాలని స్పష్టం చేసింది. రాంపూర్ కోర్టు జారీ చేసిన రిమాండ్ ఆర్డర్‌ను, మంజీత్ సింగ్ అరెస్టును రద్దు చేసింది.

## సూట్‌కేస్‌లో గర్ల్ ఫ్రెండ్



**చండీగఢ్:** గర్ల్‌ఫ్రెండ్‌ను సూట్‌కేసులో పెట్టి బాయ్స్ హాస్టల్‌కు తీసుకెళ్లాలని ఓ విద్యార్థి చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. హర్యానాలోని సోనిపట్‌లో ఉన్న జిందాల్ విశ్వవిద్యాలయానికి చెందిన ఓ విద్యార్థి పెద్ద సూట్ కేస్‌తో హాస్టల్‌లోకి వచ్చాడు. అందులో ఏమున్నాయని సిబ్బంది అడగగా దుస్తులు, వస్తువులు ఉన్నాయని చెప్పాడు. అతడి తీరుపై అనుమానం వ చ్చిన హాస్టల్ గార్డులు ఓసారి సూట్ కేస్ తెరవాలని కోరారు. అందుకు ఆ విద్యార్థి నిరాకరించాడు. వారు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి... సూట్ కేస్ తెరిచి చూడగా, అందులో నుంచి ఓ అమ్మాయి బయటకు రావడంతో అంతా అవాక్కయ్యారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను ఓ విద్యార్థి సోషల్ మీడియాలో షేర్ చేయడంతో వైరల్‌గా మారింది. సూ ట్ కేసులో ఉన్న అమ్మాయి అదే విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థా లేక బయటనుంచి వచ్చిన వ్యక్తా అనే విషయం తెలియాల్సి ఉంది. దీనిపై దర్యాప్తు చేస్తున్నామని విశ్వవిద్యాలయ అధికారులు తెలిపారు.

## కుటుంబ వ్యవస్థలో పరివర్తన: జస్టిస్ నాగరత్న




**బెంగళూరు:** దేశంలో కుటుంబ వ్యవస్థ శరవేగంగా పరివర్తన చెందుతోందని సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ బివి నాగరత్న శనివారం వ్యాఖ్యానించారు. ఈ మార్పులతో కుటుంబాలపై, న్యాయ వ్యవస్థపై ప్రభావం పడుతున్నట్లు తెలిపారు. ఉమ్మడి విద్య, పట్టణీకరణ పెరగడం, కార్మిక వర్గ చైతన్యం, విద్య ద్వారా మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యత ఇందులో భాగమేనని జస్టిస్ నాగరత్న అన్నారు. చట్టం కూడా ఈ పరివర్తనానికి దోహదమవుతున్నట్లు తెలిపారు. జస్టిస్ నాగరత్న శనివారం బెంగళూరులో దక్షిణ జోన్ ప్రాదేశిక సదస్సులో 'కుటుంబం: భారతీయ సమాజం ఆధారం' అంశంపై ప్రసంగించారు. సమాజంలో ప్రాథమిక వ్యవస్థగా కుటుంబానికి అనాదిగా గుర్తింపు ఉన్నదన్నారు. 'కుటుంబం...మన గతానికి, భవిష్యత్‌కు ఇది వారధి' అని నొక్కిచెప్పారు. మహిళలకు విద్యతోనే సామాజికఆర్థిక స్వాతంత్ర్యం వస్తుందని, దీనిని సానుకూలంగా పరిగణించాలని, ప్రోత్సహించాలని జస్టిస్ నాగరత్న సూచించారు. విద్యావంతులు, ఆర్థిక స్వతంత్రులుగా మహిళలు తమ కుటుంబాలు, సమాజానికే కాదు జాతికి దోహదమవుతారన్నారు. ఫామిలీ కోర్టుల్లో కేసులు పేరుకుపోతుండటాన్ని ప్రస్తావిస్తూ రెండు వైపుల నుంచి చర్యలు ఉన్నప్పుడే కుటుం కలహాలు పరిష్కారమవుతాయని అభిప్రాయపడ్డారు. సమాజం ఆలోచనా విధానంలో మార్పు అవసరమని, అప్పుడే ఫామిలీ కోర్టులపై భారం తగ్గుతుందన్నారు. ఫ్యామిలీ కోర్టుల్లో శిక్షితులైన మధ్యవర్తులు లేదా మధ్యవర్తులుగా రిటైర్డ్ జడ్జిలు ఉంటే కుటుంబ కలహాలు త్వరితగతిన పరిష్కారం అవుతాయని అభిప్రాయపడ్డారు. లేకపోతే వంట బాగోలేదని, సమయానికి తయారు కావడం లేదంటూ చిన్న తగదాలు కూడా కోర్టు కేసులుగా మారి విడాకులకు దారితీస్తాయని, దీంతో పిల్లలపై ప్రతికూల ప్రభావం పడుతుందని అన్నారు. వేర్వేరు కోర్టుల చుట్టూ తిరగడంతో ఆయా కుటుంబాలు దెబ్బతింటాయని జస్టిస్ నాగతర్న ఆందోళన వ్యక్తంచేశారు. కోర్టుల్లో కేసులు పెండింగ్ ఉండిపోతుండటం పెద్ద సమస్యగా మారిందని చెప్పారు. దశాబ్ద కాలంలో 40 శాతం వైవాహిక బంధాలు తెగిపోయాయని చెబుతూ... పెరుగుతున్న విడాకుల కేసులకు సరిపడ ఫ్యామిలీ కోర్టులు దేశంలో లేక ప్రిసైడింగ్ అధికారులపై భారం అధికమవుతున్నట్లు తెలిపారు. పరిమిత ఆర్థిక వనరులు, అరకొర మౌలిక వసతులతో ఫ్యామిలీ కోర్టుల పరిస్థితి రోజురోజుకు క్షీణిస్తుండటంతో న్యాయం ఆలస్యమవుతున్నట్లు జస్టిస్ నాగరత్న వెల్లడించారు.

## కనీస వేతనం రూ.400 ఇవ్వాలి

**ప్రజాపక్షం/భువనగిరి :** ఉపాధి కూలీల కనీస వేతనం రోజుకు రూ.400 ఇవ్వాలని సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ ప్రభుత్వం డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని దిలావర్ పూర్ గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి కూలీల సమస్యలను తెలుసుకోవడానికి జరిగింది. ఇందిరమ్మ ఆత్మీయ పరస కింద ప్రతి ఒక్కరికి పనిచేసే కూలీలకు సంవత్సరానికి రూ.12,000 ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో నమిలే ఎల్లమ్మ, పార్వతమ్మ, బిక్షపతి, రంగయ్య, నరేందర్, లక్ష్మి, ఉపేంద్ర, నరసయ్య, ప్రమీల, మహేశ్వరి, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



## ప్రభుత్వ వైద్యశాలలు ప్రజలు సద్వినియోగం

**ప్రజాపక్షం/మునగాల:** ప్రభుత్వ వైద్యశాలలను ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని, అన్ని వసతులతో కూడిన సౌకర్యాలు ప్రభుత్వాసుపత్రిలో దొరుకుతున్నాయని కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. శనివారం మునగాల మండల కేంద్రంలో కోటి 56 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన పిహెచ్‌సి వైద్యశాల భవనంను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు మండలంలో ఆధునాతన సౌకర్యాలతో ఏర్పాటు చేసిన వైద్యశాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి కోటచలం, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొప్పుల జైపాల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, నల్లపాటి శ్రీనివాస్, తహసిల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో రమేష్‌దీన్‌దయాల్, వైద్యాధికారులు రవీందర్, పుష్పాలత, పూజమాధురి పాల్గొన్నారు.






## వక్ఫ్‌బోర్డ్ చట్ట సవరణను ఉపసంహరించుకోవాలి

**ప్రజాపక్షం/నల్లగొండ:** కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం లౌకిక విధానాలను తిలోదకాలు ఇచ్చి మనువాదాన్ని తీసుకువచ్చేందుకే ప్రయత్నిస్తుందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్ కుమార్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం వర్క్ బోర్డు చట్ట సవరణ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను సిపిఐ ఆధ్వర్యంలో నల్లగొండ సుభాష్ సెంటర్లో దగ్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందల సంవత్సరాలుగా ఉన్న వక్ఫ్ ఆస్తులను తమ ఆధీనంలోకి తీసుకునేందుకే పార్లమెంటులో సవరణలు చేస్తూ చేస్తూకొత్త చట్టం చేయడం జరిగిందని విమర్శించారు. భారత రాజ్యాంగం సెక్యులర్, లౌకిక విధానాలకు అనుగుణంగా నడవాల్సిన కేంద్ర ప్రభుత్వం ఒక వర్గానికి కొమ్ము కాయడం సరి అయింది కాదని ఆయన ఆరోపించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి, పట్టణ కార్యదర్శి గాదెపాక రమేష్, ఎస్కె మధార్,ముండ్ల ముత్యాలు, కెఎస్ రెడ్డి, అక్కలయ్య,భద్రయ్య సుజాత, విజయ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

## హిందూ సమాజంపై పట్టు సాధించేందుకు ఎన్‌డిఎ కంకణం




**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** సమాజాన్ని విభజించి హిందు సమాజంపై పట్టు సాధించేందుకు ఎన్‌డిఎ ప్రభుత్వం కంకణం కట్టుకొని ఇటీవల వక్ఫ్ చట్టాన్ని అమలులోకి తెచ్చిందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు ఆరోపించారు. శనివారం మున్సిపల్ కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఉన్న మైనార్టీ మతస్తులైన హిందువుల ఓటర్లను ఆకర్షికుంచేందుకు చేస్తున్న ప్రయత్నమే ఈ చట్టమన్నారు. 2019 కంటే 2024లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి 60 పార్లమెంట్ స్థానాలు కొల్పోయిందన్నారు. ప్రజలు బిజెపికి దూరమవుతున్న విషయాన్ని తెలుసుకొని మతాల మధ్య చిచ్చుపెడుతున్నారని ఆరోపించారు. బిజెపి, మోడీ, షాల ద్వయం చేస్తున్నా కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రావుల సత్యం, ఎఐవైఎఫ్ పట్టణ అధ్యక్షులు పరిచే భరత్, ఎఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు కొమర్రాజు వెంకట్, వ్యవసాయ సంఘం కార్యదర్శి శీలం రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షులు నాగభద్రం, లాల్‌సాబ్, వీరబాబు పాల్గొన్నారు.

## దేశానికి ప్రాణం లౌకికతత్వం

యల్లావుల రాములు,గుండు వెంకటేశ్వర్లు




**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** దేశానికి ప్రాణం వంటిది లౌకికతత్వమని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు,పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో హుజూర్‌నగర్ లోని ప్రధానరహదారిపై రాస్తోరోకో కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతతత్వ రాజకీయాలతో దేశ ప్రజలలో విభజన తెచ్చేందుకు ప్రయత్నిస్తుందని విమర్శించారు. రాజకీయాలకు మత రంగులు పూయకూడదని భారతదేశం పూర్వ కాలం నుండి అనేక మతాల సమ్మేళనం గా అన్ని వర్గాల ప్రజల ప్రత్యేకతలను గౌరవించుకుంటూ వస్తుందన్నారు. మైనార్టీ వర్గాలకు ఇబ్బంది కలిగించే బిజెపి ప్రభుత్వ చర్యలను సిపిఐ ఖండిస్తుందన్నారు. అన్ని వర్గాలకు న్యాయం జరిగే చర్యలను మాత్రమే సిపిఐ సమర్థిస్తుందని తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు జడ శ్రీనివాస్,జక్కుల రమేష్,యల్లావుల రమేష్,మామిడి నర్సయ్య,జక్కుల శ్రీను,సత్యావతి,రవీందర్‌రెడ్డి, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన వక్ఫ్ చట్టాన్ని రద్దు చేయాల్సిందే

గోదా శ్రీరాములు ...ఎండి జహంగీర్

**ప్రజాపక్షం/భువనగిరి :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన వక్ఫ్ చట్టాన్ని రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యాలయం సుందరయ్య భవనంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ అధ్యక్షతన చర్చ గోష్టి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్, సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన నూతనవక్ఫ్ చట్టం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని అన్నారు. దేశంలోని ఏ మత ప్రజలైనా తమ ధార్మిక వ్యవహారాల కోసం తాము సొంతంగా నిర్వహించుకునే హక్కు రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ఇచ్చిందని బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త చట్టం ఒక మత వ్యవహారాలలో ఇతర మతస్తులు కల్పించుకోవడం రాజ్యం కల్పించుకోవడం అనేది భారత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని చెప్పారు. దీన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. దేశంలో ఉన్నటువంటి లక్షలాది ఎకరాల వక్ఫ్ భూములను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడం కోసమే కొత్త చట్టాన్ని తీసుకువచ్చారని చెప్పారు. పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్ కుమార్, ప్రముఖ న్యాయవాది ఎంఎ రహీం, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బట్టుపల్లి అనురాధ, బట్టు రామచంద్రయ్య, ఏశాల అశోక్, మాటూరి బాలరాజు, మైనారిటీ నాయకులు అజీమ్, ఇక్బాల్ చౌదరి, షేక్ మీరా, లాయిక్ అహ్మద్ పాల్గొన్నారు.



## భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు పరిరక్షణకు ఉద్యమం

### సంఘం ( ఎఐటియుసి)రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఉజ్జిని రత్నాకర్ రావు పిలుపు

**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి:** భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు పరిరక్షణ కోసం ఉద్యమించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం ( ఎఐటియుసి)రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఉజ్జినీ రత్నాకర్ రావు పిలుపునిచ్చారు. శనివారం నల్లగొండ ఎస్‌విఆర్ ఫంక్షన్ హాల్ లో జరిగిన భవన నిర్మాణ కార్మిక సంఘం ( ఎఐటియుసి ) నల్లగొండ జిల్లా 7 వ మహాసభ లో అయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న సంక్షేమ బోర్డు ఈరోజు సమస్యల నిలయముగా మారిందని ఆరోపించారు. కార్మిక హక్కుల పరిరక్షణ కోసం ఏఐటియుసి నిరంతరం అండగా నిలిచి పోరాడుతుందని అన్నారు. గత కొన్ని నెలలుగా కార్మికులకు డబ్బులు ఇవ్వడం లేదని ఆన్లైన్లో తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నా పరిష్కరించడంలో లేబర్ డిపార్ట్మెంట్ వైఫల్యం చెందిందని ఆరోపించారు. ఆన్లైన్ అప్డేట్ పేరుతో కార్మికులకు తీరని అన్యాయం చేస్తున్నారని విమర్శించారు కార్మికులు రోజుల తరబడి లేబర్ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు ఆన్లైన్ అప్డేట్ పేరుతో గత ఆరు నెలలుగా కార్మికులను ఆఫీస్ చుట్టూ తిప్పుకుంటూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు.



సంక్షేమ బోర్డును ఎత్తి వేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతుందని దాని రక్షించుకోవాల్సిన బాధ్యత కార్మికులపై ఉందని అన్నారు. కార్మిక వ్యతిరేక విధాలు తిప్పికొట్టేందుకు పోరాటాలు తీవ్రతరం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంటు పల్లా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ నిజమైన కార్మికులు లబ్ధి పొందే విధంగా లేబర్ డిపార్ట్మెంట్ వారు చర్యలు తీసుకోవాలని అన్నారు. అర్హత లేని వారందరూ కూడా లేబర్ కార్డు లు తీసుకోవడం వల్ల సంక్షేమ బోర్డు నిధులు దుర్వినియోగం అవుతున్నాయని ఆరోపించారు బోగస్ కార్డుల పై సమగ్ర విచారణ జరిపించి వాటిని తొలగించాలని లేబర్ అధికారులను కోరారు. ఈనెల 21,22 తేదీల్లో రంగారెడ్డి జిల్లా శంషాబాద్ లో జరిగే రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి,భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నూనే వెంకటేశ్వర్లు, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు కెఎస్ రెడ్డి,ధోటి వెంకన్న,గీత పని వారల సంఘం జిల్లా కార్యదర్శి పబ్బు వీరస్వామి, జిల్లా నాయకులు గుండె రవి ,రేవెల్లి యాదయ్య,కే నాగిరెడ్డి,అలమోని మల్లయ్య,బెల్లం శివయ్య,ఈదరాములు, రామలింగయ్య శ్రీను దేవయ్య, లక్ష్మీ నరసయ్య నాగార్జున మనీ,నరేందర్,వెంకన్న, అంకారావు, బిక్షం మధు, జెల్ల శ్రీను పాల్గొన్నారు.




## 15న భవన నిర్మాణ కార్మికుల జిల్లా 4వ మహాసభ


ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/కోదాడ:** ఈనెల 15న చింతలపాలెం మండలంలోని దొండపాడు గ్రామంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా 4వ మహాసభలు జరుగుతున్నాయని, భవన నిర్మాణ కార్మికులు ఈ మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు కోరారు. శనివారం భవన నిర్మాణ కార్మికుల కోదాడ మండల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో కార్మిక శక్తిని నిర్వీర్యం చేస్తున్న కార్మిక బద్ధ శత్రువు నరేంద్రమోడిని ఇంటికి సాగనంపాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన కార్మికులకు పిలుపునిచ్చారు. సంక్షేమ బోర్డు పరిరక్షణ ధ్యేయంగా పనిచేయాలని, నిర్మాణ రంగంలో కార్మికులక ప్రమాదవశాత్తు చనిపోతే 10 లక్షల రూపాయలు ఇవ్వాలని, సహజ మరణానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని కోరారు. కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై రానున్న రోజుల్లో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ బోర్డులో సభ్యులుగా చేరడానికి ఈ ప్రభుత్వం అనేక ఆంక్షలు పెడుతూ ఇబ్బందులకు గురి చేస్తుందని అన్నారు. భవన నిర్మాణ కార్మికులకు పెళ్లి కానుక 30వేల నుండి లక్ష రూపాయల వరకు పెంచాలని, డెలవరి కేసుని 50వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి షేక్ లతీఫ్, నాయకులు టమటం వెంకటరెడ్డి, విద్యాచారి, ఎస్కె నాగుల్‌మీరా, రామారావు, సైదులు, కర్ల కాంతారావు, నయీమ్‌ఖాన్, సత్యనారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నల్లగొండను వ్యవసాయ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/నల్లగొండ(త్రిపురారం):** నల్లగొండ జిల్లాను వ్యవసాయ హబ్‌గా తీర్చిదిద్దేందుకు అన్ని అవకాశాలు ఉన్నాయని, ఇక్కడి వాతావరణం, నీటి వసతులు, నూతన పంటల సాగు ,వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ హబ్ గా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. పిలుపునిచ్చారు.శనివారం జిల్లా కలెక్టర్ త్రిపురారం మండలం, కంప సాగర్ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఫాక్స్ నట్ మఖాన ప్రయోగాత్మక సాగును ప్రారంభించారు.రైతులు బాగుపడేందుకు ఒకే పంట పై ఆధారపడకుండా పంట మార్పిడి దిశగా వెళ్లాలని కలెక్టర్ సూచించారు .ఒకే పంటను సాగు చేయడం వల్ల కరువు లేదా తెగులు వంటివి సోకినప్పుడు రైతులు తీవ్రంగా నష్టపోతారని, అలా నష్టపోకుండా వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునీకరణను రైతులు అనుసంధానం చేసుకొని నూతన వంటలు పండించేందుకు కొత్త వంగడాలను పండించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని సాధారణ పంటలు కాకుండా కొత్తరకం పంటలు సాగు చేయాలన్న ఉద్దేశంతో జిల్లా నుండి 4 వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల బృందాన్ని గత మార్చిలో బీహార్ రాష్ట్రంలోని దర్భంగ మఖాన స్టేషన్ పంపించడం జరిగిందని, ఈ బృందం అక్కడ మఖాన సాగు గురించి విత్తనం మొదలుకొని పంట కోత వరకు అన్ని విషయాలను అధ్యయనం చేసి ఇక్కడి రైతులతో వారి అనుభవాలను పంచుకున్నారని తెలిపారు. ఇందులో భాగంగానే వ్యవసాయంలో వస్తున్న నూతన పద్ధతులపై రైతులకి కంప సాగర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం తో పాటు, కొండమల్లపల్లిలో ఉన్న కెవికె క్షేత్రస్థాయి ప్రదర్శనలు, అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నాయని , జిల్లా యంత్రాంగం తరపున ఇకపై క్షేత్రస్థాయిలో సందర్శనలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు, కట్టంగూర్ రైతు ఉత్పత్తిదారుల కేంద్రం అధ్యక్షులు నంద్యాల నరసింహారెడ్డి,వ్యవసాయ శాఖ జిల్లా అధికారి శ్రవణ్, ఉద్యాన శాఖ అధికారి అనంతరెడ్డి, కంప సాగర్ హెడ్ లింగయ్య, వ్యవసాయ శాస్త్రవేత్తలు, తదితరులుపాల్గొన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ కంప సాగర్ వ్యవసాయ పరిశోధన క్షేత్రంలో పంటలను పరిశీలించి మొక్కలు నాటి, మఖాన సాగు విత్తనాలను వ్యవసాయ క్షేత్రంలో చల్లారు.



## సిరిమువ్వ నాట్యాలయ విద్యార్థులకు గిన్నిస్‌బుక్‌లో చోటు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డులో పట్టణానికి చెందిన సిరిమువ్వ నాట్యాలయానికి చెందిన 31 మంది స్థానం సంపాదించినట్లు నాట్య గురువు కలకొండ రామ్ అన్నారు. 2023 డిసెంబర్ హైద్రాబాద్ గచ్చిబౌలిలో కూచిపూడి మహా బృందం నాట్యంలో 4218 మంది నాట్యకారుల ప్రదర్శనలో మిర్యాలగూడకు చెందిన చిన్నారులు ప్రదర్శించగా శుక్రవారం హైద్రాబాద్‌లోని తెలంగాణ పరిషత్‌లో జరిగిన సభలో ప్రముఖ నాట్య గురువు పసుమర్తి శేషబాబు, వేదాంతం వెంకటశర్మ, సీరియల్ ఆర్టిస్ట్ జ్యోతి రెడ్డి చేతులమీదుగా చిన్నారులకు, గురువుకు గిన్నిస్ బుక్ రికార్డు సర్టిఫికెట్ అందచేసినట్లు తెలిపారు. విద్యార్థులు మరెన్నో అవార్డులు సాధించే లక్ష్యంగా తయారు చేస్తానన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను మిర్యాలగూడ డివిజన్ డాజన్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్ అభినందించారు.



## విద్యశక్తివంతమైన ఆయుధం

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** ప్రతి విద్యార్థికి విద్య అనేది శక్తివంతమైన ఆయుధం లాంటిదని విద్య నేర్చుకుంటే ప్రపంచాన్ని జయించవచ్చని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం శివారులోని అశోక బిజినెస్ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన స్నాతకోత్సవ కార్యక్రమానికి గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరై తన చేతులమీదుగా జ్యోతి ప్రజ్వలన చేసి స్నాతకోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్య ద్వారా నేర్చుకున్న మెలకువలు, నైపుణ్యాలను విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రపంచం రోజు రోజుకు నవీకరణ వైపు దూసుకెళ్తున్న నేపథ్యంలో విద్యార్థులు కూడా ఎప్పటికప్పుడు నవీకరణ వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. స్నాతకోత్సవ కార్యక్రమానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తో పాటు ఇరాన్ అధికార ప్రతినిధి (కాన్సుల్ జనరల్ ) మహది షారోఖీ, డెలాయిట్ కన్సల్టింగ్ మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ శర్మలు హాజరయ్యారు. వీరిని ఆ కళాశాల కార్యదర్శి నోముల అర్జున్ పూల బొకేలు అందించి ఘనంగా స్వాగతించారు. అనంతరం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో మొక్కలు నాటి నీళ్లు పోశారు.



## ఉపాధిహామీ నిర్వీర్యానికి కేంద్రం కుట్ర


వ్య.కా.సం రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతయ్య

**ప్రజాపక్షం/అనంతగిరి:** ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతుందని కేంద్రం ఆటలు సాగనివ్వబోమని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతయ్య అన్నారు. శనివారం మండల పరిధిలోని శాంతినగర్ గ్రామంలో నిర్వహించిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాల్గవ జిల్లా మహాసభకు ఆయన ముఖ్య అతిథి పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డిఎ ప్రభుత్వం రైతాంగ వ్యవసాయ కూలీల జీవితాలను ధ్వంసం చేసేందుకు కంకణం కట్టుకుందని అర్థమవుతుందని అన్నారు. పోరాడి సాధించుకున్న ఉపాధిహామీ చట్టాన్ని ఎత్తివేసేందుకు ప్రతి బడ్జెట్‌లో నిధుల కోత విధించి మెల్లి మెల్లిగా ఉపాధిహామీ పథకాన్ని ఎత్తివేసేందుకు కుట్ర చేస్తుందని అన్నారు. ప్రతి ఉపాధిపనికి 350 రూపాయలు తప్పనిసరిగా చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధి ప్రదేశంలో ప్రభుత్వం కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ మహాసభకు రెమిడాల రాజు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయనాయుడు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బద్దం కృష్ణారెడ్డి, బత్తినేని హనుమంతరావు, మండవ వెంకటేశ్వర్లు, మేకల శ్రీనివాసరావు, చింత్రియాల రవి, నీలం నాగభద్రం, బత్తినిగౌడ్, వీరబాబు, లాల్‌సాబ్, నూకల శ్రీనివాస్ పాల్గొన్నారు.




## అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలి

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలంలోని మాదాపూర్ గ్రామంలో జై భీమ్ సేవా సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహన్ని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ దళిత యువకులు అంబేద్కర్ అడుగుజాడల్లో నడుస్తూ ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని చైతన్యవంతం కావాలని అన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని రాసి పేద ప్రజల బతుకుల్లో వెలుగులు నింపారని అన్నారు. ఈ కార్యక్రమంలో సూదగాని హరిశంకర్ గౌడ్, ధనావత్ బికు నాయక్, విగ్రహ దాతలు పంది మధు, ఎర్రోళ్ల వెంకటస్వామి, జాలిగం వెంకటేష్ జాలిగం ప్రసాద్, జాలిగం కృష్ణ రామచందర్ పాల్గొన్నారు.



## సంక్షేమ బోర్డు పరిరక్షణకు ఉద్యమం

ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి గోరేటి రాములు, ఎండీ ఇమ్రాన్





**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు పరిరక్షణకై కార్మికులు ఉద్యమించాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి గోరేటి రాము లు, ఎండీ ఇమ్రాన్ పిలుపునిచ్చారు. నారాయణపురం మండల కేంద్రంలోని రాఘవేంద్ర ఫంక్షన్ హాల్లో జరిగిన భవన నిర్మాణ కార్మిక సంఘం మండల మహాసభ సందర్భంగా ఏర్పాటు చేసిన ఏఐటీయూసీ జెండాను జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ ఆవిష్కరించారు. అనంతరం మహాసభ చిలువేరు అంజయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డును నేడు అధికారంలో ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసే కుట్రలు పన్నుతున్నారని దాన్ని కార్మికుల ఐక్యంగా ఉండి పోరాడి తిప్పి కొట్టాలని వారు పిలుపునిచ్చారు. మీసేవ లో థంబ్ విధానాన్ని రద్దు చేయాలని, పెండింగ్ లో ఉన్న క్లెయిమ్స్ విడుదల చేయడం లేదని, ఆన్లైన్లో నమోదు కోసం కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా సమస్యలు పరిష్కరించడంలో లేబర్ డిపార్ట్మెంట్ వైఫల్యం చెందిందని ఆరోపించారు. ఆన్లైన్ అప్డేట్ పేరుతో కార్మికులకు తీరని అన్యాయం చేస్తున్నారని విమర్శించారు కార్మికులు రోజుల తరబడి లేబర్ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తుందని అన్నారు. ప్రమాదంలో మరణించిన కార్మికునికి రూ.10 లక్షలు, సహజ మరణానికి రూ.5 లక్షలు, 50 సంవత్సరాలు నిండిన ప్రతి కార్మికుని రూ.5000 పెన్షన్ ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 15వ తేదీన మోటకొండూరు మండల కేంద్రంలో జరిగే భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా 3వ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కురిమిద్ద శ్రీనివాస్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చన గోని గాలయ్య, మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్ ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు పిల్లి శంకర్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దాసరి లక్ష్మయ్య, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు కలకొండ సంజీవ, రైతు సంఘం నాయకులు మల్లారెడ్డి బోయ శంకరయ్య, జనగాం శంకరయ్య, సత్యనారాయణ, సంజీవ, బక్క తట్ల లింగస్వామి, జీనుకల నర్సింహా, దుబ్బాక పెద్దులు, మల్లేష్ పాల్గొన్నారు.

## రూ. 22లక్షల విలువైన సెల్‌ఫోన్లు రికవరీ

బాధితులకు అప్పగించిన జిల్లా ఎస్‌పి నర్సింహ

**ప్రజాపక్షం/సూర్యాపేట:** జిల్లా వ్యాప్తంగా చోరీకి గురైన రూ. 22లక్షల విలువైన 111 సెల్ ఫోన్‌లను జిల్లా పోలీసులు రికవరీ చేశారు. శనివారం జిల్లా ఎస్‌పి కె నర్సింహ్మా వాటిని బాధితులకు అందజేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెల్ ఫోన్లు పోగొట్టుకున్నా, చోరీకి గురైనా సిఈఐఆర్ అప్లికేషన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. తమ సిబ్బంది పది రోజుల వ్యవధిలో జిల్లా వ్యాప్తంగా 111 సెల్ ఫోన్లను రికవరీ చేసినట్లు చెప్పారు. గత రెండు సంవత్సరాలలో 2238 సెల్ ఫోన్లు పోయినట్లు సిఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదులు అందాయన్నారు. 1362 ఫోన్లను రికవరీ చేసి ఇప్పటి వరకు బాధితులకు అందజేసినట్లు తెలిపారు. డిజిటల్ అరెస్టు అంటూ గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైన ఫోన్ చేస్తే నమ్మవద్దని డిజిటల్ అరెస్టు అనేది పచ్చి అబద్ధమని చెప్పారు. మోసగాళ్లు సెల్ ఫోన్లు దొంగిలించిన తరువాత వీక్ పాస్‌వడ్‌లను బ్రేక్ చేసి ఫోన్ పే, గుగుల్ పే తదితర మాధ్యమాల ద్వారా బ్యాంకు ఖాతాలో ఉన్న డబ్బులను కాజేస్తున్నారని చెప్పారు. ఫోన్ పొగొట్టుకున్న వ్యక్తులు కేవలం ఫోన్‌ను మాత్రమే కాకుండా తమ వ్యక్తిగత సమాచారాన్నికూడా పొగొట్టుకుంటున్నారని తెలిపారు. ప్రస్తుతం సెల్ ఫోన్లలో సైబర్ మోసగాళ్లు ఎక్కువ అయ్యారని చెప్పారు. ఫోన్లు వినియోగించుకునేవారు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎవరైన సెకండ్ హ్యాండ్ సెల్ ఫోన్ కొనుగోలు చేస్తే అట్టి షాపు యజమాని నుండి రశీదు తప్పకుండా పొందాలన్నారు. అనంతరం బాధితులకు సెల్ ఫోన్‌లను అందజేశారు. అదనపు ఎస్‌పి నాగేశ్వర్ రావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ నాగభూషణ్ రావు, ఐటికోర్ ఆర్ఎస్ఐ రాజశేఖర్ పాల్గొన్నారు.



## 14న అంబేడ్కర్ జయంతి వేడుకలను విజయవంతం చేయాలి

కలెక్టర్ కోయ శ్రీహర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** ఏప్రిల్ 14న జిల్లా కేంద్రంలో నిర్వహించు డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ జయంతి వేడుకలలో ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఏప్రిల్ 14న ఉదయం గం.1030 లకు బస్ స్టాండ్ వద్ద అంబేడ్కర్ చౌరస్తా లో నిర్వహించు డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ జయంతి వేడుకలలో ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, ఉద్యోగులు, వివిధ సంఘాల నాయకులు, ప్రతినిధులు, ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయంతి వేడుకలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

## ఎంఎల్‌సి విజయశాంతిని కలిసిన సింగరేణి విశ్రాంత ఉద్యోగులు

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ లో ప్రముఖ నటి విజయ శాంతి స్వగృహములో సింగరేణి విశ్రాంత ఉద్యోగులు ఎం.బాబు రావు, ఎ.వేణు మాధవ్, సినీ నటులు, యూ ట్యూబ్ నిర్మాతలు నటులు సుచరిత, రత్న శ్రీహారిక, మహాలక్ష్మి , నిర్మాతలు ఇంద్రకంటి దీప ఫేమస్ బుల్లెట్ బండి సాంగ్ నిర్మాత నిరూపమా, డబ్బింగ్ అరిస్ట్ శ్రవంతి, ఎస్‌బి రెడ్డి క్రియేషన్స్ ఎస్. బి. రెడ్డి తదితరులు మర్యాదపూర్వకంగా కలసి ఆమె శాసన మండలికి ఎన్నికైన సందర్భగా శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపినారు. ఈ కార్యక్రమంలో విజయశాంతి మాట్లాడుతూ సింగరేణి కార్మికుల కష్టాలు, త్యాగాలు మరువలేనివి అని తెలిపారు. సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకొని వెళ్లుతాను అని తెలిపారు.



## కేంద్రం తీసుకొచ్చిన చట్టాలు రాజ్యాంగ విరుద్ధం

సిపిఐ జిల్లా కార్యదర్శి మందపవన్



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాలు రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నాయని, లౌకిక దేశమైన ఇండియాలో ఒకే మతానికి ప్రాధాన్యత ఇస్తూ ,మిగత మతాలమీద విద్వేషాలు పెంచుకోవటం సరైందికాదని. మైనార్టీల స్వయంప్రతిపత్తిని దెబ్బతీసే కుట్రను విరమించుకొని రాజ్యాంగ విరుద్ధ వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని రద్దు చేయాలని సిద్దిపే ట జిల్లా సిపిఐ కార్యదర్శి మంద పవన్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జాతీయ సమితి పిలుపు మేరకు సిపిఐ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా కేంద్రంలో గాంధీ చౌక్ చౌరస్తా నుండి వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మంద పవన్ మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్రమోడీ బిజెపి ప్రభుత్వం ముస్లిం మైనార్టీలపై కక్ష సాధింపు చర్యలో భాగంగా మందబలంతో పార్లమెంట్ ఉభయ సభల్లో వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని తీసుకొచ్చి ఆమోదం తెలిపిందని ఎద్దేవా చేశారు. సమానత్వం మతాన్ని అనుసరించే స్వేచ్ఛ భంగం కలిగించే విధంగా సవరణ చట్టాన్ని తెచ్చిందని, దీంతో మైనార్టీ సమాజం స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే కుట్ర జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా రాజకీయ పార్టీల ప్రజా సంఘాలు వ్యతిరేకిస్తున్నప్పటికి టిడిపి, జెడియు పార్టీల సహకారంతో ఓటింగ్ ద్వారా చట్టాన్ని ఆమోదం చేసుకోవటం జరిగిందన్నారు. ముస్లీం, మైనార్టీల అభివృద్ధి కాకుండ చేయాలనే లక్ష్యంతో ఈ చట్టాన్ని పార్లమెంటుకు తీసుకొచ్చిందన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కిష్టపురం లక్ష్మ ణ్, కనుకుంట్ల శంకర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు పిట్ల మల్లేశం, హరీఫ్,జెర్రిపోతుల జనార్దన్, రామగల్ల నరేష్, సంపత్, భూమయ్య, మల్లయ్య, ఐలయ్య, రాజు తదితరులు పాల్గొన్నారుఇ

## మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



**ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధి :** మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తూ మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మోవో సొసైటీ సహకారంతో ఎల్ఎండి కాలనీలోని దుర్గాభాయి దేశ్‌ముఖ్ మహిళా శిశు వికాస కేంద్రంలో 20మంది మహిళలకు ఎలక్ట్రికల్ ఆటో డ్రైవింగ్‌లో శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ మహిళలకు స్వయం ఉపాధి కల్పిస్తూ వారిని కోటీశ్వరులు చేయాలన్నది ప్రభుత్వ సంకల్పంగా చెప్పారు. ఇందులో భాగంగానే స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో క్యాంటీన్ల నిర్వహణ, ఆర్టీసీ అద్దె బస్సుల కొనుగోలు, పెట్రోల్ బంకుల ఏర్పాటు వంటివి ప్రభుత్వం చేస్తున్నదని అన్నారు. ఈ ఆటో డ్రైవింగ్‌లో మహిళలకు శిక్షణ ఇచ్చి వారు ఆటో కొనుగోలు కోసం పెట్టుబడి సాయం చేస్తూ ఉపాధి మార్గాన్ని చూపిస్తామని అన్నారు. ఈ ఆటోలను పైసా ఖర్చు లేకుండా నడుపుకోవచ్చని, తద్వారా రోజు వారీ ఆదాయం సంపాదించవచ్చని అన్నారు. ముఖ్యంగా పాఠశాల విద్యార్థులను ఆటోల్లో పొందవచ్చని సూచించారు. జీవన ప్రమాణానికి, పెరుగుతున్న ఖర్చులకు అనుగుణంగా సంపాదించడం అవసరమైన ఈ రోజుల్లో స్వయం ఉపాధి మహిళలకు ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్మన్ శోభారాణి మాట్లాడుతూ ఇంతకుముందు మహిళలకు బ్యూటీషియన్, టైలరింగ్ వంటి వాటిల్లో మాత్రమే శిక్షణ ఇచ్చే వారమని అన్నారు. మహిళలు విభిన్న రం గాల్లో రాణించాలనే ఉద్దేశ్యంతో డ్రైవింగ్‌లోనూ శిక్షణ ప్రారంభించామని తెలిపారు. మహిళా కా ర్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ ఆటో డ్రైవింగ్ శిక్షణ ద్వారా ఇప్పటికే హైదరాబాదులో చాలా మంది ఉపాధి పొందుతున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో మొబైల్, టివి, మోటార్ రంగంలోనూ మహిళలకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ మహిళలకు ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. ఐకెపి ద్వారా ధాన్యం కొనుగోలు, అమ్మ ఆదర్శ పాఠశాలలు, పెట్రోల్ బంకుల మంజూరు వంటివి ఇందులో భాగమన్నారు. మహిళా ఆటో డ్రైవర్లు నిర్దిష్ట గమ్యాన్ని సురక్షితంగా చేరుస్తారని తెలిపారు. ప్రజా రవాణాను మహిళలే ఎక్కువగా ఉపయోగిస్తారని, ఆ రవాణా సాధనాలను నడిపించేవారు మహిళలే అయి ఉండాలన్నారు. కరీంనగర్‌లో ప్రవేశపెట్టిన ఈ డ్రైవింగ్ శిక్షణ సద్వినియోగం చేసుకుని దేశంలోని మహిళలకు కరీంనగర్ ఆదర్శంగా నిలవాలన్నారు. మహిళా ప్రాంగణంలో వివిధ శిక్షణలు పొందిన పలువురు మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, మోవో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి జైభారతి, జిల్లా సంక్షేమ అధికారి సబిత, ప్రాంగణం మేనేజర్ సుధారాణి, సిఐ శ్రీలత, జిఎం సుభద్ర పాల్గొన్నారు.

## స్వర్గీయ తానిపర్తి కాంతారావు ఆదర్శ కమ్యూనిస్టు



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** ఎలిగేడు మండలం సుల్తానాపూర్ గ్రామనివాసి తొలి తరం కమ్యూనిస్టు నాయకుడు తానిపర్తి కాంతారావు ఇటీవల అనారోగ్యంతో ఆకాల మృతి చెందడం జరిగింది. శనివారం వారి స్వగ్రామం సుల్తానాపూర్ గ్రామానికి సిపిఐ జాతీయ కమిటీ సభ్యులు మాజీ శాసనసభ్యులు చాడ వెంకట్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కల వేన శంకర్, సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, ఎఐటియుసి పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శికడారి సునీల్, మంచిర్యాల జిల్లా కార్యదర్శి మేకల దాస్ హాజరై వారి కుటుంబాన్ని పరామర్శించి స్వర్గీయ అమరజీవి తానీపర్తి కాంతారావుకు ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఆనాడు తొలితరం కమ్యూనిస్టు నాయకుడు మంచి ఆదర్శ జీవి, అలుపెరుగని విప్లవ కమ్యూనిస్టు భావాలు ఉన్న మంచి నాయకుడు స్వర్గీయ తానీ పర్తి కాంతారావు అని వారి సేవలను కొనియాడారు. ఆదర్శ కమ్యూనిస్టుగా జీవించడం గొప్ప విషయం అన్నారు. వారి త్యాగాలు వారి జీవిత విశేషాలు నేటి కమ్యూనిస్టు నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. వారి కుటుంబాన్ని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత

ప్రతిజ్ఞ చేసిన ఎమ్మెల్యే మక్కన్‌సింగ్, కాంగ్రెస్ శ్రేణులు

**ప్రజాపక్షం/గోదావరిఖని :** రాజ్యాంగ పరిరక్షణ కేవలం ఒక నినాదం కాదని, ప్రతి భారత పౌరుడి బాధ్యత అని రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ అన్నారు. శనివారం గోదావరిఖనిలో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు బొంతల రాజేష్ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ యాత్ర, జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో కలిసి ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పౌరుడు రాజ్యాంగ పరిరక్షణకై సంఘటితంగా పోరాటం చేయాలని, సమానత్వం, స్వేచ్ఛ, బంధుత్వం విలువలను కాపాడుకుంటూ బలమైన ప్రజాస్వామ్యాన్ని నిర్మించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత బిజెపి ప్రభుత్వం విభజించు పాలించు తత్వంతో దేశాన్ని ముక్కలు చేసేందుకు ప్రయత్నిస్తున్నదన్నారు. సామాన్యుల హక్కులను కాలరాస్తూ, కార్పొరేట్ ధనవంతులకే మద్ధతు ఇస్తుందన్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టి ప్రజాస్వామ్యాన్ని బలహీనపర్చే చర్యలకు పాల్పడుతుందన్నారు. ఈ సందర్భంగా రాజ్యాంగాన్ని పరిరక్షించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్, తాజా మాజీ కార్పొరేటర్‌లు మహంకాళి స్వామి, ముస్తాఫా, పెద్దెల్లి తేజస్విని, ప్రకాష్, పాతిపల్లి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న బిజెపి ప్రభుత్వం

సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం




**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్నదని, ముస్లింలు, మైనార్టీలు, క్రిస్టియన్లు దళితులపై దాడులు జరుగుతున్నాయని, బిజెపి, ఆర్ఎస్ఎస్, బజరంగ్ దళ్, విశ్వ హిందూ పరిషత్, సంఘ పరివార్ తదితర శక్తులు మత విద్వేషాలను రెచ్చగొడుతూ ఆర్టికల్ 370, ట్రిపుల్ తలాక్, వక్ఫ్ బోర్డు తదితర ముస్లిం వ్యతిరేక చట్టాలతో బిజెపి ప్రభుత్వం దేశంలో అలజడి సృష్టిస్తున్నదని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక ఎంబి గార్డెన్లో వక్ఫ్ బిల్లుకు నిరసనగా ముస్లిం సోదరులు ఏర్పాటుచేసిన భారీ బహిరంగ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ బిల్లుకు మద్దతు పలికిన ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు నారా చంద్రబాబు నాయుడు, నితీష్ కుమార్ వారి రాష్ట్రాలలో మేం ముస్లింలకు వ్యతిరేకం కాదని చెపుతూనే వక్ఫ్ బోర్డ్ బిల్లుకు మద్దతు ఎలా పలికారని, మీరు ముస్లిం మైనార్టీలకు వ్యతిరేకం కానప్పుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు టిటిడి బోర్డులో ముస్లిం మైనార్టీలకు బోర్డ మెంబర్ ఇవ్వాలని సవాల్ విసిరారు. ఒక మతానికి సంబంధించిన నమ్మకాన్ని విశ్వాసాన్ని ధ్వంసం చేయడం ఏమిటని ప్రశ్నించారు. బిజెపి ఆర్ఎస్ఎస్ వాదులు దేశాన్ని హిందూ దేశంగా మార్చాలని కుట్రలు కుతంత్రాలు పన్నుతున్నారని, రాజ్యాంగ హక్కులను కాల రాస్తే చూస్తూ ఊరుకునేది లేదని, కేంద్ర బిజెపి ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన వక్ఫ్ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని, వారి ఆందోళనలో మేము కూడా పాలుపంచుకుంటామని వారికి అండగా సిపిఐ పార్టీ ఉంటుందని,బిల్లుకు వ్యతిరేకంగా పోరాడతామని తెలిపారు.

## గ్రూపు రాజకీయాలకు త్వరలోనే స్వస్తి పలుకుతాం

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల కాంగ్రెస్‌లో గ్రూపు రాజకీయాలపై ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పందించారు. జగిత్యాల కాంగ్రెస్‌లో గత కొన్ని రోజులుగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, మాజీ మంత్రి కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి మధ్య మాటల యుద్ధం పై అడ్లూరి మాట్లాడుతూ జగిత్యాల ఎమ్మెల్యే, మాజీ మంత్రి మధ్య విభేదాలపై కాంగ్రెస్ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని వెల్లడించారు. జీవన్ రెడ్డి, డా.సంజయ్ కుమార్ ల మధ్య ఉన్న విబేధాలను పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్తానని స్పష్టం చేశారు. ప్రస్తుతం కాలంలో కుటుంబ సభ్యుల మధ్యనే విభేదాలు ఉన్న పరిస్థితుల్లో 120 ఏళ్ల చరిత్ర గల కాంగ్రెస్ పార్టీలో భేదాభిప్రాయాలు ఉండవా అని అడ్లూరి అన్నారు. వారి మధ్య విభేదాలు ఉన్నంత మాత్రాన మీడియా పరంగా వాటి గురించి మాట్లాడుకునే అవకాశం ఇద్దరు నేతలు ఇవ్వద్దని కోరారు. ఇద్దరి మధ్య విబేధాలపై రేపు టిపిసిసి చీఫ్ దృష్టికి తీసుకెళ్ళుతానని, త్వరలోనే జగిత్యాల కాంగ్రెస్ సమస్య పరిష్కారం అయ్యేలా చేస్తామని చెప్పారు. పదేళ్ల గడీల, రాచరిక పాలనను అంతమొందించి ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారని తెలిపారు. పదవుల కోసం ఫామ్ హౌస్‌లో బిఆర్ఎస్ నేతలు కెటిఆర్ హరీష్ రావు తన్నుకున్నారని, దానిపై ఎవరైనా మాట్లాడుతారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ లో అంతర్గత ప్రజాస్వామ్యం స్వేచ్ఛ ఎక్కువ ఉం టుందని, గోరంతను కొండంతలుగా ప్రచారం చేయొద్దని ఆయన మీడియాకు విజ్ఞప్తి చేశారు. మరో 10 ఏళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉండేలా అందర ఐక్యంగా ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు.

## తండ్రిని చంపిన కుమారుడు

జ్యూడిషియల్ కస్టడికి తరలించిన పోలీసులు

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** మండలంలోని కిషన్‌దాస్‌పేటకు చెందిన ఒడ్డెర కాలనీలో ఉంటున్న కుంచెపు కనకయ్యను కొడుకు కిరాతకంగా హతమార్చాడు. శుక్రవారం పోలీసులు స్థానికులు తెలిపిన ప్రకారం హమాలి పని చెస్తున్న తండ్రిని కొడుకు పర్శరాములు కర్రతో దాడి చేసి చంపాడు.అసుపత్రికి తరలించేలోపే మరణించాడని వైద్యులు నిర్ధారించడంతో అతడి కుమారుడు పర్శరాములును సిఐ శ్రీనివాస్‌గౌడ్,ఎస్సై రమాకాంత్ అద్వర్యంలో మర్డర్ కేసులో నిందితుడిగా ఉన్నవ్యక్తిని కొత్తబస్టాండ్ వద్ద సా యంత్రం పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా అతడిని విచారించి పంచుల సమక్షంలో దాడికి పాల్పడ్డ కర్రను స్వాదీనం చేసుకుని దర్యాప్తులో భాగం గా జ్యుడిషియల్ కస్టడికి ఎల్లారెడ్డిపేట స పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

## కౌన్సిలింగ్‌తో వృద్ధుల కేసులు పరిష్కారం



**ప్రజాపక్షం/జగిత్యాలటౌన్:** కన్న తల్లి దండ్రులను పోషించక నిరాధరిస్తున్న కొడుకులకు, వారి కోడళ్లకు తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో అసోసియేషన్ ప్రతినిధులు గౌరిశెట్టి విశ్వనాథం, వెల్ముల ప్రకాష్‌రావు, హన్మంత్‌రెడ్డి, ఎండి యాకుబ్, పబ్బా శివానందం, విజయలక్ష్మీ తదితరులు కౌన్సిలింగ్ చేయడంతో తాము తమ తల్లిదండ్రులను పోషిస్తు బాగోగులు చేసుకోవడానికి సమ్మతించి ఒప్పంద పత్రం రాసిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని అసోసియేషన్ కార్యాలయం కౌన్సిలింగ్ కేంద్రంకు జిల్లాలోని సారంగపూర్, మెట్‌పల్లి, మేడిపల్లి, కథలాపూర్, గొల్లపల్లి, వెల్గటూర్ మండలాలకు చెందిన ఆ కొడుకులను వృద్ద తల్లిదండ్రుల అభ్యర్థనపై పిలిపించి వయోవృద్దుల చట్టంపై అశోక్‌కుమార్ అవగాహన కల్పించారు. తల్లిదండ్రులను పోషించక నిరాధరణకు గురిచేస్తే రెవెన్యూ డివిజనల్ అధికారి అయిన వయోవృద్దుల ట్రిబ్యునల్ చైర్మన్ 6 మాసాలకు పైగా జైలు శిక్ష జరిమానా విధించే వీలు ఆ చట్టంలో ఉందని, మాయ మాటలతో బెదిరింపులతో వారి ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకున్నా అట్టి ఆస్తులు తల్లిదండ్రుల పేరుతో మార్పిడి చేసే అధికారం జిల్లా కలెక్టర్‌కు ఉందని అన్నారు. కౌన్సిలింగ్ ఇచ్చి ఆ కొడుకులను సమ్మతించి ఒప్పదంపత్రాలు రాసిచ్చి ఆ వృద్ధ తల్లిదండ్రులను తమ వెంట తీసుకెళ్లారు.

## పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి

మాజీ మంత్రి హరీష్‌రావు



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** రాష్ట్ర వ్యాప్తంగా పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని మాజీ మంత్రి హరీష్ రావు డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన రైతులందరికి ఎకరానికి 25వేల ఆర్థిక సహాయం అందించాలన్నారు. వడగండ్ల వానకు పంట నష్టపోయిన రైతులకు సైతం ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని మాజీ మంత్రి హరీష్‌రావు డిమాండ్ చేశారు. శనివారం సిద్దిపేట నియోజక వర్గంలోని చిన్నకోడూరు, నంగునూర్ మండల పరిధిలోరాజగోపాల్‌పేట, ఇబ్రహీంనగర్ గ్రామాల్లో ఆకాల వర్షానికి నష్టపోయిన పంటపొలాలను : మాజీ మంత్ర హరీష్‌రావు సందర్శించి, బాధిత రైతాంగాన్ని ఓదార్చారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కార్ వస్తే పంటలకు బీమా తేస్తామని, రైతుబంధు 15వేలు ఇస్తామని, 2లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ నేతలు గొప్పలు చెప్పారని. అధికారంలోకి రాగానే వాటిని విస్మరించారన్నారు. సిఎం రేవంత్‌రెడ్డికి మాటలు ఎక్కువ చేతలు తక్కువ అన్నారు. ఇటీవలవ జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను అడిగానని సిద్దిపేటలో ఏ గ్రామానికి వెళ్తాం? లేదా మధిర నియోజక వర్గంలో ఏ ఊరికి రమ్మంటారో చెప్పాలని, అందరికి రుణమాఫీ జరిగిందని నిరూపిస్తే ముక్కు నెలకు రాస్తానని సవాల్ చేస్తే.. మాటను దాటవేసారని ఎద్దేవా చేశారు. వానకాలం రైతుబంధు పూర్తిగా ఎగ్గోట్టారని, యాసంగిలో సగం మందికి సైతం రైతుబంధు రాలేదని ఆరోపించారు. ఆనాడు కెసిఆర్ అధికారంలో ఉన్నప్పుడు అందరికి రైతుబంధు డబ్బులు వేసినట్లు తెలిపారు. ఈ ప్రభుత్వం అన్ని కోతలు పెట్టిందని విస్మరించారు. మొత్తం సర్వేనెంబర్లలో అద్దేకరం, పావు ఎకరం, ఎక్కువ ఉందని సాకుతో రైతులకు రైతుబంధు ఆపారన్నారు. 9వేల కోట్ల రైతుబంధు ఇవ్వాల్సి ఉంటే నాలుగువేల కోట్లు మాత్రమే ఇచ్చారన్నారు. ఇంకా 5వేల కోట్ల రైతుబంధు కోత పెట్టారన్నారు. ఈసారి ఆకాల నష్టానికి సిద్దిపేట జిల్లాలో 10 వేలకు పైగా పంట నష్టం జరిగిందన్నారు.2500 ఎకరాల్లో హార్టికల్చర్ పంటలు సైతం నష్టం వాటిల్లిందన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు యాసంగి రైతుబంధు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతుబీమా విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని చాల మంది రైతులకు రైతుబీమా అందటం లేదన్నారు. వెంటనే మరణించిన రైతులందరికి రైతుబీమా డబ్బులను విడుదల చేయాలన్నారు. కౌలు రైతులకు రైతుబంధు ఇస్తామన్నా ప్రభుత్వం ఎందుకు ఇవ్వటం లేదన్నారు. రైతుబంధు, ఇన్‌పుట్ సబ్సిడీ రాక కౌలు రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే వడగండ్ల వానతో పంట నష్టపోయిన కౌలు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పద్మశ్రీ అవార్డు గ్రహిత, వనజీవి రామయ్య మృతిపట్ల బిఆర్ఎస్ పార్టీ పక్షాన సంతాపం వ్యక్తి చేసినటు మాజీ మంత్రి హరీష్‌రావు తెలిపారు.

## ధాన్యం కొనుగోలు సెంటర్లు ఎప్పుడు ప్రారంభిస్తారు..?

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** పెద్దపల్లి జిల్లా చుట్టూ ప్రక్కల మండలాలలో వరి కోతలు ప్రారంభమై 20 రోజులు అవుతుందని ప్రభుత్వ ధాన్యం కొనుగోలు సెంటర్లు ప్రారంభం కాకపోవడం మూలంగా ఆరుగాలం కష్ట పడి చుక్క చుక్క నీరును వరి పొలాలకు పెట్టి పండించిన పంటను తుఫాన్ అకాల వర్షా ల కారణంగా వరి కోతలు ప్రారంభించిన రైతాంగానికి ప్ర భుత్వం వెంటనే కొనుగోలు సెంటర్లు అందుబాటులోకి తీసుకురావాలని ఎఐటియుసి జనరల్ సెక్రెటరీ కడారి సునీల్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత్యంతరం లేని పరిస్థితుల్లో తక్కువ రేట్లకు రైస్ మిల్లర్లకు అమ్ముకుంటున్న దీనస్థితి రైతంగం అనుభవిస్తుందని, వెంటనే ప్రభుత్వ ధాన్యం కొనుగోలు సెంటర్లు యుద్ధ ప్రతిపాదికన ప్రారంభం చే యాలని, మధ్య దళారీలు బ్రోకర్లు రైతంగానీ నిలువు దోపిడీ చేయక ముందే ప్రభుత్వం ఆయా గ్రామాల్లో వెంటనే ప్రభుత్వ ధాన్యం కొనుగోలు సెంటర్లను ప్రారంభించి రైతాంగాన్ని ఆదుకోవాలని, రైసు మిల్లులలో ధాన్యం అడ్డగోలు కటింగులుపై విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ తో వెంటనే విచారణ చేపట్టాలని కలెక్టర్‌కి విజ్ఞప్తి చేశారు. తక్కువ రేటుకు ధాన్యం రైస్ మిల్క్ చేరడంతో రైతాంగం ,గ్రామాలలో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు సెంటర్లలో హమాలీ పనులు చేసి హమాలీ కార్మికులకు ఆర్థిక నష్టం జరుగుతుందని వెంటనే ప్రభుత్వ ధాన్యం కొనుగోలు సెంటర్లను ప్రారంభం చేసి హమాలీ కార్మికులను రైతాంగాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## హనుమాన్ విజయ యాత్ర ర్యాలీకి పటిష్ట బందోబస్తు

కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌష్ ఆలం

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** హనుమాన్ జయంతి సంధర్బంగా శనివారం కరీంనగర్ నగరంలో నిర్వహించు వీర హనుమాన్ విజయయాత్ర కొరకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. ఈ సందర్భంగా ర్యాలీ విధుల్లో పాల్గొంటున్న అధికారులకు ఆయన బ్రీఫింగ్ కార్యక్రమం నిర్వహించారు. దాదాపు 450 మంది పోలీసు అధికారులు ఈ బందోబస్తు విధుల్లో పాల్గొంటున్నారన్నారు. సున్నితమైన ప్రాంతాల్లో స్టాటిక్ ఫోర్స్, స్ట్రైకింగ్ ఫోర్స్, రూఫ్ టాప్, మొబైల్ పెట్రోలింగ్ పార్టీలు ఇలా పలు రకాల విధులు కేటాయించామన్నారు. ట్రా ఫిక్ సమస్యలు తలెత్తకుండా అవసరమైన అన్ని చోట్ల దారి మళ్లింపు చర్యలు చేపట్టామని తెలిపారు. వీర హనుమాన్ విజయయాత్ర ర్యాలీకి పోలీసు శాఖ తరపున అవసరమైన అన్ని భద్రతా చర్యలు చేపట్టామని కరీంనగర్ పోలీసు కమిషనర్ తెలిపారు.

## రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**ప్రజాపక్షం/గంగాధర/ రామడుగు:** రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, యాసంగి పంట కాలానికి పూర్తి స్థాయిలో సాగునీరు అందించామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. తరుగు, కోతలు లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. రామడుగు మండల కేంద్రంలో, గంగాధర మండలం కురిక్యాలలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి శనివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ దేశంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా తమ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి పని చేస్తోందన్నారు. ఉ మ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో 72వేల కోట్ల రూపాయల రైతు రుణమాఫీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ హయాంలోనే శ్రీపాసాగర్, ఎస్సారెస్పీ, కడెం వంటి ప్రాజెక్టుల కు రూపకల్పన జరిగిందని అన్నారు. అప్పటి కాంగ్రెస్ ప్ర భుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలయజ్ఞం కార్యక్రమంలో భాగంగానే ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు వరద కాలువ వస్తోందన్నారు. చెప్పిన విధంగానే రెండు లక్షల రైతుల రుణమాఫీ సన్నాలకు 500 రూపాయల బోనస్ ఇచ్చామని అన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైస్ మిల్లర్లతో సమావేశం ఏర్పా టు చేసి కట్టింగులు లేకుండా కొనుగోలుకు ఆదేశించినట్లు తెలిపా రు. చొప్పదండి నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా నిరంతరం సాగునీరు అందించి ఒక్కగుంట భూమి సైతం ఎండిపోకుండా చూశామని తెలిపారు. చొప్పదండి నియోజకవర్గాన్ని ఇరిగేషన్ హబ్‌గా మారుస్తామని, కోనసీమను తలపించే విధంగా చేస్తామని వెల్లడించారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ రైతుల పక్షపాతిగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు నీడ, త్రాగునీరు వం టి సౌకర్యాలను కల్పించాలని, అకాల వర్షా ల వల్ల ధాన్యం త డవకుండా ఆదేశించారు. అడిషనల్ కలెక్టర్ లక్ష్మి కిరణ్, డిసివో రామానుజ చార్యులు, సివిల్ సప్లై డిఎం రజనీకాంత్, సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిరుమల రావు, తహసీల్దార్ అనుపమ రావు, రాజగోపాల్ రెడ్డి, పురుమల్ల మనోహర్, బూరుగు గంగన్న, సత్తు కనకయ్య, కరుణాకర్ ,దోర్నాల శ్రీనివాస రెడ్డి, దీకొండ మధు, ఆకుల ఆంజనేయులు, ముద్దం నగేష్, రెండ్ల శ్రీనివాస్, దోమకొండ మహేష్, శేఖర్ రెడ్డి, బాబు, మహేందర్, కొండయ్య, రాజేందర్, రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మనపల్లి తిరుమల తిరుపతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జవ్వాజి హరీష్, పంజాల శ్రీనివాస్, ఉప్పుల అంజనీ ప్రసాద్, తదితరులున్నారు.

## నష్టపోయిన పంట పొలాల పరిశీలన



**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** వడగండ్ల వానలకు పంట నష్టపోయిన రైతులు అధైర్యపడవద్దని, ధైర్యంగా ఉండాలని, మీకు నేను అండగా ఉంటానని మెదక్ ఎంపి మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. శనివారం మిట్ట మధ్యాహ్నం ఎర్రటి ఎండను సైతం లెక్క చేయకుండా నంగునూర్ మండలంలోని ముండ్రాయి, రాజగోపాల్‌పేట, పాలమాకుల, నర్మెట్ట, మైసంపల్లి, వెంకటాపురం గ్రామాలలో వడగండ్ల వానకు నష్టపోయిన వరి, మామిడి, కూరగాయల రైతుల పంట పొలాలను బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్‌తో కలిసి ఎంపి రఘునందన్‌రావు పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంట నష్టం ఎంత మేరకు జరిగిందని తెలుసుకొని, వారి కష్టాలు, బాధలను విని ధైర్యంగా ఉండాలని సూచించారు. మహిళా రైతులు కన్నీరు పెట్టుకొగా వారి ఓదారుస్తూ ధైర్యంగా ఉండాలని మీకు నేను అండాగా ఉన్నానని ధైర్యాన్నిచ్చారు. ఎంపి రఘునందన్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తానన్నారు. పంట నష్టపోయిన రైతుల వారిగా ఎంత నష్టం జరిగింది గ్రామం,సర్వేనంబర్ వారిగా పరిశీలించి నివేధిక తయారు చేసి కలెక్టర్‌కు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి, జ్యోతి రెడ్డి, సందీప్, సురేందర్ రెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/కొత్తపల్లి:** కరీంనగర్ జిల్లా కొత్తపల్లి పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో కెంచె లత, దూస భాగ్యలక్ష్మికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ సీనియర్ నాయకులు పొన్నం సత్యనారాయణ గౌడ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గడ్డం శ్రీనివాస్, చిలుక హనుమంత రెడ్డి, ఎర్రం కనకారెడ్డి, దుబ్బాసి కుమార్, గోనె రామస్వామి, జేరిపోతుల వాసు, భూస వీరేశం, సంగం మునీందర్, కుతాటి శ్రీనివాస్, గోనె రవీందర్, దూస రాజమౌళి, వికార్ మహమ్మద్ ఖాన్, ఎనగంటి స్వామి, రాపర్తి రాజు తదితరులున్నారు.

## నస్పూర్‌లో అభివృద్ధి కరువు.. ప్రజలు దుర్భర జీవితం

**ప్రజాపక్షం/నస్పూర్:** నస్పూర్ పట్టణం సీతారాంపల్లిలో మౌలిక సదుపాయాల లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బిజెపి నాయకులు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. గావ్ ఛలో, బస్తీ ఛలో కార్యక్రమంలో భాగంగా శనివారం సీతారాంపల్లిని సందర్శించిన రఘునాథ్, స్థానికులను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి ప్రాంతం వేల కోట్ల ఆదాయం అందిస్తున్నా, నస్పూర్ మున్సిపాలిటీలో అభివృద్ధి శూన్యంగా ఉందని, డ్రైనేజీ, త్రాగు నీరు, రోడ్ల పరిస్థితి తీవ్రంగా ఉండటం వల్ల ప్రజలు దుర్భర జీవితం గడుపుతున్నారని, సమస్యలు తక్షణమే పరిష్కరించాలి అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అశోక్ వర్ధన్, ఆనంద్ కృష్ణ, రమేష్, మధు, మొగిలి,సదానందం, కుర్రె చక్రి, సదయ్య, నరేందర్, జాడి తిరుపతి, మద్ది సుమన్, మహేష్, తిరుపతి, దేవేందర్, విక్రమ్, సత్యనారాయణ, మహేందర్ పాల్గొన్నారు.

## పేదవాడికి ఆపన్నహస్తం సిఎంఆర్‌ఎఫ్

**ప్రజాపక్షం/శివ్వంపేట:** నిరుపేదలకు ఆపన్నహస్తం సీఎంఆర్‌ఎఫ్ అని నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి అన్నారు. శివ్వంపేటలోని నవీన్‌గుప్తా నివాసంలో మండలానికి చెందిన 23 మంది లబ్దిదారుల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు రూ. 10,13,000 చెక్కులను లబ్దిదారులకు కాంగ్రెస్ నాయకులు ఆవుల రాజిరెడ్డి, కాంగ్రెస్ నాయకుల చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజాపాలనలో నిరంతరం బడుగు బలహీన వర్గాల కోసం పనిచేస్తుందని అన్నారు.



ఈ కార్యక్రమంలో నవీన్‌గుప్తా, వెంకటరాంరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, రవినాయక్, శ్రీనివాస్, గణేశ్, బిజిలిపురం సత్తయ్య, బిస్కుంద అంజయ్య, మధు, రాజు, నగేందర్, దావూద్ తదితరులు ఉన్నారు.

## ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి



**ప్రజాపక్షం/బాన్సువాడ :** ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికై శనివారం ఉద్యోగ ఉపాధ్యాయుల జేఏసి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐదు బకాయి డిఏలు, పిఆర్‌సి, హెల్త్ కార్డు, సిపిఎస్ రద్దు, పెన్షనర్ల బకాయిలు ఔట్‌సోర్సింగ్ కాంటాక్టు ఉద్యోగుల రెగ్యులర్ మొదలగు 57 సమస్యలను చైర్మన్ నరాల వెంకట రెడ్డి ఎమ్మెల్యేకు వివరించారు. కాంగ్రెస్ పార్టీ మెనిఫెస్టోలో చెప్పిన విధంగా సిపిఎస్‌ను రద్దుచేసి ఓపియాస్‌ను ప్రవేశపెట్టాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఉద్యోగులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చైర్మన్ వెంకట రెడ్డి, కార్యదర్శి దేవేందర్, కుశాల్, నాగరాజు, సాయిరెడ్డి, హనుమంత్ రెడ్డి, చింతల లింగం, విఠల్‌రావు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హనుమాన్ విజయోత్సవ ర్యాలీ



**ప్రజాపక్షం/పటాన్‌చెరు:** హనుమాన్ జయంతిని పురస్కరించుకొని పటాన్చెరు పట్టణంలోని వివిధ కాలనీలలో గల దేవాలయాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలు విజయోత్సవ ర్యాలీలలో పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డ పాల్గొన్నారు. అనంతరం మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో మాజీ ఎంపిపి గాయిత్రి పాండు ఆద్వర్యంలో నిర్వహించిన హనుమాన్ విజయోత్సవ ర్యాలీ ,అన్నప్రసాద వితరణ కార్యక్రమాలను ప్రారంభించారు. భగవంతుని ఆశీస్సులతో ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో ,సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు కార్పోరేటర్ మెట్టు యాదవ్, పటాన్చెరు సీఐ వినాయక్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు ,వెంకట్ రెడ్డి, గూడెం మధుసూదన్ రెడ్డి, రుద్రారం మాజీ సర్పంచ్ సుదీర్‌రెడ్డి, నరసింహా రెడ్డి, వెంకన్న, హనుమాన్ భక్తులు ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రశాంతంగా హనుమాన్ జయంతి ర్యాలీ నిర్వహణ

పోలీసు కమిషనర్ సాయి చైతన్య



**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** హనుమాన్ జయంతి ర్యాలీని ప్రశాంతంగా నిర్వహించుకోవాలని మతసామరస్యంతో శాంతి బద్రతలకు విఘాతం కల్పించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నిజామాబాద్ పోలీసు కమిషనర్ సాయి చైతన్య అన్నారు. శనివారం హనుమాన్ జయంతి ర్యాలీని కంఠేశ్వర్ దేవాలయం ముందు ప్రారంభించి మాట్లాడారు. నిజామాబాద్ నగరంలో హనుమాన్ జయంతి ర్యాలీ 1500 మంది పోలీసులు వివిధ విభాగాలకు చెందిన క్యాడర్ సిబ్బంది ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతి బద్రతల రక్షణ చేస్తున్నారని అన్నారు. వాడవాడనా హనుమాన్ మందిరాల వద్ద అన్నప్రసాదాల వితరణ సందర్భంగా, భోభాయాత్ర కంఠేశ్వర్ ఆలయం నుండి మొదలుకొని రాజరాజేంద్ర థియేటర్ చౌరస్తా చేరేవరకు అన్ని కూడళ్లలో భద్రత ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. సుమారు 500 సిసి కెమెరాలు, డ్రోన్ల సహాయంతో, కమాండ్ కంట్రోల్ రూం నుండి వీక్షించడం జరుగుతుందన్నారు. ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా రౌడీ షీటర్లను అధీనంలోకి తీసుకోవడం జరిగిందన్నారు. నగర ప్రజలు శోభాయాత్రను పండగ వాతావరణంలో ఆనందం ఉత్సాహాల మధ్య జరుపుకోవాలని ఎలాంటి ఘర్షణలకు తావివ్వకూడదన్నారు. ర్యాలీలో పోలీసు కమిషనర్‌తో పాటు ఏసిపి నిజామాబాద్ రాజా వెంకట్ రెడ్డి, సిఐలు, ఎస్‌ఐలు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పోలీసు అధికారులు, బందోబస్తులో పాల్గొన్నారు.

## భావితరాలకు సారవంతమైన నేలను అందిద్దాం..



**ప్రజాపక్షం/సోన్:** కన్నతల్లి లాంటి నేలను కాపాడుకుందాం భావితరాలకు సారవంతమైన నేలను అందిద్దాం అని నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు.మండలంలోని న్యూ వెల్మల్ గ్రామంలో ఏర్పాటు చేసిన రైతు నేస్తం భూసార పరీక్ష కేంద్రం,రిత్విజ ఫర్టిలైజర్ ను శనివారం నిర్మల్ జిల్లా డిసిసి అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు,ఏవో వినోద్ కూమార్ ప్రారంభించారు.ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ రైతు మట్టి పరీక్ష కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.రైతులకు సేవలందించాలని నిర్వాహకులకు సూచించారు.నేడు మట్టి పరీక్షలు నిర్వహించిన తర్వాతనే పంటలు వేసుకోవాలని సూచించారు.భూసార పరీక్షల వల్ల భూసారాన్ని కోల్పోకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చని పేర్కొన్నారు.రసాయన ఎరువులను తగినంత మోతాదులో వాడుకోవాలని అన్నారు.అనంతరం భూసార యంత్రాన్ని గురించి వ్యవసాయ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేవలం ఐదు నిమిషాలలో మట్టి పరీక్షల ఫలితాలు తెలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు అశోక్ కుమార్, ప్రగతి, అంబాజీ, కాంగ్రెస్ నాయకులు గడ్డం స్వామి పెద్ద లక్ష్మణ్, రామ్ రెడ్డి, రాజనర్సింహారెడ్డి, తోట సాయన్న, రోడ్డ రాజేశ్వర్ గజ్జల గంగాధర్, అమృత్ రాజ్ నిర్వాహకులు బొండ భోజన్న, కొండ రవి రైతులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులకు రూ.6 వేలు పెన్షన్

ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య డిమాండ్

**ప్రజాపక్షం/నిజామాబాద్‌అర్బన్:** భవన నిర్మాణ కార్మికులకు 58 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క కార్మికునికి రూ. 6 వేలు పెన్షన్ ఇవ్వాలి. ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య అన్నారు. శనివారం స్తానిక ఏఐటియుసి జిల్లా కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా రెండవ మహాసభలను నర్సింగరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభకు జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో కమ్యూనిస్టుల పోరాటం వల్ల భవన నిర్మాణ సంక్షేమ బోర్డు గత యుపిఏ ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సంక్షేమ బోర్డు వల్ల కోట్లాదిగా ఉన్న భవన నిర్మాణ రంగాల కార్మికులకు సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని అన్నారు. ప్రజల శ్రమ ద్వారా రాష్ట్ర భవన నిర్మాణ యజమానుల నుండి సంక్షేమ బోర్డుకు ఒక పర్సెంట్ పన్ను రూపేనా కట్టడం ద్వారా వందల కోట్ల రూపాయలు భవన నిర్మాణ బోర్డులో జమ కావడం జరిగిందన్నారు. బోర్డులో ఉన్న ప్రతి పైసా భవన నిర్మాణ రంగంలో ఉన్న కార్మికుల సంక్షేమం కోసం మాత్రమే ఖర్చు చేయాలని, కానీ రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమంకోసం కాకుండా ప్రభుత్వ పథకాల అమలుకు దొడ్డిదారిన ఆ డబ్బులు వాడుకుంటున్నారని తద్వారా కార్మికులకు అన్యాయం జరుగుతుందన్నారు. సంక్షేమ బోర్డులో నమోదైన కార్మికులకు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 6 లక్షల 30 వేలు, సహజ మరణం పొందిన వారికి మూడు లక్షలు ఇతర పెళ్ళిల్లకు, డెలివరిలకు కూడా డబ్బులు ప్రస్తుత రేట్లకు అనుగుణంగా పెంచి ఇవ్వాలని అన్నారు. సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె. రాజన్న, నాయకులు పి.హనుమాండ్లు, గంగాధర్, గంగరాజు, నీలి శంకర్, మేకల సాయిలు, సురేష్, వెంకటి, లక్ష్మి నారాయణ, శ్రీనివాస్, నవీన్, పెద్ద నాగిరెడ్డి వివిధ మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్:** శ్రీ చైతన్య విద్యార్థి ప్రతిభ అభినందనీయం అని సిర్పూర్ ఎంఎల్‌ఏ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. ఫిబ్రవరి 2న నిర్వహించిన ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ పరీక్షలో మూడో తరగతి విద్యార్థి రామడుగుల ఆర్య అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన నేపథ్యంలో విద్యార్థికి ఎంఎల్‌ఏ హరీష్‌బాబు చేతుల మీదుగా ల్యాప్‌టాప్‌ను అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా రాష్ట్రానికి మేధావులు అందుబాటులోకి వస్తారని పేర్కొన్నారు. విద్యారంగం బలోపేతానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. అనంతరం విద్యార్థిని శీ చైతన్య స్కూల్స్ చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ విద్య, రాష్ట్ర సమన్వయకర్త జయరాజ్, ఎజిఎం అరవింద్ రెడ్డి, నాగరాజు, జయశ్రీ, స్రవంతి, ప్రాథమిక ఇన్‌ఛార్జ్ దీప్తి, తల్లిదండ్రులు అభినందించారు.

## ధాన్యం సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్



**ప్రజాపక్షం/నిజామాబాద్ బ్యూరో :** కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరన ప్రక్రియను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ అధికారులకు సూచించారు. నవీపేట్ మండలం నాగేపూర్, నిజాంపూర్, నాళేశ్వర్, నవీపేట్‌లలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ శనివారం సందర్శించారు. రైతుల సౌకర్యార్థం కేంద్రాల్లో అందుబాటులో ఉంచిన సదుపాయాలను పరిశీలించారు. ధాన్యం తరలించిన రైతులను పలకరించి కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులున్నాయా అని ఆరా తీశారు. కాంటా చేసేందుకు సిద్ధంగా ఉంచిన ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులుంటే అధికారులకు తెలియజేయాలని రైతులకు సూచించారు. కాగా నిర్దేశిత లక్ష్యానికనుగుణంగా ధాన్యం సేకరణ జరిగేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. రైతుల నుండి సేకరించిన ధాన్యాన్ని వెంటాదివెంట లారీలలో లోడ్ చేయించి కేటాయించిన రైస్‌మిల్లులకు తరలించాలని సూచించారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో క్షేత్రస్థాయి సిబ్బంది మొదలుకుని అధికారుల వరకు ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హితవు పలికారు. రైతులు ధాన్యం తీసుకవచ్చిన వెంటనే తూకం జరిపించాలని నాణ్యతా ప్రమాణాలకు లోబడి ధాన్యం తీసుకవచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అదనపు కలెక్టర్ వెంట డీసీఓ శ్రీనివాస్‌రావు తదితరులున్నారు.

## అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు పరిహారం

రైతు సంఘం మహిళా కార్యదర్శి తమ్మపుడిబుజ్జమ్మ




**ప్రజాపక్షం/ సదాశివపేట:** ఇటీవల మండల పరిధిలో పడ్డ అకాల వర్షాలకు ముఖ్యంగా మామిడి ,టమాట, వరి ,ముల్లంగి లాంటి పంటలు చాలా తెబ్బతిన్నాయని వారికి ఎకరానికి రూ. 25 వేలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలని రైతు సంఘం మహిళా కార్యదర్శి తమ్మపుడి బుజ్జమ్మ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు శనివారం ముఖ్య కార్యకర్తల సమావేశంలో పై విధంగా అన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించక నష్టాల్లో ఉన్న రైతన్న కి ఇటీవల కురిసన ఆకాల వర్షాలకు రైతు నెత్తిన పిడుగు పడినట్లు అయిందన్నారు. రైతులు పెట్టిన పెట్టుబడి రాక నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులకు ఆకాల వర్షం పుణ్యమా అని మరింత ఇబ్బందుల గురికావస్తుందని రాష్ట్ర ప్రభుత్వానికి సీపిఐ డిమాండ్ చేసింది. ఏమనగా ఆకాల వర్షాల కారణంగా మండల పరిధిలో నష్టపోయిన రైతాంగానికి ఎకరాకు రూ. 25 వేలు చొప్పున నష్ట పరిహారం చెల్లించాలని ఆమె రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యాకూబ్ అలీ ఉమేష్, నాయక్, పూలమ్మ, తస్లీమ్, లక్ష్మి .బిపాషా బేగం తదితరులు పాల్గొన్నారు.

## మంత్రులను కలిసిన దివ్యాంగులు

ఆర్‌టిసి బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని వినతి



**ప్రజాపక్షం/గజ్వేల్:** దివ్యాంగులకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరుతూ దివ్యాంగ జేఏసి ఆధ్వర్యంలో నాయకులు శనివారం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ను కలిసిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టిడిజేఏసీ గౌరవ సలహాదారులు బొంగోని శ్రీశైలం గౌడ్, అధ్యక్షులు చిట్యాల సంపత్ మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని అన్నారు. ఆర్టీసీ బస్సులలో దివ్యాంగులకు ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే ఆర్టీసీ బస్సులలో ఐదు సీట్లు వికలాంగులకు కేటాయించాలని చెప్పారు. అర్హులైన దివ్యాంగులకు ఇందిరమ్మ పథకంలో మొదటి ప్రాధాన్యతగా ప్రభుత్వం ఇండ్లు కట్టించి ఇవ్వాలని అన్నారు. పరిశ్రమలలో ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని, అర్హులైన దివ్యాంగులకు అంత్యోదయ కార్డులు ఇవ్వాలని, దివ్యాంగులకు ప్రస్తుత పెన్షన్ రూ 4 వేల నుండి రూ 6 వేలకు పెంచి దివ్యాంగుల బతుకుల్లో వెలుగులు నింపాలని స్పష్టం చేశారు. పెన్షన్ 5 వ తేదీ వరకు బ్యాంకు ఖాతాలో జమ చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ గూడూరి దుర్గయ్య, గూడూరి బాబు, జింక యాదగిరి, నారాయణ, జగన్, యాకూబ్, వేణు, కనకయ్య పాల్గొన్నారు.

## పాఠశాలను సందర్శించిన కలెక్టర్

**ప్రజాపక్షం/రామాయంపేట:** రామాయంపేట మండలంలో జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ క్షేత్రస్థాయి పర్యటనలో బాగంగా శనివారం విస్తృత పర్యటన చేశారు. మండలంలోని పర్వతాపూర్ గ్రామంలో ఉపాది హామీ పనులను పరిశీలించారు. ఉపాది పనులకు మంచి సీజనని పెద్ద ఎత్తున లేబర్‌ను మొబిలైజేషన్ చేయాలన్నారు. సుమారు రెండు కిలోమీటర్ల మేర అడవిలో కాలినడకన వెళ్లి జాతీయ గ్రామీణ ఉపాది హామీ పథకం ద్వారా కూళీలు చేస్తున్న ట్రాంచ్ పనులను పరిశీలించారు. కూలీల సమస్యలు, వారికి అందిస్తున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. కూలీల కుటుంబ వివరాలు, ఉపాది హామీ కూలి డబ్బులు, పనివేళలు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. కూలీలు చేసిన పని కొలతల్లో తేడాలు రావద్దని సామాజిక తనిఖీల్లో ఇబ్బందులు వస్తాయని స్పష్టం చేశారు. అనంతరం రైతుల పంటలను పరిశీలించారు. కాట్రియాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. నాణ్యమైన బోజనం అందించాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో షాజీలొద్దిన్, పంచాయతి కార్యదర్శి వరలక్ష్మీ, ఏపివో శంకరయ్య, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాస్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



## అంబేద్కర్ జయంతిలోగా విగ్రహ ఏర్పాటు

కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం/నస్పూర్:** ఈ నెల 14వ తేదీన భారత రాజ్యాంగ నిర్మాత డా బి.ఆర్.అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని విగ్రహం ఏర్పాటు పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఐబి చౌరస్తాలో కొనసాగుతున్న డా. బిఆర్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డా బిఆర్ అంబేద్కర్ దేశానికి అందించిన సేవలు మరువలేనివని అన్నారు. ఈ నెల 14వ తేదీన డా. బిఆర్ అంబేద్కర్ 134వ జయంతిని పురస్కరించుకొని జిల్లాలో వేడుకలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందని, ఇందులో భాగంగా విగ్రహ ఏర్పాటు పనులు వేగవంతం చేసి ఈ నెల 14వ తేదీన ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జయంతి వేడుకలలో భాగంగా నిర్వహించే కార్యక్రమాల సంబంధిత పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే పోచారం

**ప్రజాపక్షం/బాన్సువాడ :** బాన్సువాడ పట్టణంలోని పెద్ద హనుమాన్, పాత బాన్సువాడ, మండలంలోని దేశాయిపేట్ తదితర గ్రామాలలో హనుమాన్ జయంతి సందర్భంగా జరుగుతున్న వేడుకల్లో ఎమ్మెల్యే, వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి పాల్గొని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్ని మండలంలోని బెల్యా నాయక్ తండాలో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బంజారా సేవా సంఘ్ జిల్లా అధ్యక్షులు బద్యా నాయక్, మాజీ మునిసిపల్ చైర్మన్ జంగం గంగాధర్, నాయకులు అంజిరెడ్డి, కృష్ణా రెడ్డి,వెంకన్న గుప్తా, పిట్ల శ్రీధర్, నార్ల రవీందర్, ఎజాస్, నార్ల ఉదయ్, లింగమేశ్వర్, భక్తులు పాల్గొన్నారు.



## కెజిబివిపిలలో 18 మంది మహిళా కానిస్టేబుల్‌లు పర్యవేక్షణ



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్:** నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు అనేది భారతదేశంలోని బలహీన వర్గాల కోసం పని చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ జానకి షర్మిల పేర్కొన్నారు. శనివారం రాజున జిల్లాలోని కెజిబివిపీ పాఠశాలలో ఒకరోజు నిద్ర చేసిన ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికల మాధ్యమిక పాఠశాల, గ్రామీణ ప్రాంతాల్లో అణగారిన వర్గాల్లో లింగ అసమానతలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ఈ లింగ అసమానతలను ఎలా చేస్తే మనం సాధ్యమైనంత వరకు ఆ పాఠశాల లోని విద్యార్థుల సమస్యలను నివారించ గలుగుతాము అని ఒక సరికొత్త అలోచన ఒరవడితో, కేవలం ఒక మహిళ ఉంటేనే ఆడపిల్లల సమస్యలను దగ్గరుండి అర్థం చేసుకుంటారనే ఉద్దేశంతో రాష్ట్రలో ఎక్కడా లేని విధంగా జిల్లాలోని 18 పాఠశాలలకు 18 మంది మహిళా కానిస్టేబుల్ లను పర్యవేక్షణ అధికారులుగా నియమించి ఒక్కో పాఠశాలలను ఒక్కో మహిళ కానిస్టేబుల్ దత్తత తీసుకోవటం జరిగిందని,ఇందులో భాగంగా నిన్నటి నుండి మహిళా సిబ్బంది స్కూల్ లో విద్యార్థినిలతో కలసి ఉండి,రాత్రి వారితో బసా చేయటం జరిగింది.వారితో ఉంటేనే వారి సాధక బాధలు తెలుస్తాయని,వారిని మానసికంగా ఉత్తేజపరచవచ్చని అక్కడే బస చేయటం జరిగింది.రాత్రి వారితో స్నేహపూర్వకంగా ఉంటూ వారికి జరుగుతున్న వార్షిక పరీక్షల గురించి,పరీక్షలు ఎలా రాయాలి,ఎలా ప్రిపేర్ కావాలి అనేది చెప్పటం జరిగింది.ఉదయమే మానసిక ఉల్లాసం కోసం,శారీరకంగా ఉత్తేజం కోసం యోగా కూడా చూపించటం జరిగింది.రాత్రి అక్కడే నిద్రించి దగ్గరుండి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకొని వారితో కలిసి మెలిసి ఉండటం తో వారు చాలా సంతోషించారు.

# ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

ఆలయ అభివృద్ధికి రూ.10 లక్షలు నిధుల కేటాయింపు

**ప్రజాపక్షం /ఆసిఫాబాద్:** హనుమాన్ జయంతి పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి శిరీష్ శర్మ, పూజారులు శ్రీనివాస్, రాజు, నరేష్, మహేష్, పూర్ణచందర్, శేఖర్ ల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ ఆవరణలో హోమం కార్యక్రమం నిర్వహించారు. ఉదయం ఐదు గంటలకు సుప్రభాత సేవతో ప్రారంభమై కలశపూజ, ధ్వజారోహణం, సహస్ర పుష్పార్చన, నవగ్రహ పూజ పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే తో పాటు, స్థానిక ఎంఎల్‌ఏ కోవలక్ష్మి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి శ్యాం నాయక్, మాజీ జెడ్పిటిసి అరిగెల నాగేశ్వరరావు, మాజీ ఎంపిపిలు మల్లికార్జున్, బాలేష్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లు గాదవేణి మల్లేష్ చిలువైన వెంకన్న, బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్నర్ రమేష్, వివిధ సంఘాల నాయకులు కోట వెంకన్న, చరణ్ మసాదే లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆధ్యాత్మికతతో ప్రశాంతత పెరుగుతుందని తెలిపారు. స్థానిక కేస్లాపూర్ ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధి కోసం స్థానిక ఎంఎల్‌ఏ కోవలక్ష్మి ఆధ్వర్యంలో 10 లక్షల రూపాయల సిఎస్‌ఆర్ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎంఎల్‌ఏ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కోసం నిధులు ఉపయోగపడతాయని తెలిపారు. మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.



ఫోకస్

# క్రీడ

# 'టెస్టు'లకే పరిమితమా?



కొంత మంది క్రికెటర్లపై టెస్టు మ్యాచ్‌లకు మాత్రమే పరిమితమనే ముద్ర పడుతుంది. ఫలితంగా వారి కెరీర్‌లో ఎదుగుదల కనిపించదు. న్యూజిలాండ్ ఫాస్ట్ బౌలర్ నీల్ వాగ్నర్ కూడా ఇలాంటి ఆటగాళ్ల జాబితాలో చేరతాడు. కివీస్ తరఫున 64 టెస్టులు ఆడిన అతనికి జాతీయ జట్టు తరఫున వన్డే ఇంటర్నేషనల్స్ లేదా టి20 ఇంటర్నేషనల్స్‌లో ఆడే అవకాశం లభించలేదు. కెరీర్‌లో ఆడిన 64 టెస్టుల్లో 13,725 బంతులు బౌల్ చేసిన అతను, 260 వికెట్లు పడగొట్టాడు. బ్యాటింగ్‌లో రాణించలేకపోయిన అతను 875 పరుగులు మాత్రమే సాధించగలిగాడు. కాగా, టి20 ఫార్మాట్‌లో 94 మ్యాచ్‌లు ఆడి, 1,895 బంతులు వేశాడు. అతని ఖాతాలో 103 వికెట్లు ఉన్నాయి. 279 పరుగులు చేశాడు. టి20 ఫార్మాట్‌లో మెరుగైన ప్రదర్శనలు ఉన్నప్పటికీ, ఈ విభాగంలో ఇంటర్నేషనల్స్ ఆడే అవకాశం మాత్రం అతనికి దక్కలేదు. కివీస్ క్రికెట్ బోర్డు అతనిని కేవలం టెస్టు క్రికెటర్‌గా ముద్రవేసినట్టు కనిపిస్తున్నది.



# 8 బంతుల ఓవర్.. 12 రోజుల మ్యాచ్!

టెస్టు మ్యాచ్ ఐదు రోజులు జరుగుతుందని అందరికీ తెలుసు. ఇంతకు ముందు, ఒక రోజు విశ్రాంతితో కలిపి ఆరు రోజుల జరిగేది. అయితే, 1939లో దర్బన్ వేదికగా దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్ జట్ల మధ్య టెస్టు మ్యాచ్ 12 రోజులు జరిగింది. ఆ మ్యాచ్‌లో ఓవర్‌కు ఎనిమిది బంతులు వేశారు. తాము వెళ్లాల్సిన ఓడకు సమయాతీతమవుతున్న కారణంగా, ఇంగ్లాండ్ క్రీడాకారులు మ్యాచ్‌ని మధ్యలోనే విడిచి, స్వదేశానికి పయనమయ్యారు. దీనితో ఆ టెస్టును డ్రాగా ప్రకటించారు. ఈ మ్యాచ్‌ని 'టైమ్ లెస్ టెస్ట్' అని పిలుస్తారు.

**సంక్షిప్త స్కోర్లు**

దక్షిణాఫ్రికా మొదటి ఇన్నింగ్స్: 202.6 ఓవర్లలో 530 పరుగులకు ఆలౌట్ (పీటర్ వాన్ డెన్ బిజ్ 125, డూడ్లే నౌర్స్ 103, కెప్టెన్ అలాన్ మెల్విల్లే 78, ఎరిక్ డాల్టన్ 57, రెగ్ పెర్క్స్ 100 పరుగులకు 5 వికెట్లు).

ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్: 117.6 ఓవర్లలో 316 ఆలౌట్ (వికెట్‌కీపర్ లెన్ అమెస్ 84, ఎడ్డీ పైంటర్ 62, ఎరిక్ డాల్టన్ 59 పరుగులకు 4, చౌడ్ లాంగ్టన్ 71 పరుగులకు 3, బాబ్ న్యూసన్ 58 పరుగులకు 2 వికెట్లు).

దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ (మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యం 214): 142.1 ఓవర్లలో 481 ఆలౌట్ (కెప్టెన్ అలాన్ మెల్విల్లే 103, పీటర్ వాన్ డెన్ బిజ్ 97, బ్రూస్ మిచెల్ 89, కెన్ ఫార్నెస్ 74 పరుగులకు 4, హెడ్లే వెరిటీ 146 పరుగులకు 3, వాలీ హామండ్ 87 పరుగులకు 2 వికెట్లు).

ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్ (విజయ లక్ష్యం 696): 218.2 ఓవర్లలో 5 వికెట్లకు 654 (లియోనార్డ్ హూటన్ 55, పాల్ గిబ్ 120, బిల్ ఎడ్రిచ్ 219, వాలీ హామండ్ 140, ఎడ్డీ పైంటర్ 75, ఎరిక్ డాల్టన్ 100 పరుగులకు 2 వికెట్లు).

**మ్యాచ్ ఫలితం: డ్రా.**



# 'డక్స్ కింగ్' మాక్స్‌వెల్

ఆస్ట్రేలియన్ హార్డ్ హిట్టర్ గ్లెన్ మాక్స్‌వెల్ ఎవరూ కోరుకోని రికార్డు నెలకొల్పాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్‌లో అత్యధిక పర్యాయాలు సున్నాకే అవుటైన ఆటగాడిగా రికార్డు పుటల్లోకి ఎక్కాడు. చెరి 18 డక్స్‌తో దినేష్ కార్తీక్, రోహిత్ శర్మ రికార్డును అధిగమించాడు. ప్రస్తుత ఐపిఎల్‌లో భాగంగా అహమ్మదాబాద్ వేదికగా, గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో, పంజాబ్ కింగ్స్ తరఫున ఆడుతున్న మాక్స్‌వెల్ డకౌట్ కావడం, అతనికి రికార్డును అందించింది. కానీ, ఇలాంటి వ్యర్థమైన రికార్డును ఆటగాళ్లు ఎవరూ కోరుకోరన్నది నిజం.

# చెస్‌కు ఒలింపిక్ హోదా ఎప్పుడో?



చెస్ క్రీడను అంతర్జాతీయ చెస్ ఫెడరేషన్ (ఎఫ్ఐడిఇ) లేదా వరల్డ్ చెస్ ఫెడరేషన్‌కు కూడా అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఒసి) గుర్తింపు ఉన్నప్పటికీ ఒలింపిక్స్ జాబితాలో నేటికీ చదరంగం క్రీడకు చోటు దక్కడంలేదు. ఒలింపిక్ క్రీడల జాబితాలో ప్రస్తుతం 241 గేమ్స్ ఉండగా, పది వేలకు పైగా క్రీడాకారులు పాల్గొంటారు. 1924 నుంచి చెక్ క్రీడను ఒలింపిక్స్ జాబితాలో చేర్చాలనే విఫలయత్నాలు కొనసాగుతూనే ఉన్నాయి. సిడ్నీ ఒలింపిక్స్ (2000)లో చదరంగాన్ని ఎగ్జిబిషన్ క్రీడగా ఆడించినప్పటికీ, అధికారిక క్రీడల జాబితాలో నేటికీ చేర్చలేదు. ఒలింపిక్ క్రీడగా పరిచయం చేయడానికి చెస్‌కు అన్ని రకాల అర్హతలు ఉన్నాయి. ఈ క్రీడను ఒలంపిక్ క్రీడగా అనుమతించాలని చెస్ ఆటగాళ్లు, క్రీడాభిమానులు ఎదురుచూస్తున్నారు. ఎఫ్ఐడిఈ కార్యవర్గం తరుచుగా ఐఒసితో ప్రత్యక్ష అభ్యర్థనలను సమర్పిస్తున్నది. నేడు చెస్ క్రీడను ఒలింపిక్ ఇస్పోర్ట్‌గా మాత్రమే గుర్తించారు. ఈ అంశాలన్ని కలిసి రానున్న రోజుల్లో చెస్ మరో ఒలింపిక్ స్పోర్ట్గా రావచ్చని గట్టిగా నమ్ముతున్నారు. నెమ్మదిగా, ఓపికగా ఆడే చదరంగం క్రీడ ఫలితం రావడానికి సమయం ఎక్కువ పట్టడం కూడా ఒక ప్రతిబంధకంగా, వీక్షకుల ఓపికను పరీక్షించే విధంగా మారిందని చెబుతున్నారు. ఇలావుంటే, మిగతా అన్ని రకాల క్రీడల మాదిరిగానే చెస్‌లోనూ భారీ మార్పులు వచ్చాయి. చెక్ క్రీడ వేగం పెరిగింది. ర్యాపిడ్ చెస్ విధానం అమల్లోకి వచ్చింది. ప్రజాదరణ కూడా విపరీతంగా పెరుగుతోంది. భారత్ లాంటి దేశాల్లో చదరంగం ఆటకు వేల సంఖ్యలో ప్రేక్షకులు కూడా ఉంటున్నారు. ఐఒసి, ఎఫ్ఐడిఇ, సభ్య దేశాల క్రీడాశాఖామంత్రులు, దేశాల చదరంగ సమాఖ్యలు కలిసి సమాలోచనలు చేసి సత్వరమే చెస్ ఆటను ఒలింపిక్ జాబితాలో చేర్చాలని క్రీడాభిమానులు కోరుతున్నారు. చెస్ క్రీడ ఒలింపిక్స్ జాబితాలో చేరితే ఆ ఆట పట్ల కూడా ప్రపంచ క్రీడాభిమానుల దృష్టి పడడం, చదరంగం క్రీడాకారుల సంఖ్య పెరగడం కూడా జరుగుతుంది. వందేండ్లుకుపైగా చరిత్ర కలిగిన ఒలింపిక్ క్రీడల జాబితాలో చెస్ చేరడం సమీప భవిష్యత్తులో ఖాయంగానే కనిపిస్తున్నది. ప్రారంభ దశలో పరిమితంగా, అంటే, 20 కన్న తక్కువ దేశాలకు మాత్రమే అవకాశం కల్పించడం, టీమ్ ఈవెంట్‌గా మాత్రమే తీసుకోవడం, వింటర్ లేదా సమ్మర్ ఒలింపిక్స్ జాబితాలో చేర్చడం లాంటి పలు ప్రతిపాదనలు ఐఒసి ముందు ఉన్నాయి. మోసం చేయడానికి ఆస్కారాలు ఉండడం, శారీరక శ్రమ లేక పోవడం, ప్రేక్షకులు తక్కువగా ఉండడం, సరైన వేదికలు అందుబాటులో లేక పోవడం లాంటి పలు కారణాలతో చదరంగ క్రీడకు అభిమానులు తగ్గారు. అత్యంత ప్రజాదరణ పొందిన క్రికెట్, చెస్, క్యారమ్ లాంటి ప్రజాదరణ పొందిన క్రీడలు నేటికీ ఒలింపిక్స్ జాబితాలో చేరకపోవడం విచారకరం. చెస్సు ఒక సాధారణ క్రీడా కాకుండా మేధో వికసిత క్రీడగా మాత్రమే భావించడం కూడా చెస్‌కు ప్రతిబంధకంగా మారుతున్నది. మేధో పరిణతికి కొలమానంగా బావించబడే చదరంగం కూడా రానున్న రోజుల్లో ఒలింపిక్ క్రీడల జాబితాలో చేరాలని కోరుకుందాం, చెస్ క్రీడతో ప్రత్యర్థిని చిత్తు చేద్దాం.

# ఎక్స్ట్రాల మోత!


ఎక్స్ట్రాల రూపంలో పరుగులు సమర్పించుకోవడం చాలా సందర్భాల్లో జట్టుపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఇటీవల న్యూజిలాండ్, పాకిస్తాన్ జట్ల మధ్య నాపీర్‌లో జరిగిన మొదటి వన్డే ఇంటర్నేషనల్ మ్యాచ్‌లో మొత్తం 70 ఎక్స్ట్రాలు నమోదయ్యాయి. వీటిలో 43 పాకిస్తాన్ సమర్పించుకున్నవికాగా, మిగతా 27 న్యూజిలాండ్ ఇచ్చినవి. అయితే, ఈ విధంగా ఉదారంగా పరుగులు ఇవ్వడంలో రికార్డు మాత్రం ఇదికాదు. 1999 ప్రపంచకప్ చాంపియన్‌షిప్‌లో భాగంగా, చెస్టర్ లీ స్ట్రీట్‌లో పాకిస్తాన్, స్కాట్‌లాండ్ జట్లు తలపడ్డాయి. ఇందులో ఏకంగా 96 ఎక్స్ట్రాలు నమోదుకావడం ఒక రికార్డు. వీటిలో 50 పరుగులు కేవలం వైడ్స్ ద్వారా అందినవే. 1989లో బ్రిస్బేన్ కేంద్రంగా పాకిస్తాన్, వెస్టిండీస్ తలపడినప్పుడు 90 పరుగులు ఎక్స్ట్రాల రూపంలో స్కోరుబోర్డుకు జత కలిశాయి. వీటిలో 50 వైడ్స్. కాగా, లీసెస్టర్‌లో జింబాబ్వే, భారత్ జట్ల మధ్య జరిగిన 1999 వరల్డ్ కప్ మ్యాచ్‌లోనూ 90 ఎక్స్ట్రా పరుగులు స్కోరుబోర్డుకు చేరాయి. ఆ మ్యాచ్‌లో భారత్‌పై జింబాబ్వే అనూహ్య విజయాన్ని నమోదు చేసింది. ఇలావుంటే, ఉదారంగా పరుగులు ఇవ్వడంలో మహిళా జట్లు పురుషుల జట్ల కంటే ముందున్నాయి. 2003లో జపాన్, నెదర్లాండ్స్ మహిళా క్రికెట్ జట్ల మధ్య జరిగిన వన్డే ఇంటర్నేషనల్ మ్యాచ్‌లో ఎక్స్ట్రాలు ఏకంగా 133. అత్యధికంగా 87 పరుగులు వైడ్స్ రూపంలో వచ్చినవే. కాగా, వంద లేదా అంతకు మించి ఎక్స్ట్రాలు నమోదైన మహిళల వన్డే ఇంటర్నేషనల్ మ్యాచ్‌లో మరో ఐదు ఉన్నాయి. ఎంతైనా మహిళలు ఉదారస్వభావులు.





## సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలి

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్



**ప్రజాపక్షం/వెంకటాపూర్ :** 16న ములుగులో జరిగే భవన నిర్మాణ కార్మిక సంఘం మహాసభను జయప్రదం చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ కోరారు. శనివారం మండల కేంద్రములో భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యకర్తల సమావేశం బండి నర్సయ్య అధ్యక్షతన జరిగింది. జంపాల రవీందర్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారానికి సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ప్రసూతికి రూ.30000,పెళ్ళికి రూ.30000 ఇస్తున్నారని, దానిని రూ.100000కు పెంచాలని, అలాగే సహజ మరణానికి రూ.1,30000. ప్రమాధ మరణానికి రూ.6,30000 ఇస్తున్నారని,మరణం అనేది ఎలా జరిగినా మరణమే కాబట్టి రూ.10,00000 అందించాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కోశాధికారి కొక్కుల రాజేందర్, ఏఐటియుసి మండల నాయకులు తోట సంపత్, దేవేందర్, సురేష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాసం గడువు పెంచాలి

**ప్రజాపక్షం/కొత్తగూడెంటౌన్ :** రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి కోసం నూతనంగా ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తు తేదీని మరో వారం రోజులు పొడిగించి కుల ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్లు త్వరగా వచ్చేవీదాంగం చూడాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఫహీమ్ దాదా కోరారు. అర్హులైన నిరుద్యోగ యువతకు ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో అండగా నిలిచేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తు చేసుకోడానికి కుల ఆదాయ ధ్రువీకరణ పత్రం కోసం నిరుద్యోగులు రోజుల తరబడి ఇబ్బందులు పడుతూ తహాసిల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని ఇప్పటికే లక్షలాది మంది దరఖాస్తు చేసుకోగా, ధరఖాస్తు చేసుకోవడానికి ప్రయత్నిస్తున్న వారు ఇంకా లక్షల్లో ఉన్నారని తెలిపారు. దీన్ని బట్టి చూస్తే మీరు ఉద్యోగ సమస్య ఉపాధి అవకాశం లేని వారు ఎంత ఉన్నారో అర్థమవుతుందన్నారు. తాసిల్దార్ కార్యాలయాల వద్ద బ్యాంకుల వద్ద ధ్రువీకరణ పత్రాల కోసం పడిగాపులు కాస్తున్నారని తరచు సర్వర్ డౌన్ సాంకేతిక సమస్యలు తలెత్తడంతో రోజుల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మూడు రోజులు పాటు బ్యాంకు సెలవల దృష్ట్యా ఇంకో వారం రోజులపాటు దరఖాస్తు గడువును పొడిగించాలని ఆయన కోరారు.

## భవన కార్మికులకు రూ.5వేలు ఇవ్వండి




**ప్రజాపక్షం/నిర్మల్‌రూరల్:** ఈ నెల 14న సిపిఐ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మహాసభ విజయవంతం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ పిలుపునిచ్చారు. శనివారం ప్రకాష్ అధ్యక్షతన సమావేశం జరిగింది. విలాస్ మాట్లాడుతూభవన నిర్మాణ కార్మికులకు రూ.5000పెన్షన్, ప్రమాద వశాత్తూ మరణిస్తే 10వేలు చెల్లించాలన్నారు. నసీర్, యస్.ఎన్‌రెడ్డి, భుక్య రమేష్, తజమ్ముల్ తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ విరుద్ధ 'వక్ఫ్' బోర్డు చట్టాన్ని రద్దు చేయాల్సిందే

## వక్ఫ్ ఆస్తులపై పెత్తనం కోసమే..




**ప్రజాపక్షం/ఖమ్మం :** ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన వక్ఫ్ చట్టాన్ని నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో శనివారం ఖమ్మం నగరంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు మాట్లాడారు. వక్ఫ్ సవరణ బిల్లుకు ఉభయ సభల ఆమోదం ద్వారా బిజెపి తనమతోన్మాద,మతపరమైన విభజన ఎజెండాను మరింత ముందుకు తెచ్చిందన్నారు. దేశవ్యాప్తంగా సుమారు తొమ్మిది లక్షల హెక్టార్లలో విస్తరించిన8.7 లక్షల వక్ఫ్ ఆస్తులపై పెత్తనం కోసమే ఈ చట్టాన్ని తెచ్చారని విమర్శించారు.ముస్లింలను భయాందోళనలకు గురి చేయడంతోపాటువారిని ప్రధానస్రవంతినుంచి వేరు చేయడమవుతుందన్నారు.సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు శింగు నర్సింహారావు, ఎస్‌కె జానిమియా, మహ్మద్ సలాం, తాటి వెంకటేశ్వరరావు, తోట రామాంజనేయులు, బిజి క్లెమెంట్, మేకల శ్రీనివాసరావు, గాదె లక్ష్మి నారాయణ, నూనె శశిధర్, ఎస్‌కె చానా, రెహ్మాన్, తాటి నిర్మల, జ్వాలా నర్సింహారావు ఉన్నారు.




**జయశంకర్‌భూపాలపల్లిప్రతినిధి :** బిజెపి పార్టీ ముస్లిం మైనార్టీలపై కక్ష సాధింపు కోసమే వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు ఆమోదం చేసిందని వెంటనే ఆ చట్టాన్ని విరమించుకోవాలని సిపిఐజిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ డిమాండ్ చేశారు. జయశంకర్ జిల్లా భూపాలపల్లి కేంద్రంలో కృష్ణ కాలనీ మెయిన్ రోడ్డు వద్ద సిపిఐ ఆధ్వర్యంలో వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ధర్నా చేశారు.సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ముస్లిం మైనారిటీల పై కక్ష సాధింపు కోసమే వక్ఫ్ బోర్డ్ సవరణ చట్టాన్ని తెచ్చారన్నారు.ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్, నూకల చంద్రమౌళి, నేరెళ్ల జోసెఫ్, వేముల శ్రీకాంత్, యాకూబ్‌పాషా, మట్టి కృష్ణ, మేడి శేఖర్, ఎండి రజియా, ఇటుకల శ్రీలత, గడ్డం సరూప, పెద్దమాములు సంధ్య, పల్లెల రజిత, స్వప్న, నాగమణి తదితరులు పాల్గొన్నారు.




**కరీంనగర్ ప్రతినిధి:** సమానత్వం, మతాన్ని అనుసరించే స్వేచ్చకు భంగం కలిగించే రాజ్యాంగ విరుద్ధ వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని రద్దు చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం జాతీయ సమితి పిలుపు మేరకు సిపిఐ ఆధ్వర్యంలో కమాన్ చౌరస్తాలో వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, కంది రవీందర్ రెడ్డి, కిన్నెర మల్లక్క, నాయకులు సత్యం, కూన రవి, యంఏ బేబి, ఆశీనాఖాన్, సఫిన్ సుల్తానా, సాహిమ్ బేగం, రజియా, కాజా మియా, శ్రీనివాస్ పాల్గొన్నారు.



**అల్వాల్:** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జాతీయ సమితి పిలుపు మేరకు అల్వాల్ మండల పార్టీ ఆధ్వర్యంలో వర్క్ బోర్డు చట్టాన్ని రద్దు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి డిజి సాయిలుగౌడ్ డిమాండ్ చేశారు. అల్వాల్ మండలం యాప్రాల్‌లో ధర్నా రాస్తారోకో నిర్వహించారు.రైతు సంఘం కార్యదర్శి నరసింహులు, మైనార్టీ జిల్లా అధ్యక్షులు సల్మాన్ పేజ్, సిపిఐ పార్టీ అల్వాల్ మండల కార్యదర్శిసహదేవులు,సహాయ కార్యదర్శి పి.చంద్రయ్య, మల్కాజిగిరి మండల సహాయ కార్యదర్శి అశోక్, ఏఐటీయూసీనాయకులు బి.నరేంద్ర చారి, యాప్రాల్ శాఖ కార్యదర్శి వై.వెంకటేష్, గిరిజ, వెంకటరమణ, ఎండి. ఇమ్రాన్, ఎస్.కె అజీజ్, చిరంజీవి పాల్గొన్నారు.




**సుజాతనగర్:** రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగిస్తూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పాలనా సాగిస్తోందని, పార్లమెంటులో ఉన్న మందబలంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కేంద్ర సర్కారుపై ప్రజలు తిరగబడితేనే ప్రజాస్వామ్యం రక్షించబడుతుందని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా అన్నారు. కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని సుజాతనగర్ మండలం కేంద్రంలో నిరసన తెలిపారు. మానవహారం నిర్వహించారు. సాబీర్ పాషా మాట్లాడుతూ త్యాగధనుల ఆశయాలకు తూట్లు పొడుస్తూ, రాజ్యాంగాన్ని స్ఫూర్తికి విఘాతం కలిగిస్తూ బిజెపి వ్యవహరిస్తున్న తీరును ప్రజలు ఎండగట్టాల్సిన అవసరం ఉందన్నారు.సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సలిగంటి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు భూక్యా దస్రు, వాసిరెడ్డి మురళి, జి వీరాస్వామి, కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, ఎమ్‌ధనలక్ష్మి, కొమారి హన్మంతరావు, జక్కుల రాములు, కె రత్నకుమారి, తాళ్ల వెంకటేశ్వరరావు ధర్మరాజు, యూసుఫ్, నేరెళ్ల రమేష్, తాళ్లూరి పాపారావు పొదిల శ్రీనివాసరావు సిపిఐ నాయకులు,గణేష్, గోవిందు, ఉపేందర్ వీర్ల, మల్లేష్, దుర్గ బొడ్డు కేశవరావు భాగం కృష్ణ మేకల వెంకటేష్ గడ్డం రాజేందర్ రసూల్, అంకూస్, కొమారి కృష్ణ, ముక్కెర మురళి, సాపావట్ రవి, మాన్యా తదితరులు పాల్గొన్నారు.



**నిజామాబాద్‌అర్బన్ :** దేశంలో బిజెపి ప్రభుత్వం ప్రజల మధ్య మతసామరస్యాన్ని రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తు, మతతత్వ రాజకీయాలను ప్రేరేపిస్తుందని, దీంట్లో బాగంగా నూతనంగా వక్ఫ్ చట్టం తేవటాన్ని సిపిఐ పూర్తిగావ్యతిరేకిస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. శనివారం నిజామాబాద్‌లో రైల్వే స్టేషన్ ముందు నల్ల బ్యాడ్జిలతో నిరసన, వక్ఫ్ నూతన చట్ట ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం తన దుష్ట ఆలోచనలకు అనుగుణంగా టిడిపి,జెడియు ఇతర మిత్ర పక్షాల సహాయంతో పార్లమెంటు ఉభయ సభల్లో వక్ఫ్ సవరణ బిల్లు 2024 ను ఆమోదించింది. వక్ఫ్ బోర్డుకు అనుకూలంగా శ్మశానవాటికలు,మసీదులు, పాఠశాలలు, మదరసాలు, ఆసుపత్రులు, ఇతర స్వచ్ఛంద సంస్థలను నిర్వహిస్తుం ది. సిపిఐ నగర కార్యదర్శి ఓమయ్య, సిపిఐ జిల్లా నాయకులు కె. రాజన్న, పి. నర్సింగరావు, సురేష్, సాయిలు, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ఫిరోజ్ అలీ, ఇమ్రాన్ పాల్గొన్నారు.

**గజ్వేల్:** కేంద్రం తెచ్చిన వక్ఫ్ బోర్డు సవరణ చట్టానికి వ్యతిరేకంగా శనివారం గజ్వేల్‌లో సిపిఐ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బట్టు దయానంద రెడ్డి మాట్లాడుతూ నూతనంగా తెచ్చిన చట్టంతో వక్ఫ్ బోర్డ్ భూములు పూర్తిగా కేంద్రం ఆధీనంలోకి వెళ్లిపోయే ప్రమాదం ఉందని విమర్శించారు. పదేండ్లలో ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని, గ్యాస్ సిలిండర్ రేటు పెంచి పేదల నడ్డి విరిచినట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే రైతులకు మద్దతు ధర ఇస్తానని చెప్పి నల్ల చట్టాలు తెచ్చిన బిజెపి సర్కార్ అన్నదాతలకు పూర్తిగా అన్యాయం చేసిందని ఎద్దేవా చేశారు. బిజెపి సర్కార్ కు ప్రజలే బుద్ధి చెప్తారని హెచ్చరించారు. సిపిఐ గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివలింగ కృష్ణ, కౌన్సిల్ సభ్యులు స్వర్గం రాజేశం, చింత శ్రీను, కానుగుల రమణాకర్, హమాలి కార్మికులు మల్లేశం, బోల్ల సాయిలు, మొట్ట శీను, జోగు లక్ష్మణ్, సత్తయ్య, శంకరయ్య, రామచంద్ర స్వామి, పిట్ల ఎల్లం, దాసరి రాజయ్య, మెతుకు కనకయ్య, నాయకులు పాల్గొన్నారు.



## మే 17 నుండి సిపిఐ జిల్లా మహాసభలు



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** భారత దేశంలో రాజ్యాంగ పరిరక్షణకు లౌకిక తత్వాన్ని కాపాడుతూ, మతతత్వ నియంతృత శక్తులకు వ్యతిరేకించే దిశగా సిపిఐ విస్తరణ లక్ష్యంతో శాఖ మండల మహాసభలు ఏప్రిల్ నెలలో పూర్తి చేయాలని, మే నెలలో 17, 18వ తేదీల లో జిల్లా మహాసభ జరుగుతాయని మాజీ ఎమ్మెల్యే, సిపిఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి అన్నారు. శనివారం సిపిఐ జిల్లా కార్యాలయం గబ్బెట గోపాల్‌రెడ్డి భవన్‌లో రావుల సదానందం అధ్యక్షతన జరిగిన జిల్లా సమితి సమావేశంలో రాజారెడ్డి మహాసభల షెడ్యూల్‌ను వివరించారు.రాష్ట్ర సమి తి సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, చొప్పరి సోమ య్య, కావాటి యాదగిరి, జువారి రమేష్, బంటు పాండు, నీల కనకయ్య, విజయ పాల్గొన్నారు.

## 21 నుండి ఎఐటియుసి రాష్ట్ర సభలు

**ప్రజాపక్షం/జనగామప్రతినిధి:** దినదిన గండం నూరేళ్ల ఆయుష్షుగా బతుకుతున్న భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలని ఎఐటియుసిఅనుబంధ భవన నిర్మాణ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారగోని ప్రవీణ్‌కుమార్ అన్నారు. స్థానిక ఎఐటియుసి కార్యాలయంలో సంఘం జిల్లా మూడవ మహాసభలు సుద్దాల యాదగిరి అధ్యక్షతన జరిగిన సభలో ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. ఈ నెల 21, 22 తేదీలలో శంషాబాద్‌లో నాలుగవ రాష్ట్ర మహాసభలు జరుగుతాయని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే, ఎఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు సీహెచ్ రాజారెడ్డి మాట్లాడారు. జిల్లానూతనకమిటీనిఎన్నుకున్నారు.అధ్యక్షులుగా సుద్దాల యాదగిరి, ప్రదాన కార్యదర్శిగా ఆకుల శ్రీనివాస్, కోశాధికారిగా 21 మందిని ఎన్నుకున్నారు.పాతూరి సుగుణమ్మ, రావుల సదానందం, సీతారాములు,పాతూరిప్రశాంత్,రాములున్నారు.



# స్థానికం REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## కూచిపూడిలో హరితకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్



ప్రజాపక్షం/హనుమకొండటౌన్ : కూచిపూడి నృత్య ప్రదర్శనలో హన్మకొండలోని గౌతమ్ నగర్ కాలనీకి చెందిన డాక్టర్ గుంటోజు హరిత గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధించారు. భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన ప్రపంచ అతి పెద్ద కూచిపూడి నృత్య ప్రదర్శనలో ఆమె పాల్గొన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 4218 మంది నృత్య కళాకారులు పాల్గొనగా హరితకు నృత్య ప్రదర్శనలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ దక్కింది. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ లో చోటు దక్కడం పట్ల డాక్టర్ గుంటోజు హరిత సంతోషం వ్యక్తం చేశారు. భారతీయ నాట్య కళకు సేవ చేసే అవకాశం దక్కడం గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా హరితను ఆమె వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పాటుగా కాలనీవాసులు అభినందించారు.

## అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలి

హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పిలుపు



ప్రజాపక్షం/హనుమకొండ : భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ 134వ జయంతిని జిల్లాలో ఘనంగా నిర్వహించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పిలుపునిచ్చారు. శనివారం హనుమకొండ కలెక్టర్ కార్యాలయంలో అంబేద్కర్ 134 వ జయంతి సభ గోడ పత్రికలను జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ,అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, తదితరులు ఆవిష్కరించారు. కమిటీ చైర్మన్ అంకేశ్వరపు రాంచందర్ రావు, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పుట్ట రవి, చుంచు రాజేందర్, యంఆర్పిఎస్ జిల్లా అధ్యక్షులు, కమిటీ వైస్ చైర్మన్ గద్దల సుకుమార్ మాదిగ, యంఎస్పి జిల్లా అధ్యక్షులు,కమిటీ వైస్ చైర్మన్ బండారి సురేందర్‌లు మాట్లాడుతూ హనుమకొండ పట్టణ సెంటర్ లోని అంబేద్కర్ విగ్రహానికి ఉదయం 8:30 గంటలకు పూలమాలాంకరణ, అనంతరం అంబేద్కర్ భవన్‌లో ఉదయం 9:00 గంటలకు జయంతి సభ నిర్వహించడం జరుగుతుందని జిల్లాలోని ప్రజలు, ప్రజాసంఘాలు,విద్యార్థి సంఘాల నాయకులు,కుల సంఘాల నాయకులు, ప్రజాస్వామికవాదులు, విద్యార్థులు, మేధావులు, మహిళలు,కార్మికులు,కర్షకులు,అధికారులు సకాలంలో హాజరై జయంతిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సోషల్ వెల్ఫేర్ డిడి శ్రీలత,అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## వేగవంతంగా నేషనల్ హైవే భూసేకరణ

జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి : నేషనల్ హైవే భూ సేకరణ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. జిల్లాలో జాతీయ రహదారి 163జి భూ సేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లాలోని సంగెం, పర్వతగిరి, గీసుగొండ, నెక్కొండ మండలాల్లోని గ్రామాల్లో 38.20 కిలో మీటర్ల మేర గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే కోసం చేపట్టిన భూ సేకరణ ప్రక్రియ పురోగతిపై ఆదనవు సంధ్యారాణి, డి ఆర్ ఓ విజయలక్ష్మి ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎంహెచ్ఏఐ. దివ్య, ఆర్‌డిఒలు సత్యపాల్ రెడ్డి, ఉమారాణిలతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో పర్యవేక్షకులు శ్రీకాంత్ జాతీయ రహదారుల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల పరిశీలనలో బిఆర్ఎస్ సభ అనుమతి

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ : బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు సంబంధించి నెల 27న ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో బిఆర్ఎస్ నిర్వహించనున్న సభ నిర్వహణకు అనుమతి కోరుతూ సభా నిర్వహకులు గత నెల మార్చ్28న వరంగల్ కమిషనరేట్ పోలీసులకు దరఖాస్తు చేసుకున్నారని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్‌సింగ్ తెలిపారు. అదే రోజు భద్రత ఏర్పాట్లతో పాటు, ట్రాఫిక్ సమస్యలను నివారించేందుకు, సభకు ఎంతమంది హాజరవుతారు, ఏఏ ప్రాంతాలను నుండి తరలి వస్తారు, ఎన్ని వాహనాలు వస్తాయి, వాహన పార్కింగ్ స్థలాల ఏర్పాట్లు, సభ జరిగే ప్రాంతం విస్తీర్ణంకు సంబంధించిన వివరాలను సమర్పించాల్సిందిగా నిర్దిష్టమైన ఫార్మాట్‌ను పోలీస్ అధికారులు బిఆర్ఎస్ నాయకులకు అందజేయడం జరిగిందని, కానీ బిఆర్ఎస్ పార్టీ నాయకులు వరంగల్ పోలీస్ శాఖ అడిగిన సమచారాన్ని ఇవ్వకుండా, వరంగల్ సభకు అను మతి ఇవాల్సిందిగా కోరుతూ బిఆర్ఎస్ నాయకత్వం 9వ తేదిన హైకోర్టులో దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు.వరంగల్ పోలీస్‌శాఖ కోరిన సమాచారాన్ని బిఆర్ఎస్ నాయకులు 10వ తేది అర్ధరాత్రి 12 గంటలకు ( తెల్లవారితే 11వ తారీకు) వరంగల్ కమిషనరేట్ పోలీసులకు అందజేయడం జరిగిందని, బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ అనుమతి కొరకు చేసుకున్న దరఖాస్తు ప్రస్తుతం పరిశీలనలో వుందని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు.

## బంజారాల అభివృద్ధికి ఉద్యమం

ఎఐబిఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు రాములు నాయక్



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : బంజారా సమాజం అభివృద్ధి కోసం సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు ఐక్యంగా ఉద్యమించాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఇల్లంద క్లబ్ హౌస్‌లో జరిగిన జిల్లా బంజారా ఆత్మీయ సమ్మేళనానికి ఎస్టీ సెల్ జిల్లా చైర్మన్ పోరిక సమ్మయ్య నా యక్ అధ్యక్షత వహించగా రాములు నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా బంజారా సమాజ అభివృద్ధి, సౌభ్రాతృత్వం, సమాజాన్ని ముందుకు తీసుకెళ్లే అంశాలపై, సమాజానికి ప్రాధాన్యం ఉన్న అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలోని బంజారా నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. బంజారా యువతకు మెరుగైన విద్యా అవకాశాలు, నైపుణ్య శిక్షణ అందించడం ద్వారా ఆర్థికంగా సామాజికంగా ఎదుగుతారన్నారు. బంజారా సమాజానికి రాజకీయ ప్రాతినిధ్యం కేంద్ర, రాష్ట్ర స్థాయిలో మరింత ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. అనంతరం భవిష్యత్తు కార్యాచరణపై కీలక నిర్ణయాలు, సమాజ అభ్యున్నతికి అవసరమైన చర్యలను ప్రకటించారు. ఈ కార్యక్రమం లో ఇస్లావత్ దేవన్, కేతవత్ వినయ్ కుమార్, అజ్మీర జంపన్న, గుగులోత్ సంతోష్, భూక్య సురేష్, బానోత్ కిషన్, అజ్మీర రఘురామ్, అజ్మీర రాజు నాయక్, సభవత్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులకు అందని..కార్పొరేట్ వైద్యం

హైదరాబాదులో హాస్పిటల్ ఏర్పాటు చేయాలి

కార్మికుల 40 శాతం వైద్య ఖర్చులను రికవర్ చేయడం సరికాదు

సొంతింటి పథకం అమలుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు

ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి సింగరేణి కార్మికులకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు హైదరాబాదులో ప్రత్యేక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఏర్పాటు చేసేందుకు ఒప్పుకున్నందుకు యాజమాన్యానికి సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు. శనివారం భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని ఏఐటియుసి కొమురయ్య భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొరిమి రాజ్ కుమార్ మాట్లాడుతూ శనివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఎఐటియుసి కొమురయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 100కోట్లతో హైదరాబాదులో సూపర్ స్పెషాలిటీ హాస్పటల్‌ను ఏర్పాటు చేస్తే కార్మికులకు సులువుగా నాణ్యమైన కార్పొరేట్ స్థాయి వైద్యం అందుతుందన్నారు. ఈ విషయంపై ఎఐటియుసి గుర్తింపు సంఘంగా యాజమాన్యం, ప్రభుత్వం దృష్టికి జరిగిందని, త్వరలోనే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. రిటైర్మెంట్ కార్మికులకు వైద్య ఖర్చుల కోసం 40 శా తం ఖర్చుల నిమిత్తం రికవరీ చేయడం సరైనది కాదని, రిటర్మెంట్ కార్మికులకు బిపి షుగర్ మం దులను వారు ఎక్కడైతే ఉంటున్నారో ఆ ఏరియాలోనే మందులు అందజేసే విధంగా చేయాలని యాజమాన్యాన్ని కోరినట్లు తెలిపారు. కార్మికుల సొంతింటి అమలు కోసం స్ట్రక్చర్ మీటింగులో చర్చించడం జరిగిందని, 250 గజాల స్థలం ఇవ్వాలా లేదా సింగరేణి క్వార్టర్ కేటాయించాలనే అంశంపై కమిటీ వేయడం జరిగిందని త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. జనరల్ మజ్దూర్, బదిలీ వర్కర్స్ పేరు మార్చాలని కోరడం జరిగిందని దీంతో 16, 000 మంది కార్మికుల డిసిగ్నేషన్ మారబోతుందన్నారు. కార్మికుల పిల్లలకు మెరిట్ స్కాలర్షిప్ ఇవ్వటం కోసం 16 వేల నిర్ణయించడం జరిగిందని, డిస్మిస్ కార్మికుల ఉద్యోగాల విషయంలో మాట్లాడటం జరిగిందని, ఇప్పటివరకు గుర్తింపు సంఘంగా స్ట్రక్చర్ మీటింగ్లో చర్చించిన అనేక సమస్య లు త్వరలోనే పరిష్కారం కాబోతు న్నాయని రాజ్ కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో ఎఐటియు సి బ్రాంచ్‌వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, బ్రాంచ్ అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ గురింజ పెల్లి సు ధాకర్‌రెడ్డి, కాంట్రాక్ట్ కార్మికుల ఇన్‌చార్జి నూకల చంద్రమౌళి, గణేష్, వెంకట స్వామి తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించింది బీఆర్ఎస్సే

స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి: పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిందే బిఆర్ఎస్సే అని స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్ఎంఆర్ గార్డెన్ లో ఏర్పాటుచేసిన మీడియా సమా వేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరై మాట్లాడుతూ పల్లా రాజే శ్వర్‌రెడ్డి చేస్తున్న ఆరోపణలను, విమర్శలను ఖండిస్తున్నానన్నారు. ప్రస్తు తం పార్టీ ఫిరాయింపుల విషయం కోర్టు పరిధిలో ఉందని సుప్రీం కోర్టు తీ ర్పుకు కట్టుబడి ఉంటానన్నారు. 10 ఏళ్ల బిఆర్ఎస్ పాలనలో 36 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారి బీఆర్ఎస్‌లో చేరారన్నారు. ఈ విషయం రాజే శ్వర్‌రెడ్డికి తెలియదా అని మండిపడ్డారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్స హించిందే బీఆర్ఎస్ అని, మీకు ఒక చట్టం, వేరే వాళ్లకు ఒక చట్టమా అని ప్రశ్నించారు. పార్టీ ఫిరాయింపులపై మాట్లాడే నైతిక హక్కు బిఆర్ఎస్ పార్టీకి లేదన్నారు. దేవునూరు అటవీ భూములలో ఒక గుంట భూమి కబ్జా చేసినా, నా రాజకీయ జీవితంలో ఒక ఎకరం బినామీ పేరుతో పట్టా చేయించినట్లు నిరూపిస్తే నీ ఇంట్లో గులాం గిరి చేస్తానని లేకుంటు నువ్వు నా ఇంట్లో గులాంగిరి చేయాలన్నారు. నా ఎజెండా అంతా నియోజకవర్గ అభివృద్ధి మాత్రమే నని, ప్రజల ప్రేమే తన ఆస్తి అన్నారు. ఈ సమా వేశంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మాజీ జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, కోళ్ల రవి, లింగాల జయచంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# హామీలు విడతల వారీగా అమలు

పేదల కోసం పలు పథకాల అమలు

రూ.33కోట్లతో చేపట్టిన రోడ్ల పనులను ప్రారంభించిన మంత్రి సీతక్క



ప్రజాపక్షం/ములుగుప్రతినిధి : ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు తాను ములుగు నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను విడతల వారీగా అమలు చేస్తున్నామని, రాష్ట్రంలోని పేద ప్రజల అభిప్రాయం మేరకే ప్రజా ప్రభుత్వం పలు పథకాలను ప్రవేశపె డుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ సీతక్క అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవిచందర్‌తో కలిసి మండలంలోని జంగాలపల్లి గ్రామం నుండి జగ్గన్నగూడెం గ్రామం వరకు రూ.33లతో చేపట్టిన అంతర్గత సిసి రోడ్డు, డ్రైయినేజీ పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా రాయినిగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అనేక సంవత్సరాలుగా లోతట్టు ఏజెన్సీ గ్రామాల ప్రజలు రోడ్డు సౌకర్యం కల్పించాలని పాలకులకు మొరపెట్టుకున్నప్పటికి గత పది సంవత్సరాల బిఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని, గ్రామాలలో రోడ్లు పనులే కాకుండా జంగాలపల్లి గ్రామం నుండి జగ్గన్నగూడెం గ్రామం వరకు చేపట్టిన ప్రధాన రోడ్డు పనులు చివరి దశలో ఉన్నాయని అన్నారు. జగ్గన్నగూడెం వద్ద గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో లోవల్ బ్రిడ్జి నిర్మించిందని అయినప్పటికి ఏజెన్సీ గ్రామాల ప్రజల ఇబ్బందులను గుర్తించి ఐదు కోట్లలతో హైలెవెల్ బ్రిడ్జి నిర్మించడం జరుగుతుందని తెలిపారు. ఏజెన్సీ గ్రామాలలోని ప్రజలకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వారంలోగా చేపట్టడం జరుగుతుందని లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రానున్న రోజులలో ములుగు నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు ఎంఆర్ఓ విజయ భాస్కర్, పంచాయతీరాజ్ ఈఈ అజయ్‌కుమార్, ఆయా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## పేదల కడుపు నింపేలా ప్రభుత్వ పాలన

లబ్ధిదారుడి ఇంటిలో భోజనం చేసిన మంత్రి కొండా సురేఖ



ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి : రాష్ట్రంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ఊహించని స్పందన వస్తుందని అటవీ పర్యా వ రణ దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. వరంగల్ తూర్పు నియోజక వర్గంలో 12వ డివిజన్ దేశాయిపేటలోని రేషన్ కార్డు లబ్ధిదారుడు పూర్ణచందర్ ఇంటికి భోజ నా నికి ఆహ్వానించగా వారి ఇంటికి మంత్రి కొండా సురేఖ, జిల్లా కలెక్టర్ సత్యశారద, జిడబ్ల్యు కమి షనర్ అశ్వినీతానాజీ వాకాడే పాల్గొన్నారు. అనం తరం వారి కుటుంబంతో సహపంక్తి భోజనం చేశారు. రేషన్ కార్డులో వచ్చిన సన్నబియాన్ని లబ్ధి దారులు వంట చేసి వడ్డించారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అంటే పేదల కష్టాలు తీర్చే పార్టీ అని ప్రభుత్వం ఇచ్చే సన్న బియ్యంతో భోజనం చేయడం సంతోషాన్ని కలిగించిందని మంత్రి కొండా సురేఖ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నంతవరకు సన్న బియ్యం పంపిణీ కొనసాగుతుందని సన్న బియ్యం పంపిణీ దేశ చరిత్రలో వెలిగిపోతుందని తెలిపారు. ప్రజలను ఆదుకుంటూ సన్న బియ్యం, గృహజ్యోతి, మహిళలకు ఉచిత రవాణా సౌకర్యం ,500 గ్యాస్ సిలిండర్ లాంటి పథకాల ద్వారా ఒక్కో రేషన్ కార్డ్ లబ్ధిదారులకు నెలకు రూ.2,500 ఆదా జరుగుతుందని తెలిపారు.

## 25 ఏండ్ల ఉత్సవాలు టిఆర్ఎస్‌కా..బిఆర్ఎస్‌కా ?

వరంగల్ పశ్చిమ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి



ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి : 25 ఏండ్ల ఉత్సవాలు టిఆర్ఎస్‌కా. బిఆర్ఎస్ పార్టీకా ? అని వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ప్రశ్నించారు. శనివారం హన్మకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు బిఆర్ఎస్‌కు దిమ్మ తిరిగే షాక్ ఇచ్చిన ఇంకా సరిపోలేదా? అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజలకు ఏం చేసారని ఈ రజతోత్సవ సభ పెట్టుకుంటున్నారని, బిఆర్ఎ ప్రజలకు గత 25 సంవత్సరాలుగా మోసం చేసినందుకు రజతోత్సవ సభ జరుపుకుంటున్నారా ? అని ప్రశ్నించారు. తెలంగాణా ఇస్తే టిఆర్ఎస్ పార్టీ ని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేస్తానని మాట తప్పి మోసం చేశారని, దళితున్ని ముఖ్యమంత్రిని చేస్తానని మోసం చేశారని,దళితులకు 3 ఎకరాల భూమి,ఇంటికో ఉద్యోగం, ఇలా పలు రకాల హామీలు ఇచ్చి అధికారంలోకి రాగానే మోస్తం చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీపై ఎలా దుమ్మేతిపోయాలి..కాంగ్రెస్‌పై ఎట్లా దుష్ప్రచారం చేయాలా..అనేదే బిఆర్ఎస్ కాన్సెప్ట్ అని అందుకే మరోసారి పాతికేళ్ల సభ పేరుతో ప్రజలను మభ్య పెట్టేందుకు వస్తున్నారని, ప్రజలు ఎవరూ నమ్మే స్తితిలో లేరన్నారు.ఈ కార్యక్రమంలో ఎం.పి. కడియం కావ్య, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులూ బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, వేముల శ్రీనివాస్, మామిండ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం

రైతులు పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తాం

వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు

కలెక్టర్ సత్య శారద





ప్రజాపక్షం/వర్ధన్నపేట:రైతులు క్షేమంగా ఉండాలి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలనే ఉద్దేశ్య ంతో రాష్ట్ర ప్రభుత్వం సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ అందిస్తుందని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తెలిపారు. వర్ధన్నపేట మండల పరిధిలోని ఇల్లంద వ్యవసాయ మార్కెట్ నందు ఐకెపి వారి ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద , అదనపు కలెక్టర్ సంధ్యారాణిలతో కలి సి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ రైతులకు రైతు భరోసా అందిస్తూ సన్న వడ్లకు మార్కెట్ ధరతో పాటు 500ల బోనస్ అందిస్తున్న దేశంలోనే ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం అని తెలిపారు. రైతులకు నష్టం కలగకుండా, కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు చూసుకోవాలన్నారు. రెండు రకాల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి దొడ్డు రకం, సన్న రకం వడ్లను వేరు వేరుగా కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి సమస్యలు వచ్చినా వెంటనే అధికారుల దృష్టికి తీసుకువెళ్ళాని, రైతులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూసుకోవలని సూచించారు.జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రా లకు వచ్చే రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, డిఆర్డీఓ కౌసల్యాదేవి, డిఎం సివిల్ సప్లైస్ సంధ్యారాణి, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, వ్యవసాయ శాఖ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు..


### జైబాపు–జై–భీమ్,జైసంవిదాన్ నినాదంతో ఉద్యమిద్దామంచాలి

ప్రజాపక్షం/కాజీపేట : పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగాన్ని బిజెపి అనగదొక్కాలని చూస్తుందని,రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆలోచనలను కాపాడుకుంటూ జై బాపు,జై భీమ్,జై సంవిదాన్ నినాదంతో ఉద్యమిద్దామని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. రాజ్యాంగ పరిరక్షణలో భాగంగా జై బాపు,జై భీమ్,జై సంవిధాన్ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళాలనే ఉద్దేశంతో జాతీయ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు లోక్ సభ ప్రతిపక్ష నేత రాహూల్ గాంధీ, జాతీయ పార్టీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు కాజీపేట మండల పరిధిలోని మడికొండ గ్రామంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఇన్‌చార్జిగా గిడ్డంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వర్ రావుతోపాల్గొన్నారు. బాపూజీ, డాక్టర్ అంబేద్కర్, భారత రాజ్యాంగం చిత్రపటాలను చేతిలో పట్టుకొని ర్యాలీ నిర్వహించారు.గ్రామ ప్రజలకు మహనీయుల గురించి,రాజ్యాంగం గురించి వివరించి వాటి విలువలను తెలియజేసారు. అనంతరం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మా ల వేసి కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నాగరాజు ప్రారంభించారు. సీఎం రేవంత్ రెడ్డి ఒకవైపు సంక్షేమం,మరోవైపు అభివృద్ధిని చేస్తున్నారని, మన గ్రామాలలో కూడా ఎక్కడ ఏ సమస్య ఉన్న నా దృష్టికి తీసుకొని వస్తే తప్పకుండా అధికారులతో, మంత్రులతో మాట్లాడి సమస్యను పరిష్కారం చేస్తానని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తెలిపారు.

**మడికొండ డంపింగ్ యార్డ్ మార్చే వరకు అండగా ఉంటా:** మడికొండ డంపింగ్ యార్డ్ మార్చే అంతవరకు మీకు అండగా ఉంటూ నా సహాయ శక్తుల కృషి చేస్తానని గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో ఏఐసిసి ఎస్సీ సెల్ కోఆర్డినేటర్ పులి అనిల్ కుమార్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిలి వెంకట్రావు నరసిం హా రెడ్డి, మడికొండ ఇన్చార్జి కందుకూరి పూర్ణచందర్, మెట్టుగుట్ట ఆలయ చైర్మన్ పైడిపాల రఘు చందర్, రామాలయ చైర్మన్ అర్జున్‌లు పాల్గొన్నారు.

# విద్య, వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



ప్రజాపక్షం/రేగొండ: విద్య వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనా రాయణరావు అన్నారు. ఉమ్మడి రేగొండ, కొత్తపల్లిగోరి మండలంలో రూ.125 లక్షలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు అదే విధంగా 60 లక్షలతో చిన్నకోడెపాకలో జీపీ బిల్డింగ్, పల్లె దవాఖానాను, తిరుమలగిరి గ్రామంలో పల్లె దావఖానలు ప్రారంభించారు. అనంతరం కొత్త పల్లిగోరి మండల కేంద్రంలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజ్యాంగాన్ని పరిరక్షించు కోవాలని గ్రామ స్తులతో కలిసి ప్రతిజ్ఞ చేసిన ఎమ్మెల్యే గండ్ర మాట్లాడారు. శనివారం భూపాలపల్లి నియోజకవర్గం కొత్తపల్లిగోరి మండలంలోని దామరంచపల్లి, చిన్నకోడెపాక, విజ్జయ్యపల్లి, కొత్తపల్లిగోరి, నిజాంపల్లి గ్రామాలల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఆయా గ్రామాలల్లో సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు స్థానిక కాంగ్రెస్ నేతలు,వివిధ శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. కొత్తపల్లిగోరి మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్ నుండి మజీద్ వరకు రేగొండ ఉమ్మడి మండల అధ్యక్షుడు నర్సయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన జైబాపూ, జైభీమ్, జైసంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పాదయాత్ర అనంతరం మజీద్ సెంటర్‌లో బాపూజీ, అంబేద్కర్, రాజ్యాంగ పీఠిక చిత్రపటా లకు ఎమ్మెల్యే పూలమాల వేశారు. అనంతరం అక్కడున్న ప్రజలతో ఎమ్మెల్యే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియో జకవర్గంలో నూతనంగా ఏర్పాటైన కొత్తపల్లిగోరి మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే అన్నా రు. ఈ యాత్రలో ఎమ్మెల్యే వెంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుటోజు కిష్టయ్య, పిఏసిఎస్ చైర్మన్ నడిపెల్లి విజన్ రావు, అధికారులు జయశంకర్ జిల్లా ప్రభుత్వ వైద్యాధికారి మధుసూదన్ రావు, రేగొండ వైద్యాధికారిని మా బిందు, పిఆర్‌డిఇ, ఏఈలు, ఎస్ఎస్ఆర్ గ్రూపు సంస్థల అధినేత నాయినేని సంపత్ రావు, క్యాతం సదయ్య, బొజ్జం రవి, పట్టం శంకర్, కొలెపాక సాంబయ్య, ముడతనపల్లి శంకరయ్య, మాచర్ల పోచయ్య వీరబ్రహ్మం, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఫోరం వీరేందర్, సీనియర్ నాయకులు, తోకల సురేందర్ రెడ్డి, కనకం రమేష్, మొట్టె కిరణ్ పటేల్ లు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు ఉన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన ఎమ్మెల్యే డా.మట్టా



**ప్రజాపక్షం/సత్తుపల్లి:**పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని శనివారం సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి శనివారం తనిఖీ చేశారు. అనంతరం హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ సమావేశంలో పాల్గొని, ఆసుపత్రిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పలు సమస్యలపై చర్చించారు. ఆసుపత్రి పరిశుభ్రత, డాక్టర్స్, సిబ్బంది వివరాలు, ఇన్, ఔట్ పేషంట్స్ వివరాలను అడిగి తెలుసుకుని, రికార్డ్స్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి లో ఇన్ పె షేంట్ లకు అందించే భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డెవలప్మెంట్ కమిటీ సభ్యులు ,సీనియర్ నాయకులు ,ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగంపై వక్ఫ్ బిల్లుతో బిజెపి దాడి
### సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు



**ప్రజాపక్షం/బోనకల్:**రాజ్యాంగంపై వక్ఫ్ బిల్లుతో బిజెపి దాడి చేసిందని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు విమర్శించారు. సిపిఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా వైరామధిర ప్రధాన రహదారి కూడలిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసన కార్యక్రమం శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లుకు పార్లమెంటు ఉభయ సభల ఆమోదం ద్వారా బిజెపి తన మతోన్మాద మత పరమైన విభజన ఎజెండాను తీసుకువచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు మాతంగి శ్రీనివాసరావు, చావా రామకృష్ణ, యంగల పెద్ద రమేష్, మసీదు కమిటీ అధ్యక్షులు షేక్ నిజాం, మతపెద్దలు షేక్ అబ్బాస్‌మియా, షేక్ గౌడంజాను, సుభాని, పెంటుసాహెబ్, తోటపల్లి సాల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి ద్వారా తాగునీరు అందించాలని ఏరియా జిఎంకు వినతి



**ప్రజాపక్షం/ఇల్లెందు:** సిఎస్‌పిబస్తీ శివారు దేవులపల్లి యాకయ్య నగర్ గుడిసెవాసులు సింగరేణి ద్వారా తాగునీరు సరఫరా, సోలార్ దీపాలుఏర్పాటు చేయాలని శనివారం ఏరియా జీఎం కార్యాలయం ఎదుట ధర్నానిర్వహించి అనంతరం ఏరియా జిఎం వి.కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు .కార్యక్రమంలో సిపిఎం నాయకులు గుడిసెవాసులు తదితరులు పాల్గొన్నారు.

## 9 మంది ఎస్ఐలు బదిలీలు

**ప్రజాపక్షం/భద్రాచలం:** జిల్లాలో 9 మంది ఎస్సైలకు స్థాన చలం కలిగింది. ఈ మేరకు ఎస్పి రోహిత్ రాజ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. విఆర్ విభాగంలో ఉండే జి స్వప్న భద్రాచలం ఎస్సై గా, భద్రాచలం మహిళా ఎస్సై విజయలక్ష్మిని కొత్తగూడెం విఆర్ విభాగానికి, విఆర్‌లో ఉండే పి సురేష్‌ను ఐటి కోర్ జిల్లాకు, విఆర్‌లో ఉండే ఇ రజితిష్‌ను ఓఎస్‌డి ఆఫీస్‌కు, విఆర్‌లో ఉండే బి రాణా ప్రతాప్‌ను ఓఎస్‌డి ఆఫీస్‌కు, ఇల్లెందు ఎస్సైగా పనిచేసే కొత్తగూడెం విఆర్ విభాగానికి, విఆర్‌లో ఉండే పి శ్రీనివాస్‌రెడ్డిని ఇల్లెందు ఎస్సైగా, ఐటికోర్ విభాగానికి చెందిన శ్రావణ కుమార్‌ను భద్రాచలం ఎస్సై 2 గా, విఆర్‌లో ఉండే బి కిషోర్‌ను కొత్తగూడెం 2 టౌన్ ఎస్సైగా బదిలీ చేశారు. ఈ మేరకు వీరు విధుల్లో చేరనున్నారు. జిల్లాలో పోలీసులపై ఏసిబి దాడులు జరుగుతున్న నేపథ్యంలో ఎస్పి కేవలం అతి కొద్దిరోజుల వ్యవధిలోనే బదిలీలకు పూనుకోవడం గమనార్హం.

## వనజీవి రామయ్యకు ఉపాధి కూలీల నివాళి



**ప్రజాపక్షం/చండ్రుగొండ:**మండల పరిధిలోని గుర్రంగూడెం గ్రామంలో ఉపాధి హామీ పథకం కూలీలు శనివారం వనజీవి రామయ్య మృతికి ఘనంగా నివాళులర్పించారు. గుర్రంగూడెం గ్రామంలో అటవీ ప్రాంతంలో ఉపాధి హామీ పథకం పనులు చేసే పని ప్రదేశంలో చెట్ల వద్ద వనజీవి రామయ్యను గుర్తు చేసుకున్నారు. ఈసందర్భంగా గ్రామస్తులు ఆయన నాటిని మొక్కలు, వనాల గురించి చర్చించుకున్నారు. ఈకార్యక్రమంలో గ్రామస్తులు, ఉపాధి హామీ పథకం కూలీలు పాల్గొన్నారు.

## రైస్ పుల్లింగ్ ముఠా అరెస్టు
### అప్రమత్తంగా ఉండాలి;ఎస్ఐ ఇ. రాజేష్



**ప్రజాపక్షం/బూర్గంపాడు:**రైస్ పుల్లింగ్ ముఠా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బూర్గంపాడు ఎస్ఐ ఈ రాజేష్ అన్నారు. శనివారం మధ్యాహ్నం 12గంటల సమయంలో బూర్గంపాడు ఎస్ఐ ఈ రాజేష్ తన సిబ్బందితో కలిసి సారపాక సెంటర్ వద్ద పెట్రోలింగ్ నిర్వహించారు. ఈక్రమంలో ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనబడగా వారిని పట్టుకొని విచారించారు. పోలీసుల విచారణలో ముద్దాయిలు దొనకొండ సురేష్ మారుతీ నగర్ పాల్వంచ, ఎస్‌కే రహీం భద్రాచలం, ఊర్ల శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మా వద్ద రైస్ పుల్లింగ్ మిషన్ ఉన్నదని వేరే వ్యక్తులను నమ్మించి వారి వద్ద నుండి డబ్బులు తీసుకొని మోసం చేస్తూ ఉంటామని, అదే విధంగా చర్ల మండలంకు చెందిన కొమరం రాజబాబు బతిన పల్లి గ్రామం అనే వ్యక్తిని రైస్ పుల్లింగ్ మిషన్ ఉన్నదని నమ్మించామని, అతని వద్ద నుండి లక్ష రూపాయలు తీసుకోవడం జరిగిందని, అతను రైస్ పులింగ్ మిషన్ ఇవ్వమని అడుగుతుండా మరల లక్ష రూపాయలు తీసుకొని బూర్గంపాడు మండలంలోని మణుగూరు క్రాస్ రోడ్ వద్దకు 25 జనవరి 2025 సాయంత్రం నాలుగున్నర గంటల సమయంలో రమ్మనగా అతను వచ్చిన తర్వాత అతనని కొట్టి అతని చేతులో ఉన్న లక్ష రూపాయలు బలవంతంగా గుంజుకొని బ్రీజా కారులో మేము, జంగారెడ్డిగూడెంకు చెందిన నారాయణతో కలిసి వెళ్లిపోయామని, భద్రాచలంలో ఇంకా ఎవరైనా అమాక వ్యక్తులకు రైస్ పుల్లింగ్ మిషన్ గురించి చెప్పి వారిని నమ్మించి, డబ్బులు తీసుకుందామనే ఉద్దేశంతో భద్రాచలం వెళ్తుండగా సారపాక సెంటర్ వద్దకు పట్టుకోవడం జరిగిందన్నారు. ఈసందర్భంగా ఎస్ఐ ఈ రాజేష్ మాట్లాడుతూ ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. పరారీలో నారాయణ జంగారెడ్డిగూడెంకి చెందిన వ్యక్తి ఉన్నాడని అన్నారు. పట్టుబడిన వీరి వద్ద నుండి రూ 1,90,000నగదును, మూడు ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ విధంగా రైస్ పుల్లింగ్ మిషన్, గుప్త నిధులు ఉన్నాయని, దొంగ నోట్లు మార్చిడి చేస్తామని అనే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మోసపోవద్దని తెలిపారు. అలాంటి వ్యక్తుల గురించి సమాచారం తెలిసినచో వెంటనే పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని తెలిపారు.

# వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని రద్దు చేయాలి:కల్లూరి



**ప్రజాపక్షం/చర్ల:**మైనార్టీలను అభద్రతా భావానికి గురయ్యేలా కేంద్ర ప్రభుత్వం చేస్తోందని, వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు, భద్రాచలం డివిజన్ కార్యదర్శి కల్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. ఈమేరకు శనివారం స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ దోరణి రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగించేదిలా ఉందన్నారు. 370 ఆర్టికల్ రద్దు, ట్రిపుల్ తలాక్ రద్దు, వక్ఫ్‌బోర్డు సవరణ సవరణ చట్టం రద్దు వంటి విషయాల్లో కేంద్ర ఏకపక్షంగా వ్యవహరిస్తోందన్నారు. దేశంలో స్వేచ్ఛా, ప్రజా స్వామ్యం ప్రమాదంలో పడ్డాయని, ప్రశ్నించిన వారిపై అక్రమకేసులు బనాయిస్తూ నిర్బంధాలకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. మోడి సర్కార్ అధికారం కోసం కుల మతాలను అడ్డుపెట్టుకుని ప్రజల ఐఖ్యతను విచ్ఛిన్నం చేస్తున్నారని మండిపడ్డారు. సిబిఐ, ఇడి, ఎన్నికల కమీషన్ వంటి వాటి రాజ్యాంగ సంస్థలను దుర్వినియోగపరుస్తున్నారని, ప్రతిపక్షాలను లొంగదీసుకునేందుకు ఉపయోగిస్తున్నారన్నారు. రాష్ట్రాల పాలనలో గవర్నర్ జోక్యంపెరిగి ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. 11 ఏళ్ల పాలనలో కొత్తఉద్యోగాలు ఇవ్వకపోగా ఉన్న ఉద్యోగాలను తీసేస్తున్నారన్నారు. దళితులు, ఆదివాసీలు, బలహీన వర్గాలపై దాడులు, మహిళలపై లైంగిక దాడులు, మైనార్టీలపై దాడులు, జరుగుతున్నాయని చెప్పారు. దేశసహజ వనరులను ప్రభుత్వ రంగ సంస్థలను కార్పోరేట్లకు కారుచౌకగా కట్టబెడుతున్నారని, రైతాంగ సమస్యలు పరిష్కరించకుండా చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానం పేరుతో కొత్తచట్టాన్ని తెస్తున్నారని, విద్యాకార్పోరేట్, కాషాయికరణ దశగా చేస్తున్నారని, పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాసి నాలుగు లేబర్ కోడ్లు తెచ్చి కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు , తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగాన్ని ధిక్కరించే వారికి దేశంలో ఉండే హక్కు లేదు
### ఎంఎల్ఏ జారే ఆదినారాయణ



**ప్రజాపక్షం/అన్నపురెడ్డి-పల్లి:**భారత రాజ్యాంగాన్ని ధిక్కరించే వారికి దేశంలో ఉండే హక్కు లేదని ఎంఎల్ఏ జారే ఆదినారాయణ అన్నారు. శనివారం మండల కేంద్రంలో రా జ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమంలో భా గంగా అన్నపురెడ్డిపల్లి కాంగ్రెస్ పార్టీ మండల కమిటి ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు వనమా గాంధీ అధ్యక్షతన మండల కేంద్రంలో జై బాపు, జై భీమ్, జూ సంవిధాన్ అభియాన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడు తూ జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమం జాతీయ కాం గ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న గొప్ప కార్యక్రమని, దేశంలో బిజెపి ప్ర భుత్వం భారత రాజ్యాంగాన్ని అవమానిస్తూ వ్యవస్థలన్నింటిని నిర్వీర్యం చే స్తూ అ ప్రజాస్వామిక నిర్ణయాలు తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని, రాజ్యాంగాన్ని ధిక్కరించే వారు ఎవరైనా సరే భారతదేశంలో ఉండే హక్కు వారికి లేదని ప్రతి ఒక్క కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఈ కా ర్యక్రమంలో పాల్గొని పార్టీ ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తుల, గ్రామ శాఖ అధ్యక్షులు, ఉ పాధ్యక్షులు, కార్యదర్శులు, మహిళా కాంగ్రెస్, ఎస్సీ, బీసీ, ఎస్టీ, కిసాన్, మై నార్టీ సెల్ నాయకులు, యూత్ కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీ సేవా దళ్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ తదితరులు పాల్గొన్నారు.

## ఏదులాపురంలో మైక్రో ఫైనాన్స్ వేధింపులు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని ఏదులాపురం గ్రామంలో గల ఎస్‌సీ కాలనీ మహిళలపై మైక్రో ఫైనాన్స్ సిబ్బంది వేధింపులకు పాల్పడిన ఘటన శనివారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం...ఓ మైక్రో ఫైనాన్స్ సంస్థ ఎటువంటి సెక్యూరిటీ లేకుండా..కేవలం ఆధార్‌కార్డ్, ఓటర్ ఐడి ద్వారా కళావతి, చిలుముల అరుణ, నవిళ్ల ధనలక్ష్మి కి రూ.50వేల చొప్పున అప్పుగా ఇచ్చారు. ఇందులో బీమా, పాసెసింగ్ ఫీజు పేరిట రూ.2వేలు ముందే కోత పెట్టారు. దీనికి గాను కట్టవలసి ఒక నెల ఈఎంఐ అమౌంట్ 2వేల670 రూపాయలను సదరు నిరుపేదలు కట్టలేకపోయారు. ఈ నేపథ్యంలో సదరు మైక్రో ఫైనాన్స్ సిబ్బంది, మేనేజర్ ఆ మహిళలను డబ్బులు కట్టాలని ఇంటి ఎదుట బైఠాయించారు. కనీసం వారిని మంచినీళ్లు కూడా తాగనీయకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేశారు. అక్కడితో ఆగకుండా వారికి ఉన్న గుడిసెలను సైతం తాలం వేసి స్వాధీనపరుచుకుంటామని భయభ్రాంతులకు గురి చేశారు. వారి బెదిరింపులు తాళలేక మనస్థాపానికి గురైన సదరు బాధిత దళిత మహిళలు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడతామని పేర్కన్నప్పటికీ బీమా ఉందని వ్యాగంగా మాట్లాడారు. ఇక చేసేది లేక సదరు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేస్తాం అనడంతో అక్కడి నుంచి ఉడాయించారు. ఈ విషయంపై ఎస్ఐ అనిల్‌ను వివరణ కోరగా..ఫైనాన్స్ వసూళ్ల పేరిట బాధితుల ఇండ్లకు వెళ్లి బెదిరింపులకు పాల్పడటం చట్టరీత్యా నేరం అన్నారు. బాధితులు నేరుగా వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారిపై చర్యలు తీసుకోవడం జరుగతుందన్నారు. ఫైనాన్స్ వారు నిబంధనల మేరకు నడుచుకోవాలి తప్ప చట్టాన్ని అతిక్రమించవద్దని సూచించారు.

## రైతులకు అండగా కాంగ్రెస్ పార్టీ:ఎమ్మెల్యే జారే



**ప్రజాపక్షం/చండ్రుగొండ:**రైతులకు అన్ని విధాల అండగా ఉండే పార్టీ కాంగ్రెస్ అని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. శనివారం మండల పరిధిలోని దామరచర్ల గ్రామ శివారులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసిందని, అదే విధంగా సన్న ధాన్యానికి క్వింటాకు 500రూపాయలు బోనస్ ఇచ్చిందన్నారు. రేషన్ షాపుల్లో సన్న బియ్యం అందజేస్తుందని, దీంతో ప్రతి పేదవాడు ఆనందం వ్యక్తం చేస్తున్నాడని తెలిపారు. యువత రాజీవ్ యువశక్తి ద్వారా ఉపాధి కల్పిస్తున్నామని అన్నారు. ఇటీవల ఆకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ఎకరాకు పదివేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అందజేయడం జరుగుతుందన్నారు. గ్రామాలలో పంట నష్టం జరిగిన పొలాలను పరిశీలించి నివేదికలను తనకు అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో గుంపెన సొసైటీ ఛైర్మన్ నల్లమోతు వెంకటనారాయణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దారం గోవింద్‌రెడ్డి, జిల్లా నాయకులు అంకిరెడ్డి కృష్ణారెడ్డి, భోజ్య నాయక్, తుమ్మలపల్లి సురేష్, ఉప్పతల ఏడుకొండలు, నల్లమోతు రమణ, ఫజల్ బక్ష, సంక శంకర్, బుంగ శ్రీను, ఇస్లావత్ రుక్మిణి, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ప్రాణాలు పోతున్నా పట్టించుకోని ప్రజా వైద్యులు

**ప్రజాపక్షం/జూలూరుపాడు:**ప్రజల ప్రాణాలు పోతున్నా ప్రజా వైద్యులు పట్టించుకోవడం లేదని భారతీయ గోర్ బంజారా పోరాట సమితి వైరా నియోజకవర్గ ఇన్చార్జ్ బానోత్ రాంబాబు నాయక్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్నటువంటి గ్రామాలలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఆర్ఎంపిలు, పిఎంపిలు వారి వైద్యం ఎంబిబిఎస్ వైద్యం కంటే మించి ఉంటున్న పట్టించుకోనటువంటి మండల ప్రభుత్వ వైద్యాధికారులు మండలంలో ప్రజల చర్చించుకుంటున్న పెడచెవిన పెడుతున్నటువంటి పరిస్థితి దాపురించిందని వారన్నారు. అంతే కాకుండా మండల పరిధిలో అక్కడక్కడ ఆర్ఎంపిల, పిఎంపిల వైద్యాలు వికటించి ప్రజలకు కొందరికి కనులు కనపడక చెవులు వినపడక పరిస్థితుల్లో ఉండి పెద్ద డాక్టర్ల వద్దకు వెళ్లి లక్షల ఖర్చు పెట్టి ట్రీట్మెంట్ చేయించుకున్నటు వంటి దాఖలాలు చాలా ఉన్నాయన్నారు. తక్షణమే మండలలో ఉన్న ఆర్ ఎంపిలుపిఎంపిలను పిలిపించి కౌన్సిలింగ్ ఇప్పించి అధిగమించిన వైద్యం చేయకండి, మీరు చేసే ఒక ఫస్ట్ఎయిడ్ తప్ప వేరే ఏ వైద్యం చేయకూడదు అంటూ అలా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని ఆర్ఎంపిల వైద్యశాలను పిఎంపిల వైద్యశాలను సీజ్ చేస్తామని హెచ్చరించి ప్రజలను కాపాడాలని ఆయన కోరుతూ శనివారం జూలూరుపాడు మెడికల్ ఆఫీసర్‌కు మెమరాండం అందించడం జరిగిందని ఆయన అన్నారు.

## పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం
### సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం



**ప్రజాపక్షం/ఖమ్మం :** ప్రజలపై భారాలు వేస్తూ కార్పొరేట్లకు కొమ్ము కాస్తున్న పాలకుల విధానాలపై ప్రజలను చైతన్యవంతం చేసి పోరాటాలు నిర్వహించాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. శనివారం ఖమ్మం నగరంలోని నర్సింహస్వామి గుడి వద్ద జరిగిన 43, 52 డివిజన్ల సిపిఐ శాఖ మహాసభల్లో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఎన్నికలకు ముందు అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన పాలకులు ప్రజలపై భారాలు వేస్తూ దేశాన్ని సంక్షోభంలోకి నెట్టివేశారని ఆయన విమర్శించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, ఇతర నిత్యావసర వస్తువుల ధరలు పెంచి సామాన్య మధ్యతరగతి ప్రజలపై భారాలు వేస్తూ కార్పొరేట్ శక్తులకు ప్రయోజనం కలిగేవిధంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆయన అన్నారు. దేశంలోని సంపదను, సహజ వనరులను కొద్ది మంది వ్యక్తులకు దారాదత్తం చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. మతం పేరుతో ప్రజల మధ్య విభజన తెచ్చి స్వేచ్ఛ, ప్రజాస్వామ్యంను ఖూనీ చేస్తూ రాజ్యాంగ విలువలకు తిలోదకాలు ఇస్తున్నాయన్నారు. వంద ఏళ్ల చరిత్ర కలిగిన సిపిఐ అనేక పోరాటాల ద్వారా ప్రజలకు అనేక హక్కులను సాధించిపెట్టిందన్నారు.కమ్యూనిస్టులు బలంగా ఉంటేనే పేద ప్రజలకు రక్షణగా ఉంటుందన్నారు. పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి వారిని చైతన్యవంతం చేయడం ద్వారా బలమైన ప్రజా ఉద్యమాలను నిర్మించి పాలకుల విధానాలను తిప్పికొట్టాలని బాగం పిలుపునిచ్చారు. ఈ మహాసభలకు కటుకూరి సతీష్‌రెడ్డి, ఎండి రెహ్మాన్ అధ్యక్షత వహించగా రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా కార్యవర్గ సభ్యులు, కార్పొరేటర్ బిజి క్లెమెంట్, నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా, జిల్లా కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగాన్ని మార్చే కుట్రలను తిప్పి కొడదాం: జారే



**ప్రజాపక్షం/చండ్రుగొండ:**కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్రలు పండుతుందని వాటిని తి ప్పి కొట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. జాతీయ కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పని చేస్తూ స్వతంత్ర పోరాటంలో కాంగ్రెస్ పార్టీ చేసిన సేవలను అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అ oదిస్తున్న అభివృద్ధి ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఈకార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. బి జెపి పార్టీ దేశంలో రాజ్యాంగాన్ని అవమానిస్తూ కి ంచపస్తూ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తుందన్నారు. బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరి ంచాలన్నారు. బిఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ పార్టీ స oక్షేమ పథకాలను చూసి ఓర్వలేక విమర్శలు చే స్తుందన్నారు. తొలుత మండల పరిధిలో పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలకు ఎల్‌ఓసి చెక్కులు అ oదజేశారు. ఈకార్యక్రమంలో జైబాబు జై భీమ్ జై సమ్మిదాన్ అభియాన్ ఇన్చార్జ్ రామ్ లక్ష్మ ణ్, కా oగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దారం గోవింద్ రెడ్డి, జిల్లా నాయకులు ,తదితరులు పాల్గొన్నారు.

# అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసన దీక్ష
### డిప్యూటీ సిఎం భట్టి హామీతో విరమణ





**ప్రజాపక్షం/మధిర :** మధిర పట్టణంలోని పాత రైల్వే గేటు వద్ద ప్రజలు రాకపోకలు సాగించేందుకు వీలుగా అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ, సిపిఎం, టిడిపి, ఎమ్మార్పీఎస్ పార్టీ, స్థానిక వ్యాపారులు ఆధ్వర్యంలో శనివారం నిరసన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు మాట్లాడుతూ పట్టణంలోని పాత రైల్వే గేటు మార్గం గుండా నిత్యం వందలాది మంది పాదచారులు వివిధ పనులకు కోసం ప్రయాణిస్తుంటారని, పరిసర ప్రాంతాల గ్రామాలు, పట్టణ ప్రజలకు పక్కనే ఉన్న ఆర్వోబిని ఎక్కేందుకు కష్టతరం కావటంతో ఈ మార్గం గుండా ప్రయాణిస్తుంటారని, ఈ మార్గాన్ని గోడ కట్టి మూసి వేస్తే ప్రజలు అనేక అవస్థలు ఎదుర్కొంటారని, ప్రత్యామ్నాయ మార్గం చూపే వరకు ఉద్యమం ఆగదన్నారు. మధిర వన్ టౌన్, టూటౌన్ కు గొలుసుకట్టుగా ఉన్న రైల్వే ట్రాక్‌కు మార్గాన్ని మూసివేస్తే మధిర పట్టణం రెండుగా విడిపోతుందని, ఇప్పటికే మూడవ రైల్వే లైన్ నిర్మాణ పనులు వలన వ్యాపారాలు లేక వ్యాపారులు దివాలా తీసే పరిస్థితికి వచ్చిందన్నారు. రైల్వే అండర్ పాస్ నిర్మాణానికి అనుమతులు ఇచ్చేంత వరకు ఉద్యమం ఆగదన్నారు. ఈ నిరసన దీక్షలకు బిఆర్ఎస్ పార్టీ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ జెడ్పిచైర్మన్ లింగాల కమల్‌రాజు సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సమస్యను పరిష్కరించాలని, దీనిపై డిప్యూటీ సిఎం భట్టివిక్కరమార్క స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ నిరసన దీక్షను సందర్శించిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ మాట్లాడుతూ సమస్యను డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క దృష్టికి తీసుకెళ్లినట్లు, తక్షణమే స్పందించిన భట్టి రైల్వే అధికారులతో మాట్లాడి నడకమార్గం వదలి గోడ నిర్మాణం చేపట్టాలని ఆదేశించినట్లు తెలిపారు. రైల్వే శాఖ మధిర ఎఇ శ్రీనివాసరావు మాట్లాడుతూ అండర్ రైల్వే పాస్ నిర్మాణం చేపట్టేంత వరకు ప్రజలకు ఇబ్బంది లేకుండా మూడు అడుగులు దారి ఏర్పాటు చేయటం జరుగుతుందని హామీ ఇచ్చారు. దీంతో నిరసన దీక్షను విరమింపచేశారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులుబెజవాడ రవిబాబు, మడుపల్లి గోపాలరావు, శీలం నర్సింహారావు, పాపినేని రామనర్సయ్య, మల్లాది హన్మంతరావు, రిటైర్డ్ ఎంపిడిఓ మురళీధర్‌రావు, ఎమ్మార్పీఎస్ నాయకులు కూరపాటి సునీల్ మాదిగ, నాయకులు, కార్యకర్తలు, వ్యాపారులు, ప్రజలు పాల్గొన్నారు.

## రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కల్పిస్తున్న మోదీ సర్కార్
### సిపిఐ ఆధ్వర్యంలో పాల్వంచలో నిరసన





**ప్రజాపక్షం/భద్రాచలం:**కేంద్రంలో అధికారం చెలాయిస్తున్న మోదీసర్కార్ రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగిస్తోందని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం అన్నారు. శనివారం పాల్వంచ పట్టణంలోని నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, స్వేచ్ఛ లేకుండా పోయిందన్నారు. వక్ఫ్ చట్టం సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. ప్రజలపై దాడులు జరుగుతున్నాయని, మహిళలపై లైంగిక దాడులు పెరిగాయని చెప్పారు. నూతన జాతీయ విద్యావిధానం పేరుతో విద్యను కార్పోరేటీకరణ, కాషాయికరణ కుట్రలు చేస్తున్నారన్నారు. మోదిపాలనలో ఉద్యోగాల కల్పన అటుపెడితే తొలగింపులే ఎక్కువయ్యాయని, కేంద్రం మతాన్ని, కులాన్ని అడ్డుపెట్టుకుని హిందుత్వ ఎజెండాతో పాలన సాగిస్తోందన్నారు. ప్రశ్నించే వారిపై కేసులు పెడుతూ నిర్భందాలకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల హక్కులకు భంగం వాటిల్లిందని, లేబర్ కోడ్లను రద్దు చేయాలని చెప్పారు. ఇప్పటికైనా ప్రజలు మేల్కొని కేంద్రంపై తిరుకుబాటు చేయకుంటే దేశంలో స్వేచ్ఛావాయివులు పీల్చే పరిస్థితి లేకుండా పోతుందన్నారు.కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు బండి నాగేశ్వరరావు, పట్టణ సహాయ కార్యదర్శిఉప్పుశెట్టి రాహుల్, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ

# పూరన్, మర్క్రమ్ విధ్వంసం..



## గుజరాత్‌పై 6 వికెట్లతో గెలిచిన లక్నో

ఐపిఎల్ 18వ సీజన్లో లక్నో సూపర్ జెయింట్స్ జోరు కొనసాగిస్తోంది. వరుస విజయాలతో టాపర్గా ఉన్న గుజరాత్ టైటాన్స్‌కు బిగ్ షాకిచ్చింది. ఓపెనర్ల మెరుపులతో భారీ స్కోర్ దిశగా సాగిన గుజరాత్‌ను 180 కే కట్టడి చేసిన లక్నో.. ఆ తర్వాత ఛేదనలోనూ దుమ్మురేపింది. నికోలస్ పూరన్(61), ఓపెనర్ ఎడెన్ మర్క్రమ్(58) హాఫ్ సెంచరీలతో చెలరేగగా 6 వికెట్ల తేడాతో జయకేతనం ఎగురవేసింది. ఆఖర్లో గుజరాత్ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులు వేసినా.. ఇంప్యాక్ట్ ప్లేయర్ ఆయుష్ బదౌని(28 నాటౌట్), డేవిడ్ మిల్లర్(7)లు ఒత్తిడికి లోనవ్వలేదు. 20వ ఓవర్లో బౌండరీ బాదిన బదౌని.. ఆ తర్వాత సిక్సర్‌తో జట్టుకు అద్భుత విజయాన్ని అందించాడు. దాంతో, ఐదో విక్టరీకిపై కన్నేసిన గుజరాత్‌కు భంగపాటు తప్పలేదు. సొంతగడ్డపై లక్నో సూపర్ జెయింట్స్ పంజా విసిరింది. టాపర్ అయిన గుజరాత్ టైటాన్స్‌ను ఓడించి టాప్ 4లోకి దూసుకెళ్లింది. బంతితోనే కాదు ఫీల్డింగ్‌లోనూ అద్భుతంగా రాణించిన లక్నో మొదట ప్రత్యర్థిని 180కే కట్టడి చేసింది. ఛేదనలో ఓపెనర్లు ఎడెన్ మర్క్రమ్(58), కెప్టెన్ రిషభ్ పంత్()లు ధాటిగా ఆడారు. పవర్ ప్లేలో గుజరాత్ పేస్ గన్స్ సిరాజ్, ప్రసిధ్‌లను ఉతికేస్తూ బౌండరీలతో విరుచుకుపడ్డారు. దాంతో, 6 ఓవర్లలో 62 కొట్టిన లక్నో పటిష్ట స్థితిలో నిలిచింది. అయితే.. సుందర్ బౌలింగ్‌లో పంత్ ఔటయ్యాడు. ఆ తర్వాత వచ్చిన నికోలస్ పూరన్ (61: 34 బంతుల్లో 1 ఫోర్, 7 సిక్సర్లు) మరోసారి ఆకాశమే హద్దుగా చెలరేగాడు. మరోవైపు మర్క్రమ్ సైతం దూకుడు పెంచి 26 బంతుల్లోనే ఫిఫ్టీ సాధించాడు.ఈ ఇద్దరి మెరుపులతో లక్నో స్కోర్ 10 ఓవర్లకు 114కు చేరింది. విజయానికి చేరువైన లక్నోను ప్రసిధ్ దెబ్బకొట్టాడు. మర్క్రమ్ ఔటయ్యాక హాఫ్ సెంచరీ బాదిన పూరన్ సైతం రషీద్ ఖాన్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. ఆ తర్వాత డేవిడ్ మిల్లర్(7), ఇంప్యాక్ట్ ప్లేయర్ ఆయుష్ బదౌని(28 నాటౌట్)లు జట్టును గెలిపించే బాధ్యత తీసుకున్నారు. అయితే.. లక్నో విజయానికి 18 బంతుల్లో 18 పరుగులు అవసరం అయ్యాయి. రషీద్ ఖాన్ వేసిన 18వ ఓవర్లో బదౌని ఫైన్ లెగ్‌లో ఫోర్ బాదాడు. కానీ, ఆ తర్వాత సుందర్ బౌలింగ్‌లో పెద్ద షాట్ ఆడబోయిన మిల్లర్ బౌల్డ్ అయ్యాడు. ఆఖరి ఓవర్లో 6 రన్స్ కావాలి. అబ్దుల్ సమద్(2) సింగిల్ తీయగా.. బదౌని బౌండరీ కొట్టాడు.

### గిల్, సాయి మెరుపులతో

మొదట బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ 180 రన్స్ కొట్టింది. ఈ సీజన్‌లో భీకర ఫామ్‌లో ఉన్న గుజరాత్ టైటాన్స్ నిర్దేశించిన ఓపెనర్లు శుభ్‌మన్ గిల్(60), సాయి సుదర్శన్(56)లు మరోసారి చితక్కొట్టారు. ఎక్నా స్టేడియంలో లక్నో సూపర్ జెయింట్స్ బౌలర్లకు చుక్కలు చూపించారు. అర్ధ శతకాలతో చెలరేగిన ఈ ద్వయం తొలి వికెట్‌కు 120 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి భారీ స్కోర్‌కు బాటలు వేసింది. అయితే.. స్ట్రాటజిక్ టైమౌట్ తర్వాత పుంజుకున్న లక్నో బౌలర్లు గుజరాత్ మిడిలార్డర్‌ను క్రీజులో నిలవనీయలేదు. ఆఖర్లో షెర్ఫానే రూథర్ ఫోర్డ్22) ఒక్కడే మెరుపులు మెరిపించగా గిల్ బృందం నిర్ణీత ఓవర్లలో 180 రన్స్ చేయగలిగింది.



## అయ్యర్, స్టోయినిస్ సిక్సర్ల మోత

ఉప్పల్ స్టేడియంలో పరుగుల వరద పారింది. ఫ్లాట్ పిచ్ మీద పంజాబ్ కింగ్స్ టాపార్డర్ బ్యాటర్లు వీరవిహారం చేశారు. ఓపెనర్లు ప్రభ్ సిమ్రన్ సింగ్(42), ప్రియాన్ష్ ఆర్య(36)లు శుభారంభం ఇవ్వగా.. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్(82) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. ఫోర్లు, సిక్సర్లతో హోరెత్తించిన అయ్యర్ అర్ధ శతకంతో చెలరేగాడు. జట్టు స్కోర్ 200 దాటించి ఆరెంజ్ ఆర్మీని భయపెట్టాడు. అయితే.. హర్షల్ పటేల్(442) సంచలన బౌలింగ్‌తో కీలక వికెట్లు తీసి బ్రేకిచ్చాడు. అయితే. మార్కస్ స్టోయినిస్(34 నాటౌట్) 20వ ఓవర్లో ఏకంగా నాలుగు సిక్సర్లు బాదడంతో పంజాబ్ నిర్ణీత ఓవర్లో 6 వికెట్ల నష్టానికి 245 రన్స్ కొట్టింది. సొంత మైదానంలో వరుసగా రెండు మ్యాచుల్లో ఓడిన ఆరెంజ్ ఆర్మీకి ఈసారి ఛేజింగ్ అతి పెద్ద సవాల్ కానుంది. చావోరేవో మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్రత్యర్థికి భారీ స్కోర్ సమర్పించుకుంది. టాస్ ఓడిన ఆరెంజ్ ఆర్మీ బౌలర్లను పంజాబ్ కింగ్స్ ఓపెనర్లు ఉతికారేశారు. చెన్నైపై శతకంతో గర్జించిన ప్రియాన్ష్ ఆర్య(36) సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. మరోవైపు ప్రభ్‌సిమ్రన్ సింగ్(42) హ్యాట్రిక్ బౌండరీలతో విజృంభించాడు. అయితే.. హర్షల్ పటేల్ బౌలింగ్ పెద్దషాట్ ఆడిన ప్రియాన్ష్.. నితీశ్ కుమార్ రెడ్డి చేతికి చిక్కాడు. చిచ్చరపిడుగు. దాంతో, 66 వద్ద పంజాబ్ తొలి వికెట్ పడింది. ఆ తర్వాత వచ్చిన కెప్టెన్ శ్రేయస్ అయ్యార్(9) సైతం ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్‌తో కలిసి దూకుడు ఆడాడు. దాంతో పవర్ ప్లేలో వికెట్ నష్టానికి పంజాబ్ 89 రన్స్ కొట్టింది.

**13 ఓవర్లకే 160**

హాఫ్ సెంచరీకి చేరువైన ప్రభ్‌సిమ్రన్‌ను ఈషన్ మలింగ పెవిలియన్ పంపాడు. 91 వద్ద రెండో వికెట్ పడినా అయ్యర్ మాత్రం జోరు తగ్గించలేదు. నేహల్ వధేర(27) అండగా మరింత చెలరేగిపోయాడు. 13 ఓవర్లకే 160 కొట్టింది. డేంజరస్ శశాంక్ సింగ్(2) వికెట్ను రివ్యూ తీసుకొని సాధించింది. ఈషన్ మలింగ వేసిన 18వ ఓవర్లో అయ్యర్ 4 ఫోర్లు సంధించి పంజాబ్ స్కోర్ 200 దాటించాడు.

అయితే.. హర్షల్ బౌలింగ్‌లో గ్లెన్ మ్యాక్స్‌వెల్(3).. స్వీప్ షాట్ ఆడబోయి బౌల్డ్ అయ్యాడు. మూడో బంతికి సిల్లీ పాయింట్‌లో ఆడిన అయ్యర్.. హెడ్‌కు దొరికాడు. అంతే.. చూస్తుండగానే 6 వికెట్లు కోల్పోయింది పంజాబ్. కానీ, మార్కస్ స్టోయినిస్(34 నాటౌట్) షమీ వేసిన 20వ ఓవర్లో విధ్వంసం సృష్టించాడు. వరుసగా 3, 4, 5 బంతుల్ని స్టాండ్స్‌లోకి పంపాడు. ఆఖరి బంతిని సైతం సిక్సర్‌గా మలవడంతో పంజాబ్ నిర్ణీత ఓవర్లలో 245 పరుగులు చేసింది.

# రీల్

## విశ్వంభర.. శుభారంభం.. రామగీతం విడుదల



మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న తాజా చిత్రం విశ్వంభర. ఈ సినిమా పై తెలుగు ప్రేక్షకుల్లో అంచనాలు ఏ రేంజ్‌లో ఉన్నాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ సినిమాని బింబిసార ఫేం దర్శకుడు వశిష్ట పూర్తి సోషియో ఫాంటసీ సినిమాగా తీసుకురాబోతున్నాడు.. ఈ సినిమాకు సంబంధించి ఎలాంటి వార్తలు బయటకు వచ్చినా కూడా అభిమానులు ఎంతో ఆసక్తిగా గమనిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం హనుమాన్ జయంతి సందర్భంగా మూవీ నుండి రామ రామ సాంగ్ విడుదల కానున్నట్టు తెలియజేశారు. శనివారం హనుమాన్ జయంతి సందర్భంగా 'విశ్వంభర' నుంచి ఆ పాట విడుదలైంది. రాములోరి గొప్ప చెప్పుకుందామా.. 'రాములోరి గొప్ప చెప్పుకుందామా.. సాములోరి పక్కన ఉన్న సీతమ్మ లక్షణాలు చెప్పుకుందామా అంటూ సాగే ఈ గీతాన్ని సరస్వతి పుత్ర రామ జోగయ్య శాస్త్రి రాశారు. ఆస్కార్ పురస్కార గ్రహీత, ప్రముఖ సంగీత దర్శకులు ఎంఎం కీరవాణి బాణీలు అందించారు. శంకర్ మహదేవన్, లిప్సిక అద్భుతంగా ఆలపించారు. పాట ప్రారంభంలో 'జై శ్రీరామ్' అంటూ వచ్చే చిరంజీవి వాయిస్ ఒకటి డివోషనల్ వైబ్ తీసుకొచ్చింది అనే చెప్పాలి. గతంలో చిరంజీవి సినిమాలలో కొన్ని భక్తి గీతాలు ఉన్నాయి. కాని దీని స్పెషాలిటీ ఏంటంటే చిరుకి ఇష్ట దైవమైన హనుమంతుని చుట్టూ పాట సాగుతుంది. ఈ పాటకి సంబంధించిన వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతుంది.

## ఎంతో ఆనందంగా ఉంది


–ప్రియా ప్రకాశ్ వారియర్




'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రీకరణ సమయంలో దిగిన పలు ఫొటోలను ఆమె సోషల్‌మీడియా వేదికగా షేర్ చేశారు. "ఎక్కడ ప్రారంభించాలో తెలియడం లేదు. నా ఆనందాన్ని మీతో పంచుకోవాలని ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నా. అజిత్ సర్.. మీరంటే నాకెంత అభిమానమో చెప్పడానికి మాటలు సరిపోవడం లేదు. ఫస్ట్ డే నుంచి షూట్ చివరి రోజు వరకూ మీరెంతో సపోర్ట్ చేశారు. నేను కూడా టీమ్‌లో భాగమేననే భావన కలిగించేలా ధైర్యం చెప్పారు. సెట్‌లో ఎవరూ ఇబ్బందిపడకుండా ఉండేలా మీరు అందరితో కలివిడిగా ఉండేవారు. షిప్‌లో షూట్ చేసిన రోజులను నేను ఎప్పటికీ మర్చిపోలేను. మనమంతా కలిసి భోజనం చేయడం.. సరదాగా జోకులు వేసుకోవడం.. ఎంతో నచ్చింది. మీలాంటి మంచి వ్యక్తిని ఎప్పుడూ కలవలేదు. కుటుంబం, కార్లు, రేస్, ట్రావెలింగ్ గురించి మాట్లాడేటప్పుడు మీ కళ్లలో కనిపించే ఆ మెరుపు అందరినీ ఆకర్షిస్తుంది. వృత్తిపై మీకున్న నిబద్ధత, సహనం, నాలాంటి ఎంతోమంది కొత్తతరం నటీనటులకు స్ఫూర్తి. ఎంత ఎత్తు ఎదిగినా ఒదిగి ఉండే లక్షణాన్ని మీ నుంచి నేర్చుకున్నా. 'తుట్టు తుట్టు' పాటలో మీతో కలిసి వర్క్ చేయడం నాకెంతో ప్రత్యేకంగా అనిపించింది'' అని ఆమె రాసుకొచ్చారు.

## పోస్ట్ ప్రొడక్షన్‌లో 'హే చికీతా'

**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** సుందర కాండ మోషన్ పిక్చర్స్, అమరావతి మూవీ మేకర్స్ పథకం పై ధన్ రాజు లెక్కల దర్శకత్వంలో, గరుడ వేగా అంజి, అశోక్ ఆర్‌ఎన్‌ఎస్ నిర్మాణ సారథ్యంలో తెరకెక్కిన చిత్రం 'హే చికీతా' అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని సినీ దర్శకుడు ధన్ రాజ్ లెక్కల తెలిపారు. శనివారం దర్శకుడు ధన్ రాజ్ సినిమా గురించి విలేకరుల తో మాట్లాడుతూ వివరించారు. అభినవ్, దివిజా ప్రభాకర్, తన్మయి హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమా గ్రామీణ వాతావరణం నేపథ్యంలో సాగుతుందని, వ్యవసాయం చేసే రైతుకు పెళ్లి చేసుకోవడానికి పిల్లనివ్వక పోవడం, వ్యవసాయాన్ని చిన్న చూపు చూడకూడదనే కాన్సెప్ట్ తోపాటు ఫ్యామిలీ, ఎంటర్టైన్మెంట్, యువత కు సందేశమిచ్చే రీతిలో చిత్రాన్ని రూపొందించామని దర్శకుడు తెలిపారు.కథ, మాటలు, పాటలు, సంగీతం, ఫోటో గ్రఫీ చిత్రనికి హైలెట్‌గా ఉంటాయని ధన్ రాజ్ అన్నారు.చిత్ర నిర్మాణం పూర్తి చేసుకున్నఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రోడక్షన్ కార్యక్రమాలు హైదరాబాద్ స్టూడియోలో నడుస్తున్నాయనీ దర్శకుడు ధన్ రాజ్ లెక్కల అన్నారు. గరుడవేగా అంజి ఈ చిత్రం కోసం చాలా కష్టపడ్డారని, హేచికీతా సినిమాలో నటించిన నటీ, నటులు, సాంకేతిక వర్గానికి, చిత్ర షూటింగుకు సహకరించిన జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్, జగిత్యాల డిఎస్పీ రఘుచందర్, జగిత్యాల రూరల్, టౌన్ సీఐలు కృష్ణారెడ్డి, వేణుగోపాల్, పోలీస్ సిబ్బంది, ఆయా గ్రామాల ప్రజలు, అధికారులు, ఉద్యోగులకు చిత్ర యూనిట్ పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. ఐతే ఈ చిత్రంలో జగిత్యాలకి చెందిన జబర్దస్త్ అజయ్, మై విలేజ్ షో అంజిమమా, డ్యాన్సర్ రాకేష్, కొత్తపల్లి శ్రీను, సంధ్యారాణి,అలేఖ్య, రాపర్తి రవి, పోలీస్ మల్లయ్య, లెక్కల నారాయణల, మాణిదీప్ రావు, రఘులు అసిస్టెంట్ డైరెక్టర్లుగా అవకాశం లభించింది. సినిమాకు మ్యూజిక్ డైరెక్టర్ చరణ్ అర్జున్, ఎడిటర్ బలగం మధు, కోర్యోగ్రాపర్‌గా ఈశ్వర్ పెంటి వ్యవహరించిన హే చికీతా సినిమాను మే లేదా జూన్ నెలలో విడుదల చేసేందుకు చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోందని దర్శకుడు ధన్ రాజ్ లెక్కల తెలిపారు.





## ఆంక్షల ఎత్తివేత?

**(మొదటి పేజీ తరువాయి)**

విభాగానికి డైరెక్టర్‌గా ప్రొఫెసర్‌గా విట్‌కాఫ్ గతంలతో పనిచేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో డోనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న కస్టమ్స్ సుంకాల విధానంవల్ల రష్యాపై ఎలాంటి ఒత్తిడీ ఎదురుకాబోదని ఆయన ఉద్ఘాటించారు. అదేవిధంగా ట్రంప్ అనుసరిస్తున్న సుంకాల యుద్ధం వల్ల కూడా రష్యాకు ఎలాంటి నష్టం వాటిల్లబోదన్నారు. ఈ భేటీతో ఇప్పటికి ఈ ఏడాదిలో మూడుసార్లు పుతిన్‌తో అమెరికా ప్రతినిధులు భేటీ చేసినట్లయింది. ఈ చర్చలు ఫలవంతమయ్యాయని రష్యా ప్రత్యేక దూత కిరిల్ ద్మిత్రియేవ్ చెప్పారు. ఈ చర్చలు ప్రారంభం కావడానికి ముందుగా ట్రంప్ రష్యా తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఉక్రేన్‌లో రష్యా 'అర్థరహితమైన యుద్ధం' చేస్తోందని ట్రంప్ విమర్శించారు. దీనివల్ల వందలమంది మరణిస్తున్నారనీ, అపార నష్టం సంభవిస్తోందని అసహనం వ్యక్తం చేశారు.

**రష్యాపక్షాన వందలాది చైనా సైనికులు జెలెన్స్కీ ఆరోపణ: రుడెంకో ఖండన**

ఉక్రేన్ అధ్యక్షుడు వి.జెలెన్స్కీ మరోసారి చైనాపై ఆరోపణలు చేశారు. వందలమంది చైనా జాతీయులు రష్యా తరపున ఉక్రేన్ సరిహద్దుల్లో పోరాటం చేస్తున్నారని విమర్శించారు. ఇద్దరు చైనా సైనికులను తమ సైన్యం అదుపులోకి తీసుకుందని ఆయన అన్నారు. ఐతే ఇంతకు ముందు జెలెన్స్కీ ఇదేవిధంగా చేసిన ఆరోపణలను చైనా తీవ్రంగా ఖండించింది. శాంతికే తమదేశం కట్టుబడి ఉందని స్పష్టం చేసింది. ఐనాగానీ మరోసారి జె లెన్స్కీ పైవిధంగా ఆరోపణలు చేశారు. ఉక్రేన్‌లో యుద్ధం ఆగకుండా కొనసాగడానికి వ్లాదిమీర్ పుతినే కారణమని ఆరోపించారు. ఐతే జెలెన్స్కీ తాజాగా చేసిన ఈ ఆరోపణలను రష్యా విదేశాంగశాఖ డిప్యూటీమంత్రి ఆంద్రీ రుడెంకో తీవ్రంగా ఖండించారు. జెలెన్స్కీ పచ్చి అబద్దాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

## రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమంలో విద్యార్థులు

# భాగస్వామ్యం కావాలి

### బొమ్మగాని ప్రభాకర్, కె.వి.ఎల్ పిలుపు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారత రాజ్యాంగ పరిరక్షణకు అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం నిర్వహిస్తున్న దేశ వ్యాప్త ఉద్యమంలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్, ఐప్సో రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్ పిలుపునిచ్చారు. ఐప్సో ఆధ్వర్యంలో శనివారం దిల్‌సుఖ్ నగర్‌లోని లోటస్ లాప్ స్కూల్ చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి అధ్యక్షతన పాఠశాల ప్రాంగణంలో 'సేవ్ నేషన్ సేవ్ కాన్స్టిట్యూషన్ 'అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఐఎఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ ఎంతోమంది వీరోచితమైన పోరాటాలు, త్యాగాలతో దేశానికి స్వాతంత్రం లభించగా, ఈ స్వాతంత్ర ప్రజాస్వామిక భారతదేశానికి అంబేద్కర్ శక్తివంతమైన రాజ్యాంగాన్ని అందించారని తెలిపారు. ప్రజాస్వామ్యం, సెక్యులరిజం, రాజ్యాంగం ఎప్పటికీ సంరక్షించ బడాలని, ఆ బాధ్యతయుత్తమైన కర్తవ్యంలో రేపటి భావి భారత పౌరులైన విద్యార్థులు అగ్రభాగాన ఉండాలనిఆయన సూచించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, స్వేచ్ఛ స్వాతంత్ర్యం, సంక్షేమ కార్యక్రమాల అమలుకు పాలకులు భంగం కలిగిస్తున్న ప్రస్తుత తరుణంలో దేశాన్ని, రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు జరుగుతున్న పోరాటంలో విద్యార్థులు ప్రజలు అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములు అవ్వాలని పునరుద్ఘాటించారు. అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కె.వి.ఎల్ .మాట్లాడుతూ దేశ ప్రగతి రాజ్యాంగం అమలుపై ఆధారపడి ఉంటుందని, అమలు సక్రమంగా లేనప్పుడు మానవ హక్కులకు విఘాతం ఏర్పడి ప్రగతి ,సంక్షేమం దెబ్బతిన్నడంతోపాటు మూక దాడులు మతోన్మాదం, అసహనం పెరుగుతాయన్నారు. ఇలాంటి ప్రమాదకర పరిస్థితుల నుండి దేశాన్ని, రాజ్యాంగాన్ని, రక్షించుకోవాల్సిన సందర్భం ఏర్పడిందని తెలిపారు. పార్టీలకు అతీతంగా మేధావులు, ఉద్యోగులు, కార్మికులు ,శ్రామికులు, మహిళలు, యువకులు విద్యార్థులు అందరూ కూడా బలమైన గొంతును వినిపించడం ద్వారా ప్రజాస్వామ్య పద్ధతుల్లో భారతదేశాన్ని ,అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని, రక్షించుకోవాలని కెవిఎల్ పిలుపును ఇచ్చారు. ఐప్ రాష్ట్ర కార్యదర్శి పల్లె వినయ్ మాట్లాడుతూ ఈనాటి విద్యార్థులు శాస్త్రీయమైన ఆలోచన అలవర్చుకోవాలని దేశాన్ని తీర్చిదిద్దే గొప్ప వ్యక్తులుగా ఎదగాలని ఆకాంక్షించారు.హైదరాబాద్ జిల్లా ఐప్సో సెక్రెటరీ జె.కె. శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో పాలకులు ఎవరున్నా కూడా రాజ్యాంగం లక్ష్యాలను అమలు చేయాలని, పాలకులు అనుసరించే మతాలను దేశంపై రుద్దకూడదన్నారు. లోటస్ ల్యాబ్ స్కూల్స్ చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ సరైన విద్యా వ్యవస్థ ద్వారానే ప్రజలకు దేశానికి మేలని, బట్టి చదువులతో విద్యార్థులకు పట్టాలు రావచ్చు గాని ఉద్యోగాలు రావన్నారు. . విద్యార్థులు శాంతి ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు. ఎపిసోడ్ రంగారెడ్డి డిస్ట్రిక్ట్ జిల్లా సమన్వయ ప్రధాన కార్యదర్శి పోలగాని రవికిషోర్ మాట్లాడుతూ అఖిలభారత శాంతి సంఘీభావ సంఘం ఈ రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో విద్యార్థులకు శాంతి ఉద్యమ ప్రాధాన్యత, దేశభక్తి, స్వాతంత్ర పోరాట యోధులు, అంతర్జాతీయ శాంతి ఉద్యమకారుల జీవిత విశేషాలను పోరాటాలను తెలియజేస్తూ వారిలో దేశభక్తిని నింపుతూ శాంతి ఉద్యమం వైపు ఆలోచింపజేస్తుందన్నారు. అంతకు ముందు విద్యార్థులు సేవ్ నేషన్ సేవ్ కాన్స్టిట్యూషన్ ,అనే అంశంపై జరిగిన చర్చలో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. అనంతరం ఐప్సో రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవి ఎల్ విద్యార్థుల చేత రాజ్యాంగంలోని పీఠికను చదివిస్తూ రాజ్యాంగం అమలుకు ప్రపంచ శాంతికి దేశ రక్షణకు కృషి చేస్తామని ప్రమాణం చేయించగా, పాఠశాల అడ్మిన్ మాధవి వందన సమర్పణ చేశారు.

## రామయ్య కన్నుమూత

**(మొదటి పేజీ తరువాయి)**

మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, నార లోకేష్, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీ రామసాయం రఘురాంరెడ్డి, బిఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ సీఎం కేసిఆర్, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటిఆర్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్లు, మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి పలువురు ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతిని, మృతికి నివాళి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు.



**రామయ్య నేపథ్యం...**

ముత్తగూడెం గ్రామానికి చెందిన వనజీవి రామయ్య తనకు రెడ్డిపల్లిలో పొలం ఉండటంతో ఇక్కడే స్థిరనివాసం ఏర్పరుచుకున్నారు. జూలై 1తేది 1937లో లాలయ్య,పుల్లమ్మ దంపతులకు జన్మించారు. అసలు పేరు రామయ్య కాగా.. మొక్కలు నాటడమే జీవిత ఆశయంగా మలుచుకొని ఇంటిపేరును వనజీవి రామయ్యగా మార్చుకున్నారు. రామయ్య అభ్యసం ముత్తగూడెంలోని ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి వరకు చదువుకున్నారు. అటు తర్వాత 15సంవత్సరాలకు కుటుంబ సభ్యులు కొణిజర్ల మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన జానమ్మతో వివాహం జరిపించారు. వీరికి నలుగురు సంతానం..ముగ్గురు కుమారులు, ఒక్క కుమార్తె, ఇందులో ఇద్దరు కుమారులు మృతి చెందారు. ఓ పక్క కుటుంబ బారాన్ని మోస్తునే తనకేంతో ఇష్టమైన మొక్కలను నాటేవారు.

**రామయ్యను వరించిన అవార్డులు..**

రామయ్య సామాజికి సేవలకు గాను 2017లో కేంద్ర ప్రభుత్వం నుంచి పద్మశ్రీ, 2005వ సంవత్సరంలో సెంటర్ ఫర్ మీడియా సర్వీసెస్ సంస్థ నుంచి వనమిత్ర, యూనివర్సల్ గ్లోబల్ షీప్ అంతర్జాతీయ సంస్థ నుండి గౌరవ డాక్టరేట్, 1995లో భారత ప్రభుత్వం నుంచి వనసేవ అవార్డు, 2000లో అప్పటి సీఎం నారచంద్రబాబు నాయుడు వనజీవి సేవలకు గాను ఒక మోషెట్‌ను కొనిచ్చారు. ప్రతి నెల రూ.1500 గౌరవ భృతిని కేటాయించారు.

**రామయ్య మరణం పట్ల సిఎం, గవర్నర్ సంతాపం**

పద్మశ్రీ వనజీవి దరిపల్లి రామయ్య మరణం పట్ల ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, పలువురు మంత్రులు, ప్రముఖులు సంతాపాన్ని, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రకృతి పర్యావరణం లేనిదే మానవ మనుగడ లేదనే సిద్ధాంతాన్ని బలంగా నమ్మిన వ్యక్తి వనజీవిగా పేరుగాంచిన దరిపల్లి రామయ్య మృతి తనను కలిచివేసిందని సిఎం తన సంతాప సందేశంలో తెలిపారు.

**నిజమైన మట్టి పుత్రుడు రామయ్య: గవర్నర్**

పద్మశ్రీ అవార్డు గ్రహీత దరిపల్లి రామయ్య నిజమైన మట్టి పుత్రుడని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ సంతాప సదేశంలో కొనియాడారు. పర్యావరణ పరిరక్షణ, అడవుల పెంపకం పట్ల ఆయన అచంచలమైన నిబద్ధత తీవ్ర ప్రభావాన్ని చూపిందని పేర్కొన్నారు. దరిపల్లి రామయ్య పర్యావరణ రక్షణకు పాటుపడుతూ తన జీవితాన్ని అంకితం చేశారని, అయన సూచించిన మార్గం నేటి యువతకు ఆదర్శం కావాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు.

**మంత్రుల సంతాపం**

పద్మశ్రీ దరిపల్లి రామయ్య మరణం పట్ల మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ తీవ్ర సంతాపం తెలియజేశారు. చెట్లను నాటడం, పెంపకం పట్ల ఆయన జీవితాంతం అంకితభావంతో పనిచేసి ప్రకృతిని రక్షించడంలో మహాయోగిగా నిలిచారన్నారు. ఆయన కుటుంబానికి మనోధైర్యాన్ని నింపాలని వారు భవతంతున్ని ప్రార్థించారు.

**ప్రకృతికి తీరనిలోటు : టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్**

రామయ్య మరణం ప్రకృతికి తీరనిలోటు అని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ అన్నారు. రామయ్య మృతి పట్ల మహేష్‌కుమార్‌గౌడ్ ఒక ప్రకటనలో సంతాపం తెలియజేశారు. నేటి యువత రామయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ఆయన ఆశయాలను నిలపాలని మహేష్‌కుమార్ కోరారు.

**సిపిఐ పార్టీ నేతల నివాళి...**

వనజీవి రామయ్య మృతికి సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ మొహమ్మద్ మౌలానా, రాష్ట్ర సమితి సభ్యులు సిద్ధినేని కర్ణకుమార్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికల రామకృష్ణ భౌతికకాయాన్ని సందర్శించి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అలాగే మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయ ఇంఛార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మద్ది మల్లారెడ్డి, రామ్మూర్తి నాయక్, మద్దులపల్లి మార్కెట్ చైర్మన్ భైరు హరినాథ్‌బాబు, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణు, సిపిఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, ఆర్‌డీఓ నరసింహారావు, తహాశీల్దార్ రాంప్రసాద్, ఆర్ఐలు ప్రసాద్, క్రాంతితో పాటు పలు పార్టీల నేతలు, ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నేతలు, సామాజికవేత్తలు నివాళులర్పించారు.

## బ్లాక్‌లిస్ట్‌లోకే...

**(మొదటి పేజీ తరువాయి)**

ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేద్దామన్నారు. ఎస్సీ డెవలప్మెంట్ కింద ఇచ్చిన సిసి రోడ్లను అధికారులు పూర్తి చేయాలన్నారు. అధికారులు కాంట్రాక్టర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేసి పూర్తయ్యే విధంగా దృష్టి సారించాలన్నారు. పనులకు సంబంధించిన బిల్లులను చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. వారం రోజుల్లో అన్ని టెండర్లు పూర్తిచేసుకుని పనులను ప్రారంభించాలన్నారు. రోడ్లు ఇక అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టడానికి సమీక్ష సమావేశాన్ని అధికారులతో నిర్వహించినట్లు పేర్కొన్నారు. పనులు నాణ్యతగా ఉంటేనే బిల్లులు చెల్లిస్తామన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో రోడ్లు, ఇతర అభివృద్ధి పనులను త్వరగా పూర్తయ్యే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. బాగా పనిచేసిన కాంట్రాక్టర్లకు మిగతా చోట్ల పనులను అప్పగిస్తామన్నారు. గడువును నిర్ణయించుకొని పనులు పూర్తయ్యే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. అంగన్వాడి కేంద్రాలను మరింత బలోపేతం చేస్తూ జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అంగన్వాడి కేంద్రాలలో పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఇందిరా మహిళా శక్తి భవనాలు పూర్తికాని చోట్ల పనులను త్వరగా ప్రారంభించాలన్నారు. గ్రామాలలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. ట్యాంకుల మరమ్మతులు ఉన్నట్లయితే సత్వరమే చేయించాలన్నారు. అంగన్వాడి కేంద్రాలలో పిల్లల సంఖ్య తక్కువ ఉన్నచోట్ల సమీపంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణకు తరలించే విధంగా చర్యలు చేపట్టాలని మహిళా శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యదర్శి అనితా రామచంద్రన్ కు సూచించారు. అన్ని అంగన్వాడి కేంద్రాలలో తాగునీరు, టాయిలెట్స్, తదితర సౌకర్యాలను సమకూర్చే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ తన నియోజకవర్గం లో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో కంకర వేసిన రోడ్లు అసంపూర్తిగా ఉన్నాయని వాటిని పూర్తిచేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. అదేవిధంగా ఎస్సీ కాలనీల్లో సీసీ రోడ్లు పూర్తి అయ్యేవిధంగా కృషి చేయాలన్నారు. జనగామ జిల్లాలో రోడ్లు, ప్రభుత్వ భవనాలు, వంతెన, ఇతర అభివృద్ధి పనులు, సమస్యలను జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మహబూబాబాద్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ తమ నియోజకవర్గాలలోని అసంపూర్తిగా ఉన్న రోడ్లు, ఇతర అభివృద్ధి పనులను పూర్తిచేయాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నగరంలోని అంగన్వాడి కేంద్రాల్లో సరైన వసతులు లేవని, వసతులు కల్పించాలని ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో వరంగల్ మహబూబాబాద్ ఎంపీలు డాక్టర్ కడియం కావ్య, పోరిక బలరాం నాయక్, నగర మేయర్ గుండు సుధారాణి, రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ సెక్రటరీ అనితా రామచంద్రన్, హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, పంచాయతీరాజ్ ఈఎన్సీ కనక రత్నం, ఆర్ అండ్ బి ఈఎన్సీ కృపాకర్ రెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించిన అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM - 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com